BROWN BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204145
UNIVERSAL LIBRARY

# రఘుకుల చరిత్రము

ఇది

బ్రహ్మశ్రీ

చిలకమర్తి లక్ష్మీనరసింహాంగారిచే

రచియింపబడి

మట్టే సుబ్బారావుగారిచే

ప్రకటింపబడియె.

(రెండవకూర్పు-1000 ప్రతులు.)

కాకినాడ.

శ్రీసుజనరంజనీ ముద్రాక్షరశాల

(కాపీరైటు రిజిస్టరు)

# రఘుకులచరిత్రము

## దిలీపమహారాజు.

సూర్యవంశమునందుధర్మవేత్తయైనమనువుజనించెను. ఆతనివంశమున నిక్ష్వాకుఁడు ప్రభవించెను. ఇక్ష్వాకుకులమున మిక్కిలి ప్రఖ్యాతుఁడగు దిలీపుఁడు పుట్టెను. అతఁడు విశాలవక్షుఁడు. ఎగుభుజంబులవాఁడు. దీర్ఘకాయుఁడు. ఆజానుబాహుఁడు. అతివరాక్రమశాలి. సముద్రము వెలలేని మణులకు నిలయమై యెల్లవారికి సమీపింపఁ దగి యుండి, మొసలి మొదలగుక్రూరజంతువులకు నివాస మగుటచే భయంకరమై యుండునట్లు దిలీపుఁడు శాంతాదిసద్గుణములచేత నెల్లవారికినులభుఁడయ్యు నద్భుతపరాక్రమాదులచేత దుర్నిరీక్ష్యుఁడై యుండెను. అతఁడుభూమండలమంతయు నేకఛత్రముగఁ బరిపాలించెను. ప్రజలవల్ల నతఁడు పన్నులు గ్రహించెను; కాని సూర్యుఁడు సముద్రజలమును తనకరముల గ్రహించి మరల వర్షరూపమున మునుపు గొన్నదానికి వేయిరెట్లధికముగ నిచ్చునట్లు దిలీపుఁడు జను లిచ్చినపన్నులు తనభోగములనిమిత్తమై వినియోగింపక వారిచ్చిన సొమ్మునకు వేయిరెట్లధికమైనధనము వారినిమిత్తమైవ్యయముఁ జేయుచుండును. అతఁడు మగధరాజకన్యయైనసుదక్షిణాదేవిని వివాహ మయ్యెను కాని యామెవలన సంతానముఁ బడయఁజాలఁడయ్యె. సూర్యుఁడు మొదలుకొని పరంపరగ వచ్చినయిక్ష్వాకు కులసంతతితనతో నస్తమించుననియు "అపుత్రస్య గతి ర్నాస్తి" యని స్మృతులు వక్కాణించుటంజేసి తనకు దనపితృదేవతలకు నుత్తమగతులు ప్రాప్తింప వనియు విచారించి యామహీపాలుఁడు కులగురు వగువసిష్ఠుపాలి కరిగి మొరపెట్టికొనఁ దలఁచి రాజ్యభారము మంత్రుల [illegible] భార్యాసహితుఁడై రథమెక్కి మితపరివారముతో బయలుదేఱెను. మార్గ

మధ్యమునఁదన్నుఁ జూడవచ్చినపల్లియలలోనిజనంబులుసమర్పించినకానికలందుకొనుచు
వనవృక్షంబులసౌరభంబుల నాఘ్రాణించుచుఁ దమ్ముఁజూచి పరుగెత్తక నిలువఁబడి
విశ్వాసముతోఁ జూచు జింకలయమాయకత్వమును నేత్రసౌందర్యమును మెచ్చుచు
వృక్షచ్ఛాయల విశ్రమించుచు నెడనెడ వీచుమలయమారుతంబులచేమార్గాయాసము
నపనయించుకొనుచు నాశ్రమసమీపంబులనుండి పోవునెడ యజ్ఞధూమంబుల నాఘ్రా
ప సాయంకాల మగునప్పటికి వసిష్ఠాశ్రమముఁ జేరెను. అతఁ డేగునప్పటి
హోముని యగ్నిహోత్రము జేసికొనుచుండెను. విధివిధానంబుగ వేల్చినపిమ్మట
బ్రుఁడు శిష్యుఁ డైనదిలీపునియొక్కయు నాతనిధర్మపత్నియొక్కయు నమస్కా
రము లందుకొని దీవించి సముచితసత్కారములఁ జేసి కుశలప్రశ్నానంతరమునవచ్చిన
పని యేమి యని యడిగెను. అడుగుటయుదిలీపుఁడు గురువునకిట్లనియె. “మహాత్మా!
జగత్త్రయపూజ్యు లగుదేవరవారికి నేను శిష్యుఁడనై యుండియు నిరంతర దుఃఖ
భాజన మైతిని. సకలైశ్వర్యములు గలిగియు సంతానహీనుఁడ నగుటచే దీనుఁడ
నయితిని. పుత్రసంతానము లేనివారికి రత్నసంతాన మేల ? సౌఖ్యవితాన మేల ?
హంసతూలికాతల్పమునఁబండుకొన్నను ముండ్లపానుపుమీఁదఁ బండుకొన్నట్లుండును
దేహముసుఖపడుచున్నను మనస్సు నిరంతరపరితాపము పొందుచున్నది. నాయనంతర
మున భానువంశము సమాప్త మగుననియందుచేతఁ దమకుఁబిండప్రదానములుఁదిలో
దకంబులు నిచ్చువారుండ రని నాపితృదేవతలు భయపడి విషాదవశంబున నే నివ్వ
డిచ్చుపిండంబులు సరిగ భుజించుట లేదు. భానువంశ మంతరింపకుండఁ జేసి రక్షిం
పుము మహాత్మా!” అని పాదములపైఁ బడెను. దయాళు వైనవసిష్ఠుఁడు దిలీపునకు
సంతానము గలుగకపోవుటకుఁ గారణ మేమని విచారించి దివ్యదృష్టితోఁ జూచి యి
ట్లనియె. “రాజా! నీవొక యపరాధముఁ జేసితివి. అందుచేత సంతానము నీ కింత
కాలముదనుక గలుగలేదు. మున్నొకనాఁడు నీవు మహేంద్రునిజూడవచ్చి యతని
సందర్శించి మరలిపోవునపుడు నీమనస్సు నీభార్యమీఁద లగ్నమైనది. నీవు నందనో
ద్యానమువెంట నడిచి వెళ్ళుచుంటివి. ఆవనములో సుందరమైనకల్పవృక్షముయొక్క
నీడను కామధేనువు పవ్వళించి యుండెను. మనస్సు ప్రియురాలియందు లగ్నమై
యుండుటచే నీ వాకామధేనువును జూడవైతివి. ఆవేల్పుటావును నీవు నిరాకరించి
నందున నది నీకిట్లు శాపమిచ్చెను “రాజా! భార్యాకృష్టమనస్కుఁడవై మార్గమధ్య
మున నన్నుఁజూడక తిరస్కరించి పోవుచుంటివి. నన్ను సబహుమానంబుగ సేవించిన
గాని నీకు సంతానము గలుగదుతే.” ఆసమయమున నాకాశగంగలో మహేంద్రుని
పట్టపుటేనుఁగగు నైరావతము జలక్రీడ సేయుచు నానందముచేఁగొప్పఘీంకారధ్వని

చేసెను. ఆధ్వనివలన నేల్పుటావు పలికినశాపవచనములు నీకు వినఁబడ లేదు. ఆశాప
వశమున నీకుసంతానము గలుగలేదు. నాఁడు చేసినయపరాధము నేఁడెరిగితివి; గావున
దగిన ట్లనుతాపముఁ బొంది కామధేనువును సేవింప వలయు; కాని గామధేను విప్పుడు
స్వర్గమునందు లేదు. అది కార్యాంతమువిూఁద బాతాళలోకమున కరిగినది. అది
యింతలో రాదు. పాతాళలోకద్వారమున భయకరము లైనపాము లుండుటచే నీ
వచ్చటి కంటఁ జాలవు. కావున నీకొకయుపాయముఁ జెప్పెద వినుము. కామ
ధేనువుయొక్క పుత్రిక యగునందినీధేనువు నాయగ్నిహోత్రములకు నాయనుష్ఠానము
లకుఁగావలసిననేయి పాలునిచ్చుటకు నాకడనున్నది. అదియుదల్లియంతటి మహిమము
గలదే. నియమవంతుల రై నీవును నీధర్మపత్నియు దానిని కొంతకాలము సేవింప
వలయు. అది నీసేవకు మెచ్చి ప్రసన్నురాలై నీకు సంతానవరము నిచ్చును. ఆవర
ప్రభావంబున నీకు వంశకర్త యగుకుమారుఁడు జనించును. వచ్చినవాఁడవు రానే
వచ్చితివి. ఇచ్చటనుండి యీకోరికఁ దీర్చికొనుము.'' అనిమహర్షి యానతిచ్చుటయు
దిలీపుఁడును సుదక్షిణయు నతనిహితోపదేశమునకుఁ గడుంగడు నలరి యట్లు చేయఁ
గృతనిశ్చయు లైరి. వసిష్ఠుఁడు తనప్రభావము చేత వారికి రాజోచితము లగుసమస్త
భక్ష్యములను గల్పింప సమర్థుఁడయ్యు నారాత్రినుండియు వారికి నీమ మలవాటు
చేయుట కై మునిజనభోజ్యము లైనదుంపలు పండ్లు పాలు వారి కిచ్చి నీమవంతు లై
యజ్ఞశాలలోఁ బండుకొనునట్లాజ్ఞాపించి వెండియు నిట్లనియె. "రాజా! నందినీ
ధేనువు నుపాసింపవలసినవిధానముఁ జెప్పెద వినుము. ప్రాతఃకాలమునందు లేచి
నీవును నీభార్యయుఁ గాలకృత్యములం దీర్చికొని సుస్నాతలు కావలయు. పిమ్మట
దూఁడను విడిచినతరువాత నీభార్య నందినీధేనువును బువ్వులతోఁ బూజింప వలయు
అనంతరము నీ వాధేనువు నడవులకు దోలుకొనిపోయి పచ్చికపట్లను మేఁపి నీరు
ద్రావించి రక్షింప వలయు అది నడిచినప్పుడు నీవు నడువుము. అది మేయుచున్న
పుడు నీ వాహారముఁ దినుము. అది నీరు ద్రావినపుడు నీవు జలముఁ ద్రావుము అది
నిలిచినప్పుడు నిలువుము. అది పండుకొన్నపుడు కూర్చుండుము ఇట్లు సాయంకాలము
దనుక గాచి దానిని మరల నాయాశ్రమంబునకుఁ దోలుకొనిరమ్ము అట్లు చేయుదు
వేని నీమనోరథసిద్ధి కాఁగలదు.'' ఆపలుకులు విని సుదక్షిణాదిలీపులు మహాప్రసాద
మని మునికి మ్రొక్కి వీడ్కొలిపి యారాత్రి నిద్రించి తెల్లవారజామున మునికుమా
రులవేదాధ్యయనఘోషము చేత మేలుకాంచి కార్యంబులఁ దీర్చికొని సుస్నాతు లైరి.
సుదక్షిణ గంధపుష్పములచే నందినీధేనువు నర్చించెను. దూఁడ పాలుద్రావి తల్లిని
విడిచెను. దిలీపుఁడు దానిం దోలుకొని యడవికిఁ బోయెను. ఆహాహా! సార్వభౌ

యైనపుడు భూపాలుఁడు గోపాలుఁడగుట యాశ్చర్యమా? అతఁడు విల్లుఁ జేతఁబట్టికొని యాయావు వెంటఁ జనుచుండినను నతని గంభీరకాయమును మహాతేజమును లోకోత్తరరూపమును జూచినవా రందఱు నతఁడు సామాన్యపశుపాలకుఁడు కాఁడనియు మహాపురుషుఁడనియుఁ దలంచిరి. అతనిమీఁద నగరకాంతలు లాజలు చల్లెడునాచారము గలదు. ఆయడవిలో నట్టిగౌరవమున కవకాశము లేక పోయినను మార్గమున నిరుప్రక్కల నున్నవృక్షములు శాఖాహస్తములతోఁ బువ్వుల నతనిమీఁదఁ జల్లియా సాంప్రదాయమును నిలువంబెట్టినవి. వసిష్ఠుఁడు చెప్పినట్లు దిలీపుఁడా గోవు నీరుఁ గ్రోలినపుడు తాను దాహము ద్రావి పచ్చిక మేసినపు డన్నముఁ దిని పండుకొన్నపుడు శయనించి నడిచి నపుడు నడిచి దానినీడయుఁ బోలె దానివెంట నంటి నంచరించెను. అది కడుపాఱ మేసెను. అంతట సాయంకాల మయ్యెను సూర్యుఁ డపరాంబుధిఁ గ్రుంగునపుడు ధేనువు నతఁడు మరల వసిష్ఠాశ్రమమునకుఁ దోలుకొని వచ్చెను. సుదక్షిణాదేవి గోవున కెదురుగ వచ్చెను. గోవునకు ముందున్నసుదక్షిణాదేవి పగలువలె నుండెను వెనుక నున్న దిలీపమహారాజు చంద్రనక్షత్ర మగురాత్రివలె నుండెను. వారిద్దరినడుమ నున్నయెఱ్ఱని నందినీధేనువు పగటికి రేయికినడుమ నున్నసంధ్యవలె శోభించెను. ఆశ్రమమునుఁ బ్రవేశించినతరువాత సుదక్షిణ ధేనువును వెండియు గంధపుష్పముల నలంకరించి ప్రదక్షిణములు చేసి నమస్కరించెను ఇట్లు కడుశ్రద్ధతో దిలీపమహారాజు నందినీధేనువు నిరువదియొక్క దినములు సేవించెను. ఇరువదిరెండవదినమున నొకయద్భుతము జరిగెను. దిలీపుఁడు హిమాలయపర్వతము యొక్క యౌన్నత్యమును గాంభీర్యమును సౌందర్యమును జూచి పరమేశ్వరని సృష్టివైచిత్ర్యమును బ్రభావమును స్మరియించి నిరుపమానందసముద్రములో నోలలాడుచు నైమఱచి యుండెను. నందినీధేనువాకొండచరియలయందుఁ గొంత సేపు మేసిమేసి గంగానది హిమవత్పర్వతమునుండి భూమిమీఁదికి దిగునట్టిచోటికి సమీపమున నున్నయొకానొకగుహలోఁ బ్రవేశించెను. అది రాజు కనిపట్టలేక పోయెను. అప్పు డొకగొప్పయార్తనాదము వినఁబడెను. అది విని రాజు త్రుళ్ళిపడి యిట్టటు జూచునప్పటికి ధేనువు కంటఁబడలేదు. అధ్వని వచ్చుచున్నవైపునకు మిక్కిలి సంభ్రమమున రాజు పరుగిడి గుహ బ్రవేశించి చూచునప్పటికి నందినీధేనువుమీఁద నొకసింహ మెక్కి కూర్చుండి దానిం దినుటకై గొంతు నులుము చుండెను. రాజు విషాదమనస్కుఁడై యాదుష్టజంతువును సంహరింపఁదలఁచి విల్లెక్కు పెట్టి బాణము సంధించుటకై యమ్ములపొదిలోఁ జేయిపెట్టెను. ఆహస్త మాపాట స్తంభించి పోయెను. అందువలన బాణము దీయలేక పోయెను. చేయి కదుపలేక పోయెనువిల్లు

చేతఁబట్టుట వ్యర్థ మయ్యెను. అట్లు రాజు తనకోపము క్రియారూపమున, జూపుటకు వీలు లేక నేత్రములనుండి కోపాగ్నివిస్ఫులింగములు వెదజల్లు చుండఁ జూచియాసింహము మహాద్భుతముగ మనుష్యభాషణముల నిట్లనియె. “రాజా! నీవు విశేషశ్రమ పడనక్కఱలేదు. నీవు నామీఁద బాణము ప్రయోగించినను నది వ్యర్థ మగును. వాయువు చెట్లనె గూల్పఁజాలును గాని పర్వతములను నిర్మూలింప లేదు. నేనెవడను చెప్పెద వినుము. నేను శివునియనుచరుఁడను. నాపేరు కుంభోదరుఁడు శివుఁడు వృషభవాహన మెక్కునపుడు నావీపుమీఁద నడుగుపెట్టి దానినధిరోహించుచుండును ఆకారణమున నావీపు మిక్కిలి పవిత్రమైనది. నేనును మిక్కిలి పవిత్రుఁడను మన కన్నులయెదుట నొకదేవదారువృక్షమున్నది. అదిగోచూడు! మహేశ్వరుఁడుదానిని దనకన్నకుమారునివలె జూచును. పార్వతికిఁ గూడ దానిమీఁద పుత్రప్రేమమె. కుమారస్వామికిఁ బోసినట్లు పార్వతీదేవి యీవృక్షమునకుఁ గూడ నప్పుడప్పుడు స్తన్యము పోయును. ఒకనాఁడుమదపుటేను,గొంటెకిదురదపెట్టగా నీదేవదారవృక్షమును బట్టి తనమేను రాచికొనెను. ఆకారణమునవృక్షముయొక్కబెరడుకొంతయూడిపోయెను అందుచేతఁ బార్వతి యాచెట్టుకొఱకెంతో విచారించెను. రాక్షసులతోఁబోరిమేను గాయపడి వచ్చిన ప్రియపుత్రుఁడైనకుమారస్వామినిజూచినపుడామెకెంతవిషాదము గలిగెనో బెరడూడినయీచెట్టును జూడ నామె కంతవిషాదము జనించెను. నాఁడు మొదలుకొని మహేశ్వరుఁడు నన్ను సింహరూపుని జేసి యేనుఁగులను భయపెట్టుటకిక్కడ నిలిపెను. ఇక్కడకు వచ్చినజంతువు లన్నియునాకాహార మగును. ఇప్పుడు నేను మిక్కిలి యాఁకలిఁ గొనియున్నాఁడను దీనినెత్తురు ద్రావి దీనిమాంసము దిని సంతుష్టుఁడ నయ్యెదను. కావున నోరాజా! నీ విందు సిగ్గుపడవలసినదిలేదు. నీగురుభక్తి నీవు కనఁబఱచితివి శస్త్రములు పనిచేయనపుడు నీ వేమి చేయుదువు? ఇందు నీలోపము లేదు.” అని సింహరూపుఁడైనకుంభోదరుఁడు పలుక తనహస్తస్తంభనమునకు మహేశ్వరప్రభావమె కారణ మని తెలిసికొని యారాజు వాని కిట్లనియె. “ఓకుంభోదర! నాచేష్టలు స్తంభించుటచే నే నేమిపలికినను హాస్యాస్పదముగానె యుండును. అదియునుంగాక యెల్లవారిమనోవృత్తులునే నెఱుఁగుదు. అయినను నేను కొన్నిమాటలు చెప్పెదవినుము. సృష్టిస్థితిలయకారణభూతుఁడైనమహేశ్వరునియందు నా కత్యంతభక్తి కలదు. కాని యాహితాగ్నియైన మహర్షియొక్కధేనువు నిటులు చేయుట నీకుధర్మముకాదు. నీయాఁకలికి నాశరీరమునర్పించెదను నామేనిమాంసము దిని దీనిని విడువుము. సాయంకాలము కాఁగానె పాపము దానిదూడ పాలు లేక నోరెండిపోయి “యంబా”యని యఱచుచుఁ దల్లిరాకకెదురుచూచుచుండును అలేగ

దూడనిమిత్తమైన దీనిని విడువ వలయును." అనవుడు గుహలో నున్న కాఱుచీఁకటులు విరియునటులు తెల్లకోఱలు బయలుపుచ్చి నవ్వి యాకపటసింహ మిటులు రాజునకు బ్రత్యుత్తర మిచ్చెను "రాజా నీవు మంచి యాలోచన లేని మూఢుఁడు వలెఁ గనఁబడుచున్నావు. ఏలయన వయసుఁ జూడ నవయౌవనము మహీమండలమున కేకఛత్రాధిపతివి. అట్టి నీవు స్వల్పకారణమునకు శరీర మిచ్చెద ననుట మూర్ఖత కాదా? భూతదయచేత నటులు చేయుచున్నావందువేమో నీవు చచ్చుటవల్ల నొక్కయావు ప్రాణము మాత్రమే నిలుచును. బ్రతికియుంటివా కోట్లకొలఁది జనులను బాలించి తండ్రివలె సుఖపెట్టఁ గలవు. నీగురువగు వశిష్టుఁడు నీవు గోవును గోల్పోయినందుకు నీపై నలిగి శపించునేమో యని భయపడుచుంటివేమో ? యిన యగ్నిహోత్రముల కాజ్యము మొదలగునవి యిచ్చుటకు నీవిట్టి గోవులు కోటానుకోట్లియ్యఁగలవు అందుచేత సకల సౌఖ్యముల ననుభవింపవలసిన యీదేహము నెందుకు నిష్కారణముగ దుర్వినియోగముఁ జేసెదవు? సామ్రాజ్యము రెండవ దేవేంద్రపదము సుమీ. ఇంద్రునకు నీకు భేదమేమనఁగా నతఁడు స్వర్గమున నున్నాఁడు. నీవు భూమిమీఁద నున్నావు. ఇంతే మీయిరువురకు భేదము." అని సింగము పలుక గుహయెల్ల బ్రతిధ్వని వెడలెను. కుంభోదరుని యా పలుకులు విని నందినీధేనువు రాజుయొక్క కడుపు చుమ్మలుచుట్టునట్లు పేదచూపుల రాజుం జూచెను. దానిచూపులు చూచి రాజు మిక్కిలి జాలినొంది మాయాసింహమున కిట్లనియె. "అయ్యా! క్షతమునుండి రక్షించునది క్షత్రవంశము. అట్టిపని నేను చేయఁజాలనపుడు క్షత్రశబ్దము నాయందు వ్యర్థమైనది. ఆర్తరక్షణ జేయజాలని నాకు రాజ్య మెందుకు అపకీర్తిచేత మలినములైన ప్రాణము లెందుకు ? మహర్షికి నే ననేకధేనువుల నియ్యఁగలను. కాని యవి దీనికి సమానము లగునా ఇది కామధేనువుబిడ్డ. మహిమలో దానికిఁ దుల్యమైనది నేను దీనినిమిత్తమై నాశరీర మిచ్చుట, నీవు గ్రహించుట పరమధర్మము. దీనివలన రెండు కార్యములు తీరును. నీయాఁకలి శమించును. మహర్షియొక్క గోవు మహర్షికి నిలుచును. నీవును వేఱొకనికి సేవకుఁడవై యగుటచేత సేవాధర్మ మెఱుఁగుదువు. ఈదేవదారువృక్షము నీవు కాచునట్లె యీధేనువును నేను గాచుచుంటిని. మానవశరీరమును హింసించుట దూష్యమందువా? నా యీశరీరమును నీవు భక్షించి నిర్మలమైన నాయశశ్శరీరమును దయాళుఁడవై కాపాడుము. మావంటివారికి పంచభూతాత్మకమైన యీభౌతికశరీరముమీఁద నభిమాన ముండదని నీ వెఱుఁగుదువు. సంభాషణముచేతనే స్నేహము కలియునని పెద్దలు చెప్పుదురు. మనకిచ్చట సంభాషణమువలన స్నేహము కలిసినది. ఇట్టి ప్రణయమును నీవు వ్యర్థము సేయఁగూడదు. కావున నీధేనువును విడిచిపెట్టుము," అని వేడు

టయు సరే యనియాసింహము నందినీధేనువును విడిచెను. దిలీపునిహస్తము స్వాధీన
మయ్యెను. అతఁడు వింట బాణము సంధించుట మాని మాంసముముద్దవలె సింహము
నోటఁబడుటకుఁ దానిసన్నిధికిఁబోయెను. కుంభోదరుఁడు దనమీఁదఁబడి తన్నుచంపి
తినునని యారాజు తలంచి కన్నులు మూసికొని యుండ నతనిమీఁద విద్యాధరులు
కురిసినపుష్పవృష్టి గురిసెను. "కుమారా లెమ్ము లెమ్మని యమృతోపమానమైనవచన
మతనిచెవి సోఁకెను. అతఁడు కన్నులువిచ్చి చూచెను. ఎదుర సింహము లేదు. నందినీ
ధేను వొక్కటియె యతనియెదుట నుండెను. "కుమారా! నీకు నాయందు గలభక్తి
పరీక్షించుటకై నే నీచిత్రకథఁ గల్పించితిని. కాని యిదియెల్ల నిజము కాదు. నన్ను
వసిష్ఠప్రభావమున యముఁడు యమదూతలుసయితముహింసింపఁ జాలరు. తదితరులు
హింసింపఁ గలరా? నాయందు నీకుఁగలప్రేమకును మహర్షియెడ గలభక్తికిని మెచ్చి
తిని. కావలసిన వరము లడుగు మిచ్చెద. వట్టిపాలు మాత్రమె యిచ్చునట్టి సామాన్య
గోవును కాను. అనుగ్రహించి చేఁబట్టితినా సకలమనోరథములు సఫలములు చేయ
గల నని నందినీధేనువు పలికెను. అనవుడు దిలీపుఁడు హస్తములు మోడ్చి "తల్లీ!
వంశకర్త యగుకుమారుని సుదక్షిణాదేవియందు నాకు దయసేయు మని ప్రార్థిం
చెను. అటులె యిచ్చెద నాపాలు దొప్పెడు త్రాగుము. నీవుకోరినసంతానము కలుగ
గల దని ధేను వుత్తరము చెప్పెను, "అమ్మా! నీదూడ త్రాఁగినపిదప మిగిలినపాలు
మహర్షి యగ్నిహోత్రములకుఁ గావలసినవిచ్చి మహర్షి సెలవుఁ గైకొని యామిగిలిన
పాలుదొప్పెడు త్రాఁగెద" నని కృతజ్ఞాసూచకము లైననిరీక్షణములతో మనవి యొన
ర్చెను. అటులు వరముఁ బడసి ధేనువు నుదోలుకొని దిలీపుఁడు వసిష్ఠాశ్రమమునకుఁజని
మునికి భార్యకు యావద్వృత్తాంత మెఱిఁగించి గురుని యాజ్ఞాప్రకారము నందినీధేనువు
యొక్కక్షీరములు ద్రాగెను. వసిష్ఠుఁడు మఱునాఁడుదయమున వారిని స్వస్తి చెప్పి
పంపెను. పురజనులానందసమేతులై రాజును గారవించిరి. అనంతరము కొంతకాల
మునకు సుదక్షిణాదేవి గర్భవతియయ్యెను. దిలీపునిమనోరథసిద్ధికి మార్గ మేర్పా
సుదక్షిణసఖీజనులయొక్క కన్నులకుఁ జందమామయై కానఁబడెను.
పరంపరగ నిలుచుట కాధార మేర్పడెను. లేక లేక చూలు నిలుచు
సుదక్షిణాదేవి కోరినకోరిక లన్నియుఁ దీర్చుటకు సకలప్రయత్నము
యడిగినవస్తువు ముజ్జగంబులలో నెక్కడ నున్నను నతిచ
రాజు దానినచ్చటనుండి తెప్పించి యిచ్చుచుండెను. మ
బిలిచి "చూలాలైన మగధరాజపుత్రిక సిగ్గుపె పునఁ
జెప్పక దాఁచవచ్చును. కావున మీ రామెకోరిక

తెలిసికొని నా కెరిఁగించు చుండుఁడు. సమయోచితముగ నే నామె మనోరథములు సఫలము చేయు చుందు" నని చెప్పెను. సభీజనంబు లక్లై చేయఁజొచ్చిరి. క్రమ క్రమముగ గర్భభార మధిక మగుడు నామె విభూషణంబులు దాల్పక మిక్కిలి బడలి యుండెను. ఆమెయందుఁ దనకు వంశకర్త యగునందనుఁ డే జనించు నని దిలీపుఁ డువ్విళులూరు చుండెను. నవమాసంబులు నిండెను. అంతట నొకనుము హూర్తంబున నైదుగ్రహము లుచ్చదశలో నున్నసమయమున సుదక్షిణాదేవి నందనుని గనియెను. స్ఫురద్రూపి యైనయాబాలునితేజంబుముందట దీపకాంతులు వెలవెలఁ బోయెను. పుత్రోదయ మను మాట వినఁగానె దిలీపుఁడు పుత్రోత్సవముఁ జేసెను. రాజలాంఛనము లైనవెల్లగొడుగును జామరంబులును దక్క తక్కిన వస్తువుల నన్నిఁటి నాసమయమున దిలీపుఁడు దాన మిచ్చెను రాజధాని యగు నయోధ్యాపురమందలి జను లందఱు మేరమీరినయానందము నొందిరి. అనంత రము జాతకర్మనామకరణోత్సవములు జరిగెను. దిలీపుఁడు తనకుమారునకురఘువను పేరుఁబెట్టెను. ఈతని పేరనె సూర్యవంశము రఘువంశ మని ప్రసిద్ధ మయ్యెను. బాలకుఁడు దినదినాభివృద్ధి నొంది పాఁకెను. తప్ప టడుగులు పెట్టెను. దాదివ్రేళ్ళు పట్టుకొని నడచెను. జననీజనకులమనంబులు మహానందము నొందునట్లు మిక్కిలి మధు రము లైనపలుకులు పలుకఁ జొచ్చెను. పిమ్మటనన్నిమాటల నేర్చెను. అక్షరాభ్యాస ముఁజేసి విద్య నేర్పించిరి. గర్భాదశవర్షమునం దతని కుపనయనము జేసిదిలీపుడు వేదాదివిద్యల నేర్పింప నారంభించెను. వేదముతోఁబాటు ధనుర్వేదముఁ గూడ నతఁ డధిగమించెను. అశ్వారోహణము గజారోహణము సాములు వేఁట మొదలగువాని యందసమానుఁ డయ్యెను. ఆకారగాంభీర్యమునందు సౌందర్యమునందుమనోబలము నందు బుద్ధివైభవ మందు రఘువునకు రఘువే సాటి యనియు దిలీపునకుఁ దగినవాఁ

మిచ్చుక్షనియు నతఁడు సూర్యవంశప్రదీపకుఁ డనియుజను లందఱుఁ జెప్పుకొనిరి. వయస్సు నీయాఁకలిస్తతరువాత నతఁడు తండ్రియంతవాఁడయ్యెను. సర్వగుణసంపన్నుఁ డైన సేవకుఁడవె యీక్షని రాజకన్యలు పలువురు వరించి ధన్యలైరి. మహాబలసంపన్ను లైన నట్లె యీాధేసువును పలను శత్రురాజు లెవ్వఁరుఁ దేరి చూడఁజాలరైరి. ఆకుమారుని దువాగి నా యీశర ...డు తొంబదితొమ్మిది యశ్వమేధములు చేసెను. ప్రతియాగ ఘుఁడ వైశాపాడును ... సారథ్యుఁడై కతిపయసైన్యసమేతుఁడై యశ్వమువెంట వెళ్ళు వెల లేన్యము శత్రువులచేత బట్టుపడ లేదు. ఆయాగంబు మీఁద నభిమాన ముండదసి రా జులు దిలీపున కర్పించవనిరాజులు దిలీపుని పాదములకు నని పెద్దలుచెప్పుదురు. మనకిచ కాలంబున మహీమండలమున లేరు. మును నీవు వ్యర్థము సేయఁగ

ఇట్లు నిర్విఘ్నముగఁ దొంబదితొమ్మిది యాగంబులు చేసినపిదప నూఱవ యశ్వమేధముగూడఁ జేసి యింద్రునివలె శతక్రతుఁడు కావలయు నని దిలీపునకుఁ గోరిక పుట్టెను. కుమారుఁడు లెస్స యనెను. అంతట నూఱవయాగ మారంభింపఁ బడెను. యాగాశ్వము వెంటఁ గొందఱుసైనికులతో యువరాజగు రఘువు బయలు దేఱెను. ఆగుఱ్ఱమును మనుష్యమాత్రు లెవ్వరు తెగించి హరింపఁజాలక పోయిరి. భూమియం దున్నహయమును మానవులకుఁ గానఁబడకుండ దేవేంద్రుఁడు హరియించెను. తిరస్కరిణీవిద్యాప్రభావమున హయము గాని మహేంద్రుఁడు గాని వారి కెవ్వరికిఁ గానఁబడ లేదు. అందఱు విస్మయాకులితచిత్తులై విషాదపూరితులై యుండిరి. అప్పుడు రఘువు తమకిలువేల్పని చెప్పదగిన వశిష్ఠమహామునియొక్క నందినీ ధేనువును దలంచెను. అది వెంటనే ప్రత్యక్షమయ్యెను. రఘువు దానిమూత్రముతోఁ దనకన్నులు కడిగికొని నలువంకలఁ జూచెను. పట్టికన్నులకు గోచరము కానివిషయ మెల్ల నప్పుడతనికి గోచర మయ్యెను. ఆకాశమునందు రథము కనఁబడెను. అందు దేవేంద్రుఁడు కూర్చుండెను. యాగాశ్వము పగ్గములతో రథమునకుఁ గట్టివేయఁ బడెను. కాని యది యచ్చట నిలువక యాగడము సేయుచుండెను. రథసారథి యైన మాతలి కొరడాతో దాని నదలించుచుండెను. మఖాశ్వమును మహేంద్రుఁడే హరియించె నని నిశ్చయముగఁ దెలిసికొని రఘువు గంభీరస్వరముతో ని ట్లనెను. "ఓమహేంద్రా! యజ్ఞభాగభోక్తలలో నీవే మొట్టమొదటివాఁడ వని పండితులు పలుకుచున్నారు. నిరంతరయజ్ఞదీక్షితుఁడై దేవప్రియుఁడై పవిత్రుఁడై వెలయుచున్న నాతండ్రియొక్క యాగక్రియలకు నీ వేల విఘ్నము చేయుచుంటివి; నీవు త్రిలోకనాథుఁడవు. యజ్ఞములకు విఘ్నములు చేయునట్టి దురాచారులను నీవు విల్లుఁ బూని దండింప వలసిన వాఁడవు అట్టి నీవే స్వయముగ యాగమునకు విఘ్నము చేయఁదలచినపక్షమున నఖిలవైదికానుష్ఠానము లంతరింపవా; అందుచేత మాయాగాశ్వమును మాకిమ్ము. మంచినడతలకు మీరు మార్గప్రదర్శకులు. అట్టిమీ రపమార్గంబుల సంచరింతు రేని సకలధర్మంబులు నశించిపోవు." ఇటులు దిలీపనందను మేఘగంభీరఘోషములతో మందలించుటయు నడుచుచున్న రథము మ
మాతలి కానతిచ్చి మహేంద్రుఁ డాతని కిటులుత్తరము సెప్పెను. "
నీ వాడిన దంతయు నిజమే. ఎవరియశంబు వారు కాపాడుకొన
నూఱుయాగములు చేసి నాకీర్తిని గప్పివేయఁ దలంచ
నే నీయశ్వము నపహరింపక మానను. ముజ్జగంబులకు
నగ్రగణ్యుఁడ నై ముప్పదిమూఁడుకోట్ల దేవత
చింతామణీరత్న ప్రముఖ వస్తువులకు నా

నీతండ్రియు శతక్రతుఁడు. ఇంక మాకు భేద మేమి? అదియునుగాక ఏయొక్క హరియందె పురుషోత్తమశబ్దము సార్థక మగుచున్నది. త్రిలోచనునియందె మహేశ్వరశబ్దము రూఢ మైనది. శతక్రతుశబ్దము నాకొక్కనికె యన్వయించుచున్నది. శతక్రతుఁ డింకొకఁ డుండఁ గూడదు. తెలియక నీవు వెట్టిప్రయత్నములు చేసితివా నీపూర్వులైన సగరుని కొడుకులకుఁ బ్రాప్తించినగతియే నీకును బ్రాప్తించు." అని యింద్రుఁ డానతిచ్చుటయు రఘువు కోపోద్దీపితుఁడై మహేంద్రా! యశ్వమును విడువ వేని విల్లుఁ బూని యుద్ధమునకు రమ్మని పలికి ప్రత్యాలీఢపాదుఁడై వింట శరము సంధించి మహేంద్రునిపై బాణములు ప్రయోగించెను. అమరనాయకుఁడును బ్రతిఘటించి వానిపై నొక యమ్ము నేసెను. అది రాజకుమారునివక్షమును నాట నెత్తురుదొలఁగెను. అంతట రఘువు దేవేంద్రునిచేతులమీఁద నిజనామచిహ్నితములైన సాయకముల విడచెను. అప్పుడుభయులకు నందడికయ్యము జరిగెను. ఇంద్రునిబాణము లధోముఖముగాను రఘుబాణము లూర్ధ్వముఖముగాను ప్రసరించెను. రఘుప్రయుక్తములైన బాణములచేత నొచ్చి మహేంద్రుఁడు తనవజ్రాయుధమును గ్రహించి రాజకుమారునిపై నేయఁజొచ్చెను. కొండలు పిండిచేయఁగల యమ్మహాయుధము వక్షమున నాటుటయు రఘువు రథముమీఁద మూర్ఛిల్లెను. అతనిసైనికులు విషణ్ణహృదయులై విలపించిరి. అంతలో రాజకుమారుఁడు మూర్ఛ తెలిసి లేచి మరల విల్లెత్తి యింద్రుని దాఁకెను. అంతట మహేంద్రుఁడు ప్రీతుఁడై యతని కిట్లనియె. "రాజకుమారా! నావజ్రాయుధము దెబ్బఁ దిని బ్రతికినవాఁడు లేఁడు. నీ వది సహించిన మహాశూరుఁడ వగుటచేత నీకు వర మిచ్చెద. యాగాశ్వమును దక్క మఱి యే దేని నడుగుము." అనవుడు రఘువు పొదిలోనుండి తీయుచున్న సువర్ణపుంఖము గలబాణమును విడిచి చేతులు జోడించి నమస్కరించి యిట్లనియె. "మహాప్రభూ! యాగాశ్వము నీయఁ దలఁచుకొనకపోయినపక్షమున యజ్ఞదీక్షితుఁడైన నాతండ్రికి యాగఫలము దక్కింపుము. అశ్వమును విడిచి నే నింటికి వెళ్ళినపక్షమున ఇంద్రసమానుఁడైన నాతండ్రి నన్నేమనునో. అందుచేత నిచ్చట జరిగిన యావద్వృత్తాంతము నీవె ముందుగ నాతండ్రికి వర్తమాన మంపుము." అనవుడు మహేంద్రుఁడు సమ్మతించి …గుదంతముఁ దెలుపుమని మాతలిని దిలీపునికడ కంపెను. అనంతరము రఘువు …చెను. కుమారుని యకుంఠితవిక్రమము విని యతఁడు సంతసించి …కొనగూడినందుకుఁ దన్ను గృతార్థునిగ నెంచికొనియెను. వార్ధక …రాజ్యము రఘువున కిచ్చి తపోవనమున కరిగి పిమ్మట తొంబది …డు మెట్లదారిని స్వర్గమెక్కెను. ఉత్తరకోసలదేశము

# ర ఘు మ హా రా జు.

——:)o(:——

పిమ్మట నంతరము రఘువు రాజ్యాధిపత్యము వహించి సాయంకాలము సూర్యుని తేజముగూడ తానె వహించుచున్న అగ్నిహోత్రునివలె మిక్కిలి ప్రకాశించెను. దిలీపుని యనంతరమున రఘువు రాజ్యప్రతిష్ఠితుఁడైనాఁడని విని నదివఱకె యీర్ష్యాగ్నిచేత పొగరాజుచున్న శత్రురాజుల హృదయములందు మంట బయలుదేఱెను. ఆరఘువు పితృసింహాసన మాక్రమించినట్లె స్వల్పకాలములో సమస్త శత్రుమండలము నాక్రమించెను. అఖిలైశ్వర్యము లిచ్చి లక్ష్మి సేవించెను. వందిమాగధులు చేయు సార్థకస్తుతులలో జేరి సరస్వతియు నామహీపాలుని సేవించెను. పూర్వము మనువు మొదలగు ననేకమహారాజులచేతఁ బరిపాలింపఁబడినను వసుంధర యావఱకెవ్వరిచేతను బరిపాలింపఁబడనట్లు రఘు వొక్కనిచేతనె పరిపాలింపఁబడినట్లుండెను. మిక్కిలి చలిగా నుండక, మిక్కిలి వేఁడిగా నుండక సుఖప్రదముగ నుండు మలయమారుతమువలె నామహారాజు మిక్కిలి మెత్తనివాఁడు గాక మిక్కిలి కఠినుఁడు గాక దోషములకుఁ దగినదండనలు సేయుచుండుటచేత మహీజనుల కాతనియందనురాగము కలిగెను. రుచిమంతములై సువాసనను గలిగినపండ్లు ...... మామిడిచెట్టుయొక్క పూఁతమీఁద ననురాగము పోయి పండ్ల ...... నట్లు పూర్వులకంటె మహోదారుఁడైన రఘువు పరిపాలనను. అన్నివిధముల భూజనులు దిలీపుఁడు మొదలగువారిని మఱచిరి. అంతకు మును చేతఁ జంద్రుఁడును లేదు; కావున నీతికోవిదులైన మంత్రిపుంగవులు రఘువునకుఁ ...ప్రకృతిజనరంజనములను ధర్మయుద్ధరహస్యములను నెఱిఁగించిరి. కాని రఘువు ...కాలలోచనుఁడైన ...కగపడు బాహ్య యాసక్తిగలవాఁడయ్యెను. భూమి విశేషముగఁ పంటలు పం... ...గిసికొనఁజాలెను
చేత భూమి క్రొత్తదైనట్లు కనఁబడెను. ఆహ్లాదము కలి... ...కఁడు
దపియించుటచేతఁ దపనుఁడును, సార్థకనామధేయు...
చేత రఘువు రాజశబ్దము సార్థకము చేసెను. ఆత...
ను శాస్త్రమనియెడు విశేషలోచనముఁగూడ గల...
వస్తువులనె గాక కన్నుల కగపడని సూక్ష్మవి...
లోఁబడినరాజుల నాదరించియుఁ బగ స...
రాజ్యము ...క్కఁబెట్టుకొనునప్పటికి శ...

సమాప్తమగుటచే వానలు వెనుకఁబట్టెను. అంతకుమున్ను బురదలై దుర్గమములైన మార్గములు తీవ్రమైన శరత్కాలపు టెండచే నెండి ప్రయాణసులభము లయ్యెను. ఆయెండకుఁ దోడుగ రఘుమహారాజుయొక్క దండయాత్రాసంబంధములైన ప్రతాపపు టెండలుఁగూడ దిక్కుల వ్యాపించెను. వర్షాకాలమం దాకాశమున వ్యాపింపజేసిన తనధనుస్సు నింద్రుఁ డుపసంహారము జేసెను. ఇంద్రధనుస్సు కనబడుట మానిన తోడనె రఘువు దిగ్విజయమునిమిత్తము తనధనుస్సు నెత్తెను. పాడిపంటలు పెంపు చేయుటకై యింద్రుఁడు తనధనుస్సును వ్యాపింపజేయుట చేతను దుష్టజనదండన మొనర్చి భూమి నిష్కంటకముగాఁ జేయుటకై రఘువు తనధనుస్సు నెత్తుటచేతను భూమి దేవేంద్రరాజేంద్రులచేత మిక్కిలి సుఖపడెను. చల్లదనమును వెదజల్లుచున్న యాశరత్కాలచంద్రమండలమును దయారసమును జిలుకునట్టి యారాజచంద్రుని మొగమును జనులు సమానానందముతోఁ జూచి తనిసిరి. దిగ్విజయమువలనఁ గలిగిన యారఘుకీర్తి నదులలోఁ దెల్లదామరగమియై రాజహంసల గుంపై యాకాశమున నక్షత్రమాలయై పండువెన్నెలయై ప్రకాశించెను. ఆబాలగోపాలముచేత వినుతింపఁబడుచున్న యారఘుమహారాజుకీర్తిని చెఱకుతోటలలో గడలనీడలఁ గూర్చుండి పంటకాపులకూఁతులు విలాసముగాఁ బాడ జొచ్చిరి. ఆశరత్కాలమం దగస్త్యుఁ డుదయించెను. అతఁడు పొడగట్టినతోడనె నదులు బురద విడిచి తేటనీరు గల వయ్యెను. ఆసమయమున శత్రురాజులహృదయములు పరాభవశంకచే మలినము లయ్యెను. ఆశరత్కాలమున నీటిగట్లఁ గోరాడుచున్న మహావృషభములు శత్రుమండ ...ముపై నరిగినరఘువలె విజృంభించి యుండెను. ఏరులు కాలినడక నేగుటకు

...లు గలిగి యుండుటచే నతనిదండయాత్ర సులభమయ్యెను. అతఁడు

...గ్నని సేవించి చతురంగములం గూర్చుకొని దిగ్విజయయాత్ర

...ను. అతఁడు బయలుదేఱునపుడు పురమందలి పెద్దముత్తయిదు

... నతనిమీఁదఁ దెల్లనిపేలాలు చల్లిరి. అటులచల్లుటచేత క్షీరసా

...బిందువులచేఁ దడుపఁబడిన నారాయణుఁడువలె నతఁడు

...న యారాజు ముందుగాఁ దూర్పుదిక్కుపై నరి

...ను శత్రురాజులను బెదరించునటు లుండెను. రథ

...నమున వ్యాపించుటచే నాకాశము భూమివలె

...పుటేనుఁగులతో నిండి యుండుటచే భూమి

... నతనిప్రతాపము నడచెను. తరువాత

...దుమారము నడచెను. అనంతరము

రథములు మొదలగుబలములు నడచెను. తక్కినరాజులచతురంగబలములట్లు గాక రఘుమహారాజుయొక్క బల మీవిధముగ నక్రజమై నాలుగువిధములను నడచెను, అతఁడు తనదిగ్విజయయాత్రయందు వట్టిమొడాకులలోఁ దియ్యనినీరు పుట్టించెను. నదులను నావలచే దాఁటెను. అడవుల నరికించి దేశము వెల్లడి చేసెను. అతఁడు ముందు నడచుచుండఁగా నాగొప్పసేన యతనివెంట ననుసరించి తూర్పు ముఖముగఁ బోయెను. అది చూడఁ దనవెనుక గంగానది వచ్చుచుండ ముందు నడచుచున్న భగీరదుఁడువలె నతఁడు శోభిల్లెను.

ఇట్లు తూర్పుదిక్కున నున్నరాజుల నెల్ల జయించి యతఁడు తాటితోటలతో నిండియున్న తూర్పుసముద్రతీరముఁ జేరెను. నదీప్రవాహముచేత గొప్పవృక్షములు కూలిపోవుచుండి చిన్నదైన నీటిప్రబ్బలి నిర్మూలము గాకుండ నిలిచినటుల గొప్పమహారాజు లనేకులు రఘువుచేఁ బడి కూలుచుండ సుహ్మదేశస్థులైన రాజులతనికి నమస్కరించి యాత్మసంరక్షణముఁ జేసికొనిరి. వంగదేశపురాజులు తమయోడలబలముతో నతనిని దాఁకిరి. కాని వారి నవలీలగ నతఁడు జయించి గంగానదీద్వీపములలో ననేకజయస్తంభములు నాటెను. వంగభూపాలుర నతఁడు మొదట రాజ్యములుండి తొలఁగించి వరిమొక్కలను మొదటఁ బెల్లగించి మరల నాటినట్లు కరుణించి వారిని మరల రాజ్యప్రతిష్ఠితులం జేసెను. అనంతర మతఁడు మదపుటేనుఁగుల వంతెన నిర్మించి కపిశానదిని దాటి యుత్కలదేశస్థులు తనకు దారి జూప కళింగదేశముజేరెను. కళింగరాజు మితిమీఱిన యేనుఁగులదండుతో రఘువు నెదిరించెను. కాని యతని నోడించి రఘువే జయము గాంచెను. రఘుమహారాజుయొక్క సైనికులు తమలపాకులతో దమకు నెలవు లేర్పరచుకొని శత్రువులకీర్తిని దీర్చినట్లే కావలసినంత కొబ్బరికల్లుఁ ద్రాగిరి. ఆరఘుమహారాజు కళింగమహారాజును బట్టుకొని కరుణించి విడిచి యతనిరాజ్యము నపహరింపక సంపదమాత్ర మపహరించెను. పిమ్మట నతఁడు పోకతోటలతో నిండిన సముద్రతీరమువెంట నరిగి దక్షిణదేశముఁ జేరెను. అచ్చట నతనియేనుఁగులు సైనికులు కావేరీనదియందు యథేచ్ఛముగ జలక్రీడసలిపి దానిం గలఁచివైవ నది తదంగరాగముచే మలినమయ్యెను. అనంతర మాదేశమాక్రమించి యతఁడు మిరియపుచెట్లతో నిండిన మలయాద్రి కరిగెను. ఏలాలతలతోడను మంచిగంధపుచెట్లతోడను నిండినయామలయాద్రిని బాసి యారాజు పాండ్యదేశము చేరి యేరాజుప్రతాపమునకు వెఱచి సూర్యుఁడు నయితము మందతేజముతో సంచరించునో యాపాండ్యరాజు నవలీలగ జయించెను. పాండ్యరాజు సామంతులతోఁగలిసి తామ్రపర్ణీనదీసాగర సంగమంబునఁ దమపెద్దలనాట నుండియు సంగ్రహింపఁబడిన

కట్టాణిముత్యాలరాసులు తమయశస్సు నిచ్చినట్లె రఘుమహారాజు కల్పించి సంధిఁ జేసికొనిరి. పిమ్మట నతఁడు భూదేవిపాలిండ్లవలె నొప్పినమలయదర్దురపర్వతములను దాటి మహీదేవికటిమండలమువలె నున్న సహ్యపర్వతము నెక్కి సుఖించి యవ్వలఁ బశ్చిమదిశాభిముఖుఁ డయ్యెను. పూర్వకాలమున సముద్రము సహ్యపర్వతమునంటి యుండఁగా భార్గవరాముఁడా సముద్రమును దూరమునకుఁ దఱిమివైచెను. పర్వతమునకు సముద్రమునకు నడుమ రఘుసైన్యములు విడిసి యుండుటచే సహ్యపర్వతప్రాంతములనుండు జనులు సముద్రము మరల వచ్చి యాక్రమించుకొనెనో యని శంకించిరి. కేరళస్త్రీలు రఘువుయొక్క దాడి జూచి వెఱఁగంది నగలు పెట్టికొనుట మానిరి. అలంకారములు లేనివారి ముంగురులకు రఘువుయొక్క సైన్యములు నడచుటవలన లేచినధూళి యొరపుచూర్ణమై యొకవింతయందమును దెచ్చెను. మురళానదీవాయువులచేత రేఁగిన మొగిలిపూదుమారము రఘుసైనికులయొక్క కవచములపైఁబడి బుక్కాచల్లినట్లయ్యెను. ఈవిధముగ నరిగి యతఁడు పశ్చిమదిక్కంతయు జయించెను. పశ్చిమదేశమందలి త్రికూటపర్వతము రఘుమహారాజుయొక్క మదపుటేనుఁగులదంతప్రహారములు గలదగుటచే నతఁడు కట్టించినజయస్తంభమువలె నుండెను. అనంతరము రఘువు పరమయోగిజ్ఞానవైభవముచేత నింద్రియములను జయించునటులు బలసంపదచేఁ బారసీకదేశమును జయించుటకై మెట్టదారినిఁ బయనమై వెళ్ళెను. గుఱ్ఱపుసేనలె ప్రధానముగఁ గలపారసీకరాజులకును రఘువునకును సంకులసమరమయ్యెను. ఆయశ్వముల డెక్కలచే రేఁగినదుమ్ములో యోధులమొగములు కనఁబడమి ధనుష్టంకారముచేతనె ప్రతియోధు లున్నట్లు తెలిసికొనవలసి వచ్చెను. గడ్డములు మీసములుగల పారసీకులతలలు రఘుమహారాజు బల్లెములతో దుంపనవి యీఁగలతో గూడిన తేనెపట్లవలె నుండెను. హతశేషులైన పారసీకులు బొమిడికములు తీసి రఘువును శరణుజొచ్చిరి. శరణాగతవత్సలుడైన రఘువు వారి కభయప్రదానమిచ్చి రక్షించెను. మహాత్ములకోపము దండప్రణామములతోనుపశమించును గదా. యుద్ధానంతరమున రఘువుయొక్క సైనికులు ద్రాక్షపొదరిండ్లతో దోలుకంబళ్ళు పఱచుకొని కూర్చుండి ద్రాక్షసారాయి ద్రాగి యుద్ధశ్రమముఁ బోఁగొట్టుకొనిరి. అనంతరము రఘు వుత్తరదిక్కునకరుగఁదలఁచి సింధునదీతీరముఁ జేరెను అచ్చట హూణరాజు లతని నెదిరించినందున వారిని జయించి వారియంగనల మొగములకు వికాసము తగ్గించెను. కాంభోజరాజులు రఘువుదాడ కాగలేక వినమ్రులై మిక్కిలి యున్నతములైన గుఱ్ఱములను, బంగారుముద్దలను దెచ్చి యతనికి కానుక లిచ్చిరి. అచ్చటనుండి యానరపాలుఁడు గుఱ్ఱపుదళము దీసికొని హిమవత్పర్వత

శృంగములనెక్కెను. భటులకోలాహలములచే సింహములకు నిలయములైన హిమాలయగుహలు ప్రతిధ్వనులిచ్చెను. మందాకినీనదీతరంగములతుంపురలతోఁగలిసి వెదురుపొదలలోఁదూఱి శ్రావ్యగానము సేయుచు మలయమారుతము ససైన్యముగ మహారాజును స్పృశించి యతని కానంద మిచ్చెను. సురపొన్నచెట్లనీడలను కస్తూరిమృగములు పండుకొని లేచినరాతిబండలపై విశ్రమించి రఘుసైనికులు పరమానందము నొందిరి. ఆపర్వతముమీఁద విడిసిన రఘుమహారాజునకు రాత్రులు జ్యోతిష్మతీలతలు స్వయముగఁ వెలిఁగి యేనుఁగుమెడగొలుసులలో బ్రతిఫలించి చమురులేనిదీపములై యంధకారమును బాపెను. ఆపర్వతముమీఁద రఘుమహారాజునకును నుత్సవసంకేతులనుకొండజాతిజనులకును. ఘోరయుద్ధము జరిగెను. ఆయాటవికులు విసరినరాళ్ళయొక్కయు గుదియలయొక్కయు రాపిడిచేత నిప్పులు జనించెను. అదివఱకెన్నఁడుఁ బరాజయ మెఱుఁగనియాయాటవికులు క్రొత్తగా నోడిపోవుటచే రఘువరాక్రమము నిరుపమానమని తెలిసికొనికిన్నరు లాయనయశఃప్రబంధము గానము చేసిరి. ఆయాటవికులు పరాజితులైనపిదప రఘువునకు వెలలేని కానికలఁదెచ్చి యిచ్చిరి. ఆ కానికల వలన హిమవంతుఁడెంతసంపన్నుఁడో రఘు వెఱిఁగెను. రఘు వెంతబలాఢ్యుఁడో హిమవంతుఁడు తెలిసికొనెను. అనంతర మతఁడు కైలాసపర్వతముమీఁదికి వెళ్ళఁదలఁచెను. కానిపూర్వము రావణుఁడు దానిని గెలుచుటచేత నొకఁడు గెలిచినదానిని మరల పట్టఁదలఁచుట హాస్యాస్పదమని భావించి దానిని పట్టుకొనక క్రిందికి దిగి ప్రాగ్జ్యోతిషాధీశుమీఁది కరిగెను. సైనికులరాశవలన రేఁగినదుమారముఁ జూచియె యతఁడు కంపించి వినమ్రుఁడయ్యెను.

వీరులకు వీరుండైన యారఘువు పిమ్మట కామరూపదేశముపై దండెత్తెను ఏయేనుఁగులచేత నాకామరూపదేశాధీశ్వరుఁడు తనపగతురనెల్ల గెలిచి బలాఢ్యుఁడని పేరు వడసెనో యామత్తేభములను రఘువునకుఁ గానికగ నిచ్చి యతఁడు లోఁబడి రఘువుయొక్క పాదములను బంగారుపీటపైఁ బెట్టి దేవతాపాదములనట్లు పుష్పములకు బదులుగ రత్నములఁ బెట్టి పూజించెను. ఇట్లు దిగ్విజయము చేసి రఘు వెల్ల రాజులను జయించి భూమి కేకచ్ఛత్రాధిపతియై రాజధానికి మరల సర్వధనదక్షిణగలవిశ్వజిద్యాగమును జేసెను, మహాత్ములు ధనము సంపాదించుట దానముకొఱకె గదా! ఆయజ్ఞము ముగిసినపిదప మున్ను దిగ్విజయములోఁ దన కోడి తనసేనలోఁ జేరి తనవెంట వచ్చినరాజుల నెల్ల సత్కరించి చిరవియోగముచేత బాధపడుచున్న వారిభార్యలకడకు వారిని పంపెను. ఆనృపు లందఱు ననేకశుభలక్షణలక్షితమైన రఘువు పాదయుగంబునకు మ్రొక్కి స్వదేశములకు మరలిరి.

విశ్వజిత్తను యజ్ఞమునందు రఘుమహారాజు సమస్తధనము బ్రాహ్మణులకు దానముచేసి యుండఁగా గురుదక్షిణనిమిత్తము సొమ్ము కావలసి వరతంతుమహాముని శిష్యుఁడైన కౌత్సుఁడనువాఁడు మిక్కిలి యాసపడి యతనికడకు వచ్చెను. బంగారమంతయు దానముగనిచ్చివేయుట చేత రాజు మంటిమూఁకుడులో నర్ఘ్యపాద్యములం బెట్టికొని యెదురుగాఁ బోయి యామునికుమారుని నెదుర్కొని గౌరవించి తీసికొనివచ్చి యుచితాసనముమీఁదఁ గూర్చుండఁబెట్టి యిట్లు పలుకరించెను. "ఓకుశాగ్రబుద్ధీ! సూర్యునివలన లోకము చైతన్యము బొందినట్లు నీ వేమహాత్మునివలన జ్ఞానోపదేశముఁ బొందితివో యామహాత్ముఁడు మంత్రకర్తలైన ఋషులలో నగ్రగణ్యుఁడు. నీగురువు కుశలముగ నున్నాఁడా? అంతఃకరణశుద్ధిగ మనోవాక్కాయకర్మములచేత నేతపస్సు నీగురువు చేయుచున్నాఁడో యేతపస్సు మహేంద్రునకు నయితము మహాభయముగలిగించునో, యాతపస్సు పాశాదులచే వ్యయముగాకుండ నంతరాయములు లేకుండ వర్ధిల్లుచున్నదిగదా! మీరు కాలువలు గట్టియు పాదులు చేసియు నీరువోసియు బిడ్డలకంటె నెక్కుడుగా బెంచినయాశ్రమవృక్షములు మహావాయుభీతి మొదలగు నరిష్టములు లేక చల్లనినీడ నిచ్చుచు వర్ధిల్లుచున్నవా? మీస్నానపానములకు మీపితృతర్పణమునకు నుపయోగించునట్టి జలములు పరిశుద్ధములై మీకు సేవ్యములగుచున్నవికదా! తమయనుష్ఠానములకు నుపయోగపడుదర్భలను మేయుచున్నను వాత్సల్యముచేత నదలింపక యేలేడిపిల్లలను మహామునులు తమతొడలమీఁదనె గూర్చుండఁబెట్టికొనుచుందురో యావారిణడింభకములకు సేమమొకదా? వనములలో దమంతట తామే పుట్టిపెరిగి మీకు దేహసంరక్షణమునకు సాధనములై వేళకువచ్చు నతిథులకు నన్నప్రదానము చేయుట కనువులై యుండెడు నివ్వరిధాన్యములను జుట్టుప్రక్కలనుండు పల్లియలనుండి పశువులువచ్చి మేసి పోవుట లేదుకదా? మీగురుఁడు నీయందుఁ బ్రసన్నుఁడై నీకు సకలవిద్యలు నేర్పి గృహస్థాశ్రమము స్వీకరించుటకు నీ కనుజ్ఞ నిచ్చెనా? నీవు వచ్చుట మాకు సంతోషమె కాని వచ్చినంతమాత్రముచేతనె నేను సంతుష్టిఁ జెందను. నీవు నీగురువు పంపఁగా వచ్చితివా? లేక స్వార్థము నిమిత్తము వచ్చితివా? నీకోర్కెయేమో తెలియఁజేసిన మొదల నీమనోరథము దీర్చి కృతార్థుఁడ నయ్యెదను."

మిక్కిలి యుదారములైన యారఘువుయొక్క పలుకులు విని కౌత్సుఁడు తననిమిత్త మర్ఘ్యపాద్యములు పెట్టితెచ్చిన మంటిమూఁకుడువల్లనె రఘువు నిర్ధనుఁడై యుండినాఁడని తెలిసికొని తనకోర్కె సిద్ధించునను నాస విడిచి యారాజుతో నిట్లనియె "రాజా! సూర్యుఁడు వెలుఁగుచుండఁగాఁ జీకటి యెట్లుండును? నీవలు

చుండఁగా మా కొఱకేదు సంభవించునే. నీయనుగ్రహమువలన మేము సుఖించుచున్నాము. ఓమహారాజా! అతిథులయెడ మీవంశస్థులకుఁ గలభక్తి యిట్టిదని చెప్పరాదు ఆవిషయమున నీవంశస్థు లందఱికంటె నీ వధికుఁడవు. అయినను నే ననువుగాని సమయమున వచ్చితి నని విచారించుచున్నాను. నీవు సకలైశ్వర్య సంపన్నుఁడవయ్యు యజ్ఞమునందు యాచకులకు దానము జేసి పేదవాఁడవైతివి. దానముచేతఁ బేదఱికము దెచ్చికొనుట శ్లాఘాపాత్రముకదా! దేవత లెల్లఁ దనలోనియమృతమును ద్రాగివేయుటచే క్షీణుఁడైన చంద్రుఁడు వృద్ధిచంద్రునికంటె ప్రశంసనీయుఁడు కాఁడా? నేను గురుదక్షిణార్థము వచ్చియుంటిని. నాకోరిక నీవలన సఫలము కాదు. కావున నేను మఱియొకనిని యాచించెదను. కడుపులోనిజలమెల్ల వానగాఁ గురిసిన మేఘమును మబ్బులనే నమ్ముకొనియుండు చాతకపక్షి నయితము కోరదు కదా. ఇంక నీకు శుభ మగుఁగాక! నేను పోయి వచ్చెదను.'' అని పలికి వెడలిపోవుచున్న మునికుమారుని రఘుమహారాజు నిలిపి "యోవండితుఁడా! నీగురువునకు నీ వేమి యీయవలెను? అదియెంత'' యని యడిగెను. అడుగుటయు బ్రాహ్మణపక్షపాతియు వర్ణాశ్రమ ధర్మపరిపాలకుఁడునైన యామహారాజుతో మునికుమారుఁ డిట్లనియె "నాగురువు నాకు విద్యలనెల్ల నేర్పినతరువాత మీకేమిగురుదక్షిణ కావలయు నని యాయనను నేనడిగితిని. నీవుచేసిన చిరశుశ్రూషచేతనె నేను సంతసించితిని. నాకు వేరుగ గురుదక్షిణ నీ వీయనక్కఱలే''దని మాగురు వాన తిచ్చెను. దక్షిణ పుచ్చికొనకతప్పదని బహువిధములచేత నేను గురువును బలవంతపెట్టితిని. నానిర్బంధమున కాయన కోపించి నేను నీకు పదునాలుగు విద్యలు నేర్పితిని. విద్యకొకకోటి రూకల చొప్పున నాకు నీవు పదునాలుగుకోట్లు సువర్ణము లిమ్మని యతఁ డానతిచ్చెను. ఆధన మార్జించుటకై నేను నీకడకు వచ్చితిని. నీచేతిలో మంటిమూఁకుడు చూడఁగానె నాయాన లడుగంటినవి. దానములచేత నీవు సంపదలనెల్ల గోల్పోయి ప్రభువను పేరుతో మాత్ర ముంటివి, అట్టినిన్ను నే నిబ్బందిపెట్టుట మంచిది కాదు. నాకు కావలసిన మొత్తమా మిక్కిలి గొప్పది'' ఇట్లు కాత్సుఁడు విన్నవింప రఘు వాతని కిట్లనియె. "వేదపారగుఁడైన బ్రాహ్మణుఁడు గురుదక్షిణార్థియై రఘువుకడకు వచ్చి మనోరథసిద్ధిఁ గాంచలేక వెళ్లిపోయినాఁడను నప్రతిష్ఠ నాకిదివఱ కెన్నఁడును లేదు. ఇప్పుడు నీ వది క్రొత్తగాఁ దెచ్చిపెట్టవద్దు. నాయజ్ఞవాటమునందు వెలుఁగుచున్న మూఁడగ్నులకుఁ దోడుగ నాలుగవయగ్నివై రెండుమూఁడుదినము లిచ్చట నుండుము. ఇంతలో నీకోరిక నేను ఫలింపఁ జేసెదను.'' అనవుడు సరేయని యాబ్రహ్మచారి యొడంబడెను. రఘుమహారాజు ధనము సంపాదించుట కుపాయము వెదకఁ జొచ్చెను

తీయఁగలిగినంతసొమ్ము భూమిలోనుండి యిదివఱకె తీయుటచేత నిఁక సాధ్యము కాదని కుబేరునివద్దనుండి ధనము తీయ సంకల్పించెను.

వాయుసఖుఁడైన మేఘునకు నంతరిక్షముమీఁదను సముద్రములమీఁదను పర్వతములమీఁదను సంచరించుట కెట్లయను వున్నదో వసిష్ఠమంత్రప్రభావము చేత రఘువుయొక్క రథమునకుఁగూడ నాకాశగమనముఁ జేయుటకు సముద్రములమీఁద నడచుటకుఁ బర్వతములమీఁదఁ బోవుటకు శక్తి కలదు. అట్టిరథము నాయత్తము చేయించి యారాజు దానిలో సకలశస్త్రములం బెట్టి ప్రదోషకాలమున నారథముఁ జేరి యారాత్రి యచ్చటనె నిద్రించెను. రఘువంటి మహావీరుఁడు తనమీఁదికి యుద్ధమునకు వచ్చుచున్నాఁడని విని కుబేరుఁడు భయపడి తెల్లవాఱుజామున నారాజుయొక్క ధనాగారములో బంగారువాన గురియించెను. ఆవార్త కోశాధిపతులు రాజునకెఱిఁగించిరి. రాజక్కడికిఁ బోయి చూచి వజ్రాయుధపు దెబ్బకుఁ దెగిపడిన మేరుపర్వతపుముక్కవలె నున్నయాబంగారు రాశిఁ జూచి యది కుబేరుఁడే యిచ్చినట్లు తెలిసికొని కౌత్సుని బిలిచి యాధన మంతయుఁ దీసికొని పొమ్మని కోరెను. తనగురువున కీయవలసినది పదునాలుగుకోట్ల సువర్ణములే కావున నంతకంటె నెక్కువయైనఁ దానెక్కువ పుచ్చికొన నని కౌత్సుఁడు పలికెను. యాచకులనిమిత్తము సంపాదించిన సువర్ణములో నెక్కుడుతృణమైన నుంచుకొన నని రఘువు వచియించెను. ఆముని యొక్కయు నారాజుయొక్కయు నిస్పృహతకు నయోధ్యాపురవాసు లందఱు నత్యంతాశ్చర్యసంతోషముల నొందిరి. ఎట్టకేలకు రాజుపట్టె నెగ్గెను. నూరులొట్టిపిట్టలమీఁదను నూఱుకంచరగాడిదలమీఁదను బంగారము వైచి రాజు కౌత్సునియాశ్రమమునకుఁబంపెను. మునికుమారుఁడువయినమగునప్పుడువినమ్రుఁడైనరాజును జేతితో స్పృశించి యిట్లనియె. "భూమీశ్వరుఁడవైన నీకుఁ గావలసినకొల్లవస్తువులను భూమి యిచ్చుట యాశ్చర్యము కాదు. ఆకాశముగూడ నీవు కోరునట్లు గనకవర్షముఁ గురియుట మహాద్భుతము. నీకెట్టిదీవనల లీయవలయునొ మాకుఁ దోఁచకున్నది. రాజ్యము రథగజతురగాదులు సమస్తవైభవములు నీకిదివఱకే యున్నవి. అవి లభించుఁగాక యని యాశీర్వదించితిమా పునరుక్తిదోషము పట్టును. కావున నీకిదివఱకు లేనిది వడయుము. అనఁగా నీతండ్రి సద్గుణవంతునినిన్ను గన్నట్లె నిన్నుఁ బోలిన కుమారునిఁగనుము." అని పలికి మునికుమారుఁడు గురువుకడకు జోయెను. అనంతరము కొంతకాలమునకు రఘువునకు నందనుఁడుదయించెను. బ్రహ్మముహూర్తమందు రఘువున కాకుమారుఁడు జనియించుట చేత నతనికి బ్రహ్మదేవుని పేరు పెట్టఁదలఁచి యజుఁడని నామకరణము చేసెను. దీపమునుండి దీపముపుట్టినట్లు సరిగా నాకు

మారుఁడు రఘువునుబోలి యుదయించెను. అదే తేజము. అదే రూపము. అదే యా
కారము. అదే గాంభీర్యము. అతఁడు గురువువలన సకలవిద్యలు నేర్చి నిండుజవ్వన
మును ప్రాపించి మనోహరాకారుఁడై యువరాజయ్యెను. ఆకాలమున విదర్భ నేలు
చుండినభోజుఁడు తనచెల్లెలగు యిందుమతీదేవికి వివాహము చేయఁదలంచి రఘునం
దనుఁడైన యజుని రావించుకొనుటకు స్వయంవరము గల్పించెను. కుమారుఁడు వివాహ
యోగ్యుఁడగుట చేతను. సంబంధము శ్లాఘ్యమైన దగుట చేతను రఘువు కొంత సైన్య
ము తోడిచ్చి కుమారుని విదర్భ కంపెను. మార్గమధ్యమున నతనికి సమస్తోపభోగము
లు జరిగెను. వనవాసులు తెచ్చి యిచ్చినకానికలు నాగరకు లిచ్చినకానిక లట్లే య
తని కత్యంతప్రీతి గల్పించెను. అజుఁడు నిరంతరప్రయాణములు చేసి నర్మదానదీతీర
మునఁ జేరి యచ్చట విడిసి మందమారుతమును సేవించి ససైన్యముగ బడలికదీర్చికొని
యెను. అజుఁడు నీటిదరిని నిలిచి చూచుచుండఁగా నీటిలో నొకచోట తుమ్మెదలు గు
మిగూడి ఝుమ్మని నాదము చేయుచుండెను. ఆచ్చోట నొకమదపుటేనుఁగు జలములో
మునిఁగి యుండుటంజేసి యామదగంధలోభమునఁ దుమ్మెదలచ్చటఁ జేరెను అంతట
మదపుటేనుఁగు నీటిలోనుండి లేచి వెలుపలకు వచ్చెను ఆమత్తమాతంగము తొండము
ను జాపుచు ముడుచుచు భయంకరముగ ఘీంకారము సేయుచు నదీతరంగములను
దొండముతోఁ గొట్టుచు నేరు విడిచి యొడ్డునకు వచ్చెను. అది గట్టెక్కి యజునియొ
క్క గ్రామ్యగజములను జూచినతోడనే నీటిలో నుండుటవలనఁ గొంచెముపశమించిన
దానిమదము మరల హెచ్చుపెరిగెను. దానిం జూచియు నేడాకుల యరఁటిచెట్టుతావి
వంటితావిగల దాని మదము నాఘ్రాణించియు దండులోనియేనుఁగులు బెడసి మావ
టీండ్రకు లొంగక పెడమొగము పెట్టెను. ఏనుఁగు లట్లగుట చేత గుఱ్ఱములుకట్లు
త్రెంచికొని పారిపోయెను. రథములు భగ్నము లయ్యెను. బంట్లు నానావిధ
ములఁ బరుగెత్తిరి. స్త్రీలను రక్షించుటకు యోధులు ప్రయత్నించిరి. అది విజృంభిం
చి యజునిమీఁదికి వెళ్ళెను యుద్ధములో దప్ప మఱొకప్పు డేనుఁగును జంపఁగూడదని
ధర్మశాస్త్రవాక్యము విని యుండుటచే నజుఁడు దానిం జంపనొల్లక విల్లెత్తి నారి
పూర్ణముగాఁ దివియక కొంచెము లాగి యొకబాణము దానికుంభస్థలమున నాటనే
సెను. ఆదెబ్బ తగిలినతోడనే యది యేనుఁగురూపము విడిచి ధగధగలాడెడుదేహము
ధరించి యాకాశగమనము గలిగి సైన్యము నాశ్చర్యసముద్రన ముంచెను. అంతట
నజునిమీఁద పుష్పవృష్టి గురిసెను. దివ్యరూపము దాల్చినయాపురుషుఁడు రాజకుమా
రున కిట్లనియె. "అయ్యా! నేను గంధర్వుఁడను. నాతండ్రి గంధర్వపతి యైన
ప్రియదర్శనుఁడు. నాపేరు ప్రియంవదుఁడు. నేను మిక్కిలి గర్వించి మతంగ మహా

మునిని దిరస్కరించుటచే నతఁడు మదపుటేనుఁగ వగ్మని నాకు శాప మిచ్చెను పశ్చాత్తాపము నొంది నేను వేఁడికొనఁగా ముని నాయం దనుగ్రహించి దయాళు వయ్యెను. జల మగ్నిహోత్రమును గాని యెండను గాని స్పృశించుటచే వేఁడి యగును; కాని యది సహజముగ జల్లనిదె కదా! ఇక్ష్వాకువంశస్థుఁడైన యజుఁడు బాణముతో నీకుంభస్థలమును వ్రచ్చునపుడు నీకు శాపమోక్షణ మగు నని యాముని యానతిచ్చెను. నాఁడు మొదలుకొని నేను నీదర్శన మపేక్షించి యుంటిని. నేటికి నీదయవలన నాకు శాపవిమోక్షణమయ్యెను. నేను నీకు ప్రత్యుపకారము సేయకపోతినా నేను నాతొంటిభావ మొందుట వ్యర్థమగును. నాకడ సమ్మోహనాస్త్రము కలదు. దాని ప్రయోగోపసంహారమంత్రములు నే నెఱుఁగుదును. అది గంధర్వదేవతాకమైనశస్త్రము. అది ప్రయోగించినయెడల యుద్ధములో జయము కరతలామలకము. శత్రుబాణప్రహారములు నీకుఁ దగులవు. గజరూపమున నున్నపుడు నీవు నన్ను గొట్టినను నాకది యుపకారమె యైనది. నాప్రార్థనము నీవు నిరాకరింప వలదు."

అతనివేఁడికోలు నంగీకరించి రఘుకుమారుఁడు పవిత్రమైన నర్మదాజలమును జేతఁ బట్టికొని యాచమనము జేసి యుత్తరదిక్కుగాఁ దిరిగి ప్రియంవదునివలన సమంత్రకముగ సమ్మోహనాస్త్రము నుపదేశము బొందెను. తలవనితలపుగ దైవయోగంబున నిట్లు రాఘవగంధర్వులకు మైత్రి గలిగెను. గంధర్వుఁడు మనోహరమైన కుబేరునియుద్యానవనమున కరిగెను. రాఘవుఁడు విదర్భాపురమునకుఁ జనియెను. అజుఁడు వచ్చినవార్త విని విదర్భరాజతని నెదుర్కొని సగౌరవముగఁ దోడి తెచ్చెను. భోజుఁడు రాఘవునకు సకలోపచారములు చేసి తనయింట విడియించెను. ఆయుపచారములు చూచి రాఘవుఁడే గృహయజమానుఁడుగను భోజుఁడే యతిథిగను దోఁచుచున్నాఁడని విదర్భజనులు తలంచిరి. మంగళాలంకారములు చేసిన యాబసలో నజుఁడు ప్రవేశించియు దుమతిమీఁద తనచిత్తము నిలుచుటం జేసి చాలసేపటివఱకు నిద్రరాక యెట్టకేలకు నిదురించి తెల్లవారుజామున సమానవయస్కులైన వందిమాగధవైతాళికులస్తుతుల వలనను మేలుకొలుపుల వలనను మేలుకాంచి కాల్యకృత్యములం దీర్చికొనియెను.

# అజమహారాజు.

---o---

అజుఁడు స్వయంవరము జరుగుచోటికిఁ బోయి చూచునప్పటికి రాజకుమారులందఱు మిక్కిలి యున్నతములైన మంచెలపై నమర్పఁబడిన సింహాసనముల మీఁదఁ గూర్చుండి విమానము లధిరోహించిన దేవతలువలె శోభించుచుండిరి. రతీదేవి ప్రార్థనమువలన జాలిపడి సాక్షాచ్ఛివుఁడగు మన్మథుని మరల సృజించెనో యన్నట్లు వెలయుచున్న రఘునందనునిఁ జూచి రాజకుమారులు తప్పక యిందుమతీదేవి యాతనినే వరించునని యామెయెడ నాస వదలుకొనిరి. సింహపుబిల్ల మహోన్నతమైనపర్వతమెక్కినట్లు రఘుకుమారుఁడు భోజరాజు చూపిన మెట్లదారిని మంచెయెక్కి పఱచిన రత్నకంబళములమీఁద నమర్పఁబడిన సింహాసన మధిరోహించి నెమలిపై నెక్కిన కుమారస్వామివలె శోభిల్లుచుండెను. అగ్ర్యములైన మహాసనములమీఁద గూర్చుండిన యారాజకుమారపుంగవుల నడుమ కల్పవృక్షములనడుమశోభిల్లు పారిజాతమువలె రఘుకుమారుఁడు భాసిల్లుచుండెను. మదపుటేనుఁగు కనఁబడఁగానె తుమ్మెదలు మకరందభరితములైన పుష్పములను విడిచి యాయేనుఁగుదెస బరుగెత్తునట్లు పౌరజనులదృష్టులు రఘుకుమారుఁడు రాఁగానే తక్కినరాజకుమారులమీఁదనుండి యతనిమీఁదికి బ్రసరించెను. అనంతరము వంశవృత్తముల నెఱిఁగిన వందిమాగధులు సూర్యచంద్రవంశపురాజులను కైవారముఁ జేసిరి. తన సౌరభము నలుదెసల వ్యాపించునట్లు కృష్ణాగరు వెలిగింపఁబడెను. ఆకల్యాణసమయమున బహుతూర్యారావములు చెలగెను. శంఖధ్వని మిన్ను ముట్టెను. ఆధ్వని విని నగరోపకంఠమున నున్న యుద్యానవనములోని నెమిళ్ళు నభమున నురుము లురుముచున్నవని భ్రమఁజెంది నృత్యము చేయసాగెను. ఇందుమతీదేవి పెండ్లికూఁతురై సకలాలంకారశోభగల పరివారము చుట్టు గొలువ నొకపల్లకియెక్కి మంచెలమీఁద రాజకుమారుల పీఠములనడుమ నున్నమార్గమునఁ బోవఁజొచ్చెను. అప్పుడు రాజకుమారు లందఱియొక్కకన్ను లామెపైఁ బడెను. వారి శరీరములుమాత్రము గద్దియలపై నుండెను. కాని మనస్సులామెయందు లగ్నములైపోయెను. ఆయిందుమతిని జూడఁగానె రాజకుమారులమనంబులలో నెన్నో కోర్కెలుదయించెను. వసంతలక్ష్మీసమాగమమును గొంజిరుటాకులు తెలియఁజేసినటుల నానావిధశృంగారచేష్టలు వారికోరికలను సూచించెను. ఒకరాజకుమారుఁడు కాఁడ రెండు చేతులం బట్టికొని తామరపువ్వును ద్రిప్పుచుండెను. అత్తరిఁ జలించిన ఱేకులు

తటతట తుమ్మెదలం గొట్టెను. పుష్పాడి పరివేషరూపముగ లోపల చేరెను. “ఓయిందుమతీ నీవు నన్ను పెండ్లియాడినపక్షమున నే నీపువ్వను ద్రిప్పినటుల నీవు నన్ను నీయిచ్చవచ్చినటుల త్రిప్పవచ్చు” నని యామెను గూఢముగఁ బ్రార్థించుటకై యతఁ డాపువ్వను ద్రిప్పెను. మఱియొక రాజనందనుఁడు తనకుడిభుజకీర్తికి దగు లొక్కన్న హారమును మెడ వంకరగఁ ద్రిప్పి చిక్కువదలించి మరల వక్షస్థలమునఁ జేర్చికొనియెను. ఈవిధముగ నిన్ను నేను వక్షస్థలమునఁ జేర్చికొందునని యతఁ డిందుమతికిఁ దెలియఁజేయుటకై యాచేష్టఁ జేసెను. మఱియొక నృపకుమారుఁడు క్రిందికిఁ జూచుచు తనకాలిగోళ్ళతో నడుగుననున్న బంగారుపీఠమును గీరు చుండెను. నీవు నాకడకు రమ్మని యిందుమతికి సంజ్ఞఁజేయుటకై యతఁ డది చేసెను. మఱియొకరా జెడమచేయి గద్దియపై నానుకొని యాభుజాగ్ర మున్నత మగుటచే హారము మూఁడుపాయలు కాఁగాఁ దన ప్రక్కనున్న మిత్రునితో మాటలాడఁ దొడఁగెను. నిన్ను నాయెడమభాగమునఁ జేర్చికొని యిట్లే సల్లాపముఁ జేయుదునని యిందుమతికిఁ దెలియఁ జేయుటకై యతఁడాచేష్ట చేసెను. వే ఱొక రాజుమిక్కిలి తెల్లఁగా నుండి విలాసవతులు శ్రవణభూషణముగ ధరింపఁదగిన మొగలిరేకును దన గోళ్ళతోఁ జీరఁ దొడఁగెను. నీశరీరముమీఁద నిట్లే నఖక్షతముఁ జేయుదు నని వైదర్భికి విన్నవించుట కతఁడట్లు గావించెను. ఇంకొకనృపసూనుఁడు ధ్వజరేఖలు గలిగి నూరురేకుల తామరపువ్వువలె శోభిల్లుచున్న తనహస్తముతో రత్నఖచితము లైనయుంగరములకాంతులచేత వ్యాప్తము లైనపాచికల నెత్తి యెగరవైచెను. ఇందుమతితో నిటుల నిరంతరక్రీడలు చేసెదనని యాతనియభిప్రాయము. ఇంకొక్క నృపాలకుమారుఁడు మస్తకమునఁ దనకిరీటము సరిగా నుండినను నది జారిపోయినట్లు తానది సర్ది యథాస్థానమున నుంచినట్లు నటించెను. ఇందువలన నతఁడిందుమతిని రత్నమకుటమువలెఁ దలమీఁద నిడికొనియెదనని సూచించెను.

అనంతరము సకలరాజులవంశానుచరితము నెఱిఁగినదియు మంచివక్త్రియునగు సునంద యిందుమతి కెల్లరాజులం జూపఁదలంచి ముందుగా మగధరాజునొద్దకుఁ దోడ్కొనిపోయి యిట్లనియె. “ఇందుమతీ! ఇతఁడు శరణాగతులకు శరణ్యుఁడు. అపారసత్వము గలవాఁడు, మగధరాజ్యపట్టాభిషిక్తుఁడు. ప్రకృతిజనరంజనముచేత నిరూపమానకీర్తి సంపాదించినవాఁడు ఈతనిపేరు పరంతపుఁడు. శత్రువులను మిక్కిలి తపింపఁజేయుటచేత నీతనియందీపేరు సార్థకమైనది. ఈభూమిలో వేనవేలురాజులు కలరు. అయినను భూమి యితనివలననె రాజన్వతి యైనదని పెద్దలనేకులుచెప్ప

చున్నారు. ఆకాశమునందు లెక్కకు మిక్కిలియైనచుక్క లెన్ని యుండినను రాత్రి చంద్రునివలననె జ్యోతిష్మతి యగుచున్నదిగదా! ఈరాజు సర్వదా యజ్ఞములు చేయుచు హవిర్భాగము లిచ్చుట యింద్రుని బిలుచుచుండుటచేత శచీదేవి భర్త దేశాంతరమున కరగినందునఁ దనకునూనె రాచికొనిదువ్వుకొనక మందారపుష్పములు ముడుచుకొనక పాలినచెక్కిళ్ళమీఁద వ్రేలాడుముంగురులు గలదై పతివ్రతాధర్మము నడపుచు విరహదుఃఖ మనుభవించుచుండును. ఈరాజును నీవు వరించి వివాహ మాడుదువేని పురప్రవేశమహోత్సవసమయమున పాటలీపురమందలి మేడలమీఁది గవాక్షములలోనుండి యాపురాంగనలు నిన్నుజూచి యానందింపఁగలరు. '' అని సునంద పలుకుటయుఁ దనచేతిలోని యుత్పలదండ యించుకజార నిందుమతి వరంతప మహారాజునకు మాటలేని వట్టినమస్కారముఁజేసి యచ్చోటు విడిచెను. దౌవారికయైన సునంద యిందుమతీదేవి కాతనిమీఁద ననురాగము లేదని తెలిసికొని వాయుప్రేరితమైన మానససరోవర తరంగమాలిక రాజహంసమును మఱియొకతరంగమునకుఁ జేర్చునట్లు రాజకన్యను మఱియొకరాజుకడకుఁ గొంపోయి యిట్లనియెను.

“ఇతఁ డంగరాజు. ఇతనియౌవనము లావణ్యముఁ జూచి సురాంగనలునయితమితనిసహవాసము గోరుచుందురు. గజశాస్త్రమును రచియించినగ్రంథకర్తలే యితని యేనుఁగులకుఁ బరిపాలకులై యున్నారు. ఇతఁడు భూమిమీఁదనుండియు నింద్రభోగము ననుభవించు చున్నాఁడు ఈపరాక్రమశాలి శత్రురాజుల నోడించి తెగటార్పఁగా వారియంగనలు శోకించుచు విడిచినగొప్ప బాష్పబిందువులు పాలిండ్లపైఁబడి దారమున గ్రుచ్చబడనిముత్యములట్లు శోభించుచుండును. ఒకరిపొడ రొకరికిఁ గిట్టని యత్తకోడండ్రగు లక్ష్మీసరస్వతు లీరాజును బరస్పరవిరోధము లేక యాశ్రయించి యున్నారు. లావణ్యముచేత లక్ష్మినని, సత్యవాక్కులచేత సరస్వతిని బోలిననీవు వారికిరువురకుఁ జెలికత్తెవై మూఁడవదానవై యీరాజు నాశ్రయింపుము. '' అది విని యిందుమతి తనచూడ్కి యంగరాజునుండి మరల్చి ముందుకు సాగు మని సునందకు సన్న చేసెను. అంగరాజు రసికుఁడె యిందుమతి గుణగ్రహణశీలయె. అయినను రుచులు భిన్నములు కదా.

అనంతరము సునంద రాజకన్యకకు శత్రుదుస్సహప్రతాపుఁడు, సుందరాంగుఁడు నగుమఱియొకరాజును నుదయించుచున్న చంద్రునిం బోలినవానిఁ జూపెను. “ఓకళ్యాణీ! ఉదగ్రబాహుఁడు విశాలవక్షుఁడు సింహమధ్యముఁడు నగు నీరాజవంతీశ్వరుఁడు. విశ్వకర్మ సానబట్టిన సూర్యబింబమువలె నీతఁడు ప్రకాశించు

చున్నాఁడు. శక్తిత్రయసంపన్నుఁడైన యీరాజు జైత్రయాత్రకు వెడలునపుడు వాని గుఱ్ఱపుడెక్కలవలన రేఁగినధూళియె శత్రురాజుల కిరీటమాణిక్యములకాంతి నణఁచి వైచుచుండును. ఈయవంతినాథుఁడు మహాకాళీశ్వరస్వామికి నిలయమైన యుజ్జయినిలో నుండుటచేఁ గృష్ణపక్షరాత్రులయందుఁ గూడఁ జీకటి యేమో యెఱుఁగక యామహాకాళీశ్వరునిశిరస్సుమీఁద నుండు చంద్రరేఖ వెదజల్లు వెన్నెలలోఁ బ్రియకాంతాసహితుఁడై క్రీడించుచుండును.'' పద్మములకు వికాసమును గలిగించుచు బురదలను శోషింపఁజేయుచు వెలయుసూర్యునిమీఁదఁ గలువపూవుల కనిష్టమైనట్లు మిత్రరంజకుఁడు శత్రుభంజకుఁడు నగు నాయవంతి నాథునిపై యిందుమతి వలపు నిలుప దయ్యె.

పిమ్మట సునంద యనూపరాజునెదుట నిందుమతిని నిలిపి యిట్లనియె. " పూర్వము కార్తవీర్యుఁ డను రాజర్షి యుండెను. అతఁడు వేయిబాహువులతో యుద్ధము చేసెను. అష్టాదశద్వీపములయందును యాగములు చేసి యూపస్తంభముల నిలిపెను. అన్యు లెవ్వరియందు సార్థకము కానిరాజశబ్ద మతనియందు సార్థకమయ్యెను. చెడ్డకార్యము చేయుట కతనిప్రజలలో నెవఁడైనఁ దలపెట్టినా వెంటనే కార్తవీర్యుఁడు ధనుర్ధరుఁడై వానియెదుట సాక్షాత్కరించి మనస్సులలో నయితము దురాలోచనలు తొలఁగించి లోకుల మంచిమార్గమున నడపుచుండును. దేవేంద్రుని జయించిన రావణాసురునినయిత మతఁడు రణమున గెలిచి పట్టికొని నల్లెత్రాడులతో నిరువదిచేతులు విరిచికట్టి కారాగృహమునఁ బాఱవైచెను. రావణుఁడు పదిముఖములతో రోజుచు నతనియనుగ్రహము వచ్చువఱకు చెఱసాలలోనుండెను. ఆకార్తవీర్యుని వంశమందీరాజు జన్మించినాఁడు. ఈతనిపేరు ప్రతీపుఁడు. ఈతఁడు శాస్త్రవృద్ధుల సేవఁ జేయుచుండును. ఈతఁడు నిరంతరదానములఁ జేయుచుండినను లక్ష్మి యితనిని బాయక స్థిరముగనుండి చంచలస్వభావ యనునపప్రతిష్ఠ గొంతవఱకుఁ బోగొట్టుకొనియెను. ఈతనికి క్షత్రియకాళరాత్రియగు నగ్నిదేవుఁడు సహాయుఁడై యీతనిశత్రువుల దహించుచుండును. అందుచేత రాజలోకభయంకరమైన పరశురామునికుఠారధార నితఁడు కలువరేకువలెఁ జూచును. ఈతని నీవు వివాహ మాడుదువేని రాజధానియైనమాహిష్మతీపురమునకు నితంబసీమ యని చెప్పఁదగినకోటగోడకు మొలనూలువలెఁ జుట్టుదిరిగి వింతయందముఁ దెచ్చురేవానదిని నీవు కుతూహలముతో దర్శింపఁ గలవు. ఆకుతూహలము నీకు గలదేని మహావిష్ణువంటి యీరాజుతోడను లక్ష్మీదేవివంటి నీ వధిరోహింపఁ దగును. ఆరాజు మిక్కిలి మనోహరుఁడైనను శరత్కాలసంపూర్ణచంద్రుఁడు తామరపువ్వున కనిష్టుఁడైనట్లు రాజపుత్రికకుఁ బ్రేమా

నృపుఁడు కాకపోయెను. అనంతరము సునంద సకలలోకగీయసమానకీర్తియు శుభ కులప్రదీపకుఁడు సుషేణనామధేయుఁడు నగుశూరసేనరాజును జూపి యిట్లనియె.

"ఈరాజు నీపవంశస్థుఁడు. అనేకయాగములు చేసినవాఁడు. మహానుభావు లగుమహర్షుల యాశ్రమములలో పరస్పరవిరోధము గల గజసింహములు గోవ్యాఘ్రములు వైరము విడిచి పొత్తు గలిగి యున్నట్లు వీనియొద్ద లక్ష్మీసరస్వతులు జ్ఞానమానములు నౌదార్యైశ్వర్యములు నిలిచి యున్నవి. ఈరాజుకాంతి చందమామవలె మిత్రులకు చల్లనై యుండును. ఈతని ప్రతాపము శత్రువులకు దుస్సహమై వారి మేడల బొమ్మపఱచి వానిమీఁద గడ్డి మొలపించుచున్నది. ఈరాజు యమునానదిలోఁ గా తానమాడుచున్నై జలక్రీడ సేయునపుడు వానియంగనలవక్షోజములమీఁద నలందినమంచిగంధము కరఁగి నీటం గలయ నీరు తెల్లబడి యమున గంగతోఁ గలియక మునుపే ధావళ్యమును సంపాదించుకొనెనా యని భ్రమ కలిగించుచుండును. ఆతనివక్షమున విరాజిల్లుచు నల్గడలఁ గాంతిని వెదజల్లుచున్న యామణిని జూడు. కాళియాహి గరుత్మంతునకు జడిసి యమునలో డాఁగొనఁ దలఁచి యమునాప్రభువైన యీరాజుపూర్వునకీమణి యతఁడు కానికగ సమర్పించి వానియనుజ్ఞ వడసి యానదియందు దలఁదాచుకొనియె. కౌస్తుభమాణిక్యము ధరించినవిష్ణువువలె విరాజిల్లుచున్నయీరాజును లక్ష్మివలె నీవుపరిగ్రహింపుము. ఓకళ్యాణీ! యీసుషేణుని పాణిగ్రహణము చేసి మెత్తనిచిగురుటాకులు పరచినపుష్పశయ్యమీఁద నతని గూడి కుబేరుని చైత్రరథమునకుఁ దీసిపోవనిబృందావనమందు విహరించిమదనసౌఖ్యమనుభవింపుము మఱియు వర్షకాలమున వానబొట్లు పడఁగానె కమ్మతావులనీనుశిలాజిత్తుగలఱాతి పలకలమీఁద గూర్చుండి గోవర్ధనపర్వతగుహలలోనృత్యములుసలుపునెమళ్ళ జూడ గలవు." సముద్రములోఁ బడఁ దలఁచిన నదిత్రోవలో నున్నకొండను దప్పించుకొని పోవునట్లు రాజపుత్రిక సుషేణుని గడచి యావలకుఁ బోయెను.

పిమ్మట సునంద శత్రువిజయుఁ డగు హేమాంగదుఁ డను కళింగరాజును జూచి యిందుమతితో నిట్లనియె. "ఈరాజు మహేంద్రపర్వతసమానధైర్యుఁడు. ఇతఁడు మహేంద్రశైలమునకు మహాసముద్రమునకు నధిపతి. ఇతఁడు దండయాత్ర వెడలునపుడు ముందు నడచుగజబలముఁ జూచి యదిమత్తగజసమూహమా మహేంద్రపర్వతమా యని సందేహము తోఁచుచుండును. సముద్రుఁ డీరాజుమేడసమీపముననె యుండి జాలగట్టిలలో నుండి చూడఁదగినతరంగములు కలవాఁడై తనతరంగధ్వనిచేత మంగళతూర్యారావములను మందీభూతము సేయుచుఁ దెల్లవాఱుజామునతన ఘోషముచేతనే మేలుకొలుపుచుండును,మరమరధ్వనులు సేయుచుండుతాటితోఁపులు

గలసముద్రతీరములయందు ద్వీపాంతరములనుండి వాయుదేవుఁడు తెచ్చినలవంగాది సువాసనలు గల తెమ్మెరలననుభవించుచు నీవుభర్తతో విహరింపఁగలవు.” పురుషప్రయత్నముచేత సంపాదింపఁబడిన దయ్యుసిరి గుణహీనునకు దక్కక దూరము తొలఁగిపోవునట్లు సునందప్రేరిత యయ్యు నిందుమతి యారాజును వరింపక యవ్వలి కరిగెను.

అంతట సునంద నాగపురీశుఁ డగురాజు జూపి చకోరాక్షి యిటు చూడుమని హెచ్చరించి యిందుమతితో నిట్లనియె. “ఇతఁడు పాండ్యరాజు. కంఠమున వ్రేలుముత్యాలహారములు గలిగి మేనినిండ హరిచందనముఁ బూసికొని యితఁడు లేఁతయెండచేత మెఱయుసానువులు గలిగి కొండకాలువల వెల్లువలు గలిగి యొప్పుపర్వతమువలె భాసిల్లుచున్నాఁడు. వింధ్యపర్వతము నిర్బంధించినవాఁడు సముద్రమాపోశనముఁ బట్టి మరల విడిచినవాఁడు నగుమహానుభావుఁ డగస్త్యుఁడీరాజశ్వమేధము జేసి నవభృథస్నానముఁ గావించినతరువాత ‘నీయజ్ఞము నిర్విఘ్నముగా సాగినదా? నీవు సుఖముగ నవభృథస్నానముఁ జేసితివా’ యనియడిగెను. పూర్వము రావణాసురుఁడు దేవేంద్రునిమీఁదికి దండు వెడలినప్పుడు తాను స్వర్గమున నున్నకాలమున నీపాండ్యరాజు తనరాజ్యములో నున్నజనస్థానము నాక్రమించునని శంకించి యాతనితో సంధి చేసికొనియెను. నీవు యథావిధిగా నీపాండ్యరాజును బరిణయం బగుదువేని సముద్రముద్రాణముగాఁ గలదక్షిణదిక్కునకు సవతివై సుఖింతువు. తాంబూలలతలల్లుకొన్న పోఁకచెట్లు గలిగి యేలకితీగలల్లుకొనినమంచిగంధపుచెట్లు గలిగి పువ్వులుగ బఱచినతమాలపత్రములు గలిగి శోభిల్లుమలయపర్వతస్థలములమీఁద నీవు క్రీడింపనను గ్రహింపుము. ఈరాజు నల్లకలువలవలె చామనచాయ మేనిఁవాఁడు. నీవు గోరజమువలె పచ్చనిచాయ గలదానవు. మీయిరువురసమాగమము మేఘములతో మెఱపుదీగ కలిసినట్లుండును.” దౌవారిక చేసినయీయుపదేశము సూర్యదర్శనము లేమి ముకుళించుకొని యున్నతమ్మిపూవునకుఁ జంద్రకిరణము పనికి రానట్లిందుమతికి నచ్చలేదు. ఇందుమతీకటాక్షము ప్రసరింపనిరాజుల మొగము లన్నియు వాడిపోయెను.

అనంతర మిందుమతి సునందాసహితయై యజుఁ డున్నచోటికిఁ బోయెను. అజుఁడు తన్నామెవరించునో లేదోయని సంశయించుచుండఁగా నతనికిఁ గుడిభుజ మదిరెను. ఆయిందుమతి యతనిం జూచినపిదప మఱియొకరాజకుమారుని సందర్శించు తలంపు మానికొనెను. విరగఁ బూసినక్రొమ్మావిగున్నను విడిచి తుమ్మెద యన్యస్థానమునకరుగునా? రఘునందనునియందు డెందము నిల్పినయాశారద పూర్ణిమా

చంద్రవదనను జూచి వాక్యసందర్భములు చక్కఁగా నెఱిఁగిన సునంద యిట్లనియె "తొల్లి కకుత్స్థుఁ డనురాజొకఁడు సుప్రసిద్ధుఁడు భానువంశమునఁ గలఁడు. అతఁ డధిక ప్రఖ్యాతుఁ డగుటచే నతనితరువాత నుత్తరకోశల మేలినరాజులందఱు కాకుత్స్థు లనుపేరు వహించిరి. దేవతలు రాక్షసబాధ పడలేక సహాయముఁ జేయుమని కకుత్స్థుని వేడిరి. ఇంద్రుఁ డాబోతురూపము ధరించెను. అయ్యాబోతు నెక్కి కాకుత్స్థుఁడు వృషభతురంగుఁ డగుశివునివలె రాక్షసులతోఁ బోరి జయించెను. అనంతర మాకకుత్స్థుఁడు దేవేంద్రుని భుజముతోఁ దనభుజ మొరయునట్లు గలిసి దేవసింహాసన మధిష్ఠించెను. ఆకకుత్స్థునివంశమందు కీర్తిమంతుఁడు మహాతేజశ్శాలియు నగుదిలీపుఁడు జనించెను. అతఁడు తొంబదితొమ్మిదియాగములు చేసి కృతకృత్యుఁడై నూఱవజన్నము కూడ ప్రారంభించి యింద్రప్రీత్యర్థము మానికొనెను. ఆదిలీపమహారాజు కాలమున నతఁడు పరిపాలించుదేశమున దొంగతనమే లేదు. త్రాగి కైపుచేత నిద్రించుచున్న స్త్రీలమేనులమీఁదినన్నవలువల నైన గాలి సయితము కదలింప లేక పోయె నని చెప్పుచుండ నింక చోరుల కేమి శక్యము? అతనిపుత్రుఁడైనరఘుమహారాజిప్పుడు ధరణి నేలుచున్నాఁడు. అతఁడు దిగ్విజయము చేసి నాల్గుదెసలనుండి తెచ్చినధనరాసులతో విశ్వజిద్యాగమును జేసి ధనమెల్లదానము చేసి మట్టిముంతలతో మిగిలెను. ఆరఘుమహారాజుకీర్తి నింతింత యని కొలచుటకు వీలులేదు. అది కొండలెక్కెను. సముద్రములు దాటెను. పాతాళమునఁ బర్యాప్తమయ్యెను. నిర్జరలోకమున నివసించెను. బ్రహ్మాండ మాక్రమించెను. మహేంద్రునకు జయంతుఁ డుదయించినచందమున రఘుమహారాజున కీయజుఁ డుద్భవించెను. ఈతఁడు బాలుఁడైనను జనకునితో సమానముగ భూభారము వహించుచున్నాఁడు. కులముచేతను వయసుచేతను లావణ్యముచేతను వినయాదిసమస్తగుణములచేతను నీకితఁడనురూపవరుఁడు. ఇతనిని నీవు వరింతువేని మణిబంగారమును జేరినట్లుండును."

అని సునంద పలుకఁగానే యిందుమతి సిగ్గువిడిచి రఘునందనుని నేత్రోత్సవముగఁ జూచెను. ఆచూడ్కి పుష్పమాలికవలె నతని పైఁబడెను. నవప్రౌఢ యగుటచే నామె యజునిమీఁదఁ దనకుఁ గలిగినయనురాగము చెప్పలేక పోయెను. కాని మేని పులకాంకురములె మనసులో నున్నమక్కువ నువ్యక్తము చేసెను. ఇట్లు సువ్యక్తమైన యనురాగమును జూచి సునంద చిఱునవ్వుతో నిందుమతి నుద్దేశించి వే రొక రాజకుమారునికడకుఁ బోవుదము రావమ్మాయని పరిహాసము చేసెను. ఇందుమతి యామెను కోరచూపులఁ జూచెను. అంతట నిందుమతి కుంకుమ పూయుటచే నెఱ్ఱ

యైనపుష్పమాలికను దాదిచేత రఘునందనుని మెడలో వేయించెను. అది యెడఁద తనవిశాల వక్షమునఁ బడఁగానే యజుఁడు తన్నిందుమతి బాహువులతోఁ గౌఁగలించుకొనినట్లు యానందించెను. అట్లిందుమతి వరించినతోడనే పురజనులు మహానందభరితులై వారి సమాగమము మెచ్చి యీమె చంద్రుని గలిసినవెన్నెల, సముద్రుని గలిసినగంగ యని శ్లాఘించిరి. ఈపలుకులు మత్సరగ్రస్తులైనరాజులచెవులకుమాత్రము చేదుగా నుండెను. ఒకచో వరునిపక్షమువారలందఱు మహానందభరితులైయుండిరి. అసూయాపీడితులైనరాజులు వేరొకచో సంఘముగఁ గూడిరి. ఇట్లుభయములతోఁగూడిన యాసభావు ప్రాతఃకాలమున వికసించుచున్న తామరపువ్వులతోడను ముకుళించుచున్న కలువపువ్వులతోడను నిండినకొలనువలె నుండెను. అనురూపవరుని బడసి దేవసేనాపతి యగుకుమారస్వామిని గూడి యున్నదేవసేనవలె నున్న యిందుమతిని సోదరుఁడగువిదర్భరాజు స్వయంవరవేదికనుండి పురమునకుఁ దోడ్కొని పోయెను. రాజకుమారులు తమరూపవేషములమీఁది రోత చెంది విదర్భరాజనందనపై నాశ విడిచి వేకువను వెలవెలబాఱునుక్కలట్లు తమతమశిబిరములు చేరిరి. అప్పట శచీదేవి పరిత్యక్తమై యుండుటచేత రాజులు రఘుకుమారునియెడ మత్సరము దాల్చియు నేమియుఁ జేయఁజాలక యూరకుండిరి. ఆదంపతులు దేవ ద్రిచాపములవలె నున్న తోరణములం జూచుచు ధ్వజముల నీడను నిలిచి మార్గాయాస మడంచుకొనుచు రాజమార్గంబునఁబోయి పురమును జేరిరి. వారిని మేడలకిటికీలలోనుండి చూచు కుతూహలమున నగరసుందరులు తమపనిపాటలు మానిరి.. ఒకయంగన దంపతుల జూచు వేడ్కను తొట్రుపడుచు జాలకట్లవంక నడువ నామెకొప్పు విడిపోయెను. పువ్వులు దారిపొడుగున జారిపడెను. తలవెండ్రుకలు చేతఁబట్టుకొని నడచెనేకాని గవాక్షముఁ జేరువఱకు నామె ముడివేయలేదు. ఒకర్తు పారాణి సగముసగము పెట్టుకొనుచునింతలో దంపతులు వచ్చినవార్త విని యది సమాప్తము కాకమునుపె త్వరితగతిని గవాక్షమునకుఁ బోవ నడచిన మేర యంతయు నేల లత్తుకరంగ మాయెను. ఒకర్తె కాటుక కుడికంటికిఁ బెట్టుకొని యెడమకంటికిఁ బెట్టుకొనకయె పుడక చేతఁ బట్టుకొని గవాక్షముకడకు పోయెను. మఱియొకర్తె తొట్రుపాటున వాతాయనమువంకఁ బోవుచుండఁ బోకముడి వీడెను. చీరఁ గట్టుకొనుట కవకాశము లేక యాసుందరి హస్తాంగుళిరత్నప్రభ నాభిస్థానమును గప్పునటుల పోకముడి చేతఁ బట్టుకొని జాలకట్లకడకుఁ బోయెను. ఒకయంగన మొలనూలు సగము గ్రుచ్చి మిక్కిలి సంభ్రమమున లేచి దంపతీదర్శనముఁ జేయ గవాక్షము కడకుఁ బోవుచుండ మణులన్నియు దారిపొడుగున రాలెను. మణులు గ్రుచ్చు

టకై కాలి బొటనవ్రేలికి పెనవైచిన దారము మాత్రమే నిలిచెను. మధుగంధముతో నొప్పుచున్న యాయంగనల మొగములు కన్నులనియెడు తుమ్మెదలతోఁ గూడిన తామరపువ్వులవలె నున్న దాన గవాక్షములకుఁ బద్మతోరణము గట్టినయందము కలిగెను. చూడ్కుల చేతను రాఘవుని సోయగము జుఱ్ఱుకొనుచున్న యాయంగనల మనంబులు మఱియొక వ్యాపారమందుఁ బ్రవేశపెట్టకపోయెను. ఎల్లయింద్రియములశక్తులు నయనములయందే నిలిచినటుల కనఁబడెను. దంపతులం జూచి పౌరాంగన లిట్లను కొనిరి. తన్నందఱు వలచియు జనను వారినందఱ విడనాడి లక్ష్మీదేవి నారాయణుని వరించిన చందమున నీమె యీకుమారుని వరించె. ఇట్లత్యంతశోభను మించు నీదంపతులను గూర్పకుండినయెడల వీరికట్టి సౌందర్యము పెట్టుటకు విధియొక్క కృషి యంతయు వ్యర్థమగును. ఈతఁడు మన్మథుఁడు. ఇంది మఱి రతీదేవి. జన్మాంతరసంబంధముండుటచేతనే తన్నందఱు గోరుచున్న నీమె యీతని వరించె."

అని పౌరాంగనలు శ్రవణానందముగఁ బల్కుచుండ వినుచు దంపతులు సంతోషితస్వాంతులై మంగళాలంకృతమగు నంతఃపురముఁ జేరిరి. అజుఁడు మదపుటేనుఁగు డిగ్గి కామరూపదేశపురాజు చేయిఁ బట్టుకొని, స్త్రీలమనంబులు జొచ్చినట్లే విదర్భరాజు చూపినమందిరమును జొచ్చెను. చొచ్చి యర్హాసనంబునఁ గూర్చుండి మణిసమేతమైన యర్ఘ్యమును మధుపర్కమును భోజునివలన స్వీకరించి తెల్లనిమధుపర్కములు దాల్చిన యారఘునందనుని నంతఃపురమందలియంగనలు పెండ్లికూఁతురు కడకుఁ దోడ్కొని వచ్చిరి. తోడితెచ్చుట నుగముతో నున్న సముద్రునిఁ జంద్రకిరణములు తీరమునకుఁ జేర్చినటులుండెను. భోజరాజపురోహితుఁ డాజ్యము మొదలగుహవ్యములు వ్రేల్చి యగ్నిదేవుని సంతుష్టిని జేసి యాయగ్ని సాక్షిగ వధూవరులను గూర్చెను. అశోకలతాపల్లవమునందుఁ దనపల్లవముఁ జేర్చి చూతవృక్షము భాసిల్లు నటుల రాఘవుఁ డామెహస్తముఁ దనహస్తమునఁ బట్టుకొని పాణిగ్రహణవేళ మునుపటికంటె ప్రకాశించెను. అప్పుడు వరునిమెయ్యి పులకరించెను. వధువుయొక్క వ్రేళ్ళనడుమ చెమ్మటలు పొడమెను. వారిరువురకు నొండొరులమీఁద ప్రేమ సమానమయ్యెను. వారినేత్రము లొండొరులఁ జూచువేడ్కతో కుప్పి వాలుచూపుల వెదజల్లుచుఁ జూడ్కులు కలిసినప్పుడు గిరుక్కున మరలుచు సిగ్గున నేలవంక వాలెను. దీప్తిమంతుఁడైన యగ్నికి దంపతులు ప్రదక్షిణము తిరిగి మేరుగిరిచుట్టు దిరుగు పగలు రేయియువలె భాసిల్లిరి. పెండ్లికూఁతురు మిక్కిలి సిగ్గున నగ్నిహోత్రమున లాజహోమముఁ జేసెను, జమ్మిచిగుళ్లు పేలాలు మొదలగు హవిస్సులను గ్రహించి యగ్ని ప్రజ్వరిల్లెను. ఆధూమము పెండ్లికూఁతురు చెవిలో దాల్చిన నల్లగలువవలె గానఁబడెను.

అనంతర మావధూవరులు బంగారు పీటలపైఁ గూరుచుండి చుట్టములు పెద్దముత్తైదువులు మొదలగువారు చల్లిన తడియక్షతలు శిరమున ధరించిరి. విదర్భరాజు చెల్లెలికీవిధముగ వివాహముఁ జేసి తక్కినరాజులకును సముచితసత్కారంబులు చేయుమని యధికారులం బంచెను. అడుగున మొసళ్ళుపైన తేటనీరుగల మడుగులవలె రాజులు కోపమంతయు దిగమ్రింగి కపటస్నేహమును జూపి కట్నాల పేరుపెట్టి భోజుఁడిచ్చినకానికలు మరల వానికిచ్చి యతనిసెలవు గైకొని పోయిరి. పోయి తమలోఁదా రేర్పఱచుకొన్న కట్టుప్రకారము భోగ్యవస్తువైన యిందుమతినిఁ గొనిపోవుచున్న యజునిమార్గమున సైన్యసమేతముగ దాకఁ దలఁచిరి. అంతట విదర్భరాజు చెల్లెలికిఁ మఱఁదికిఁ దగినయరణములుఁ గానికలు నిచ్చి స్వగృహమునకుఁ బోవుటకు రాఘవునకు సెల విచ్చి యతనివెంట దానును బయలువెడలెను. వెడలి వైదర్భుఁడు మూఁడురాత్రులవఱకు నజునితోఁ గలిసియుండి పర్వాంతమందు చంద్రుఁడు సూర్యుని విడుచునట్లు రాఘవుని విడిచి స్వపురమునకుఁ జనియెను. కోసలేంద్రుఁడైన రఘువు తొల్లి దిగ్విజయము చేసినప్పుడు తమ ధనంబులనెల్ల గొల్లపెట్టుటచే రాజు లతనిపై దీర్ఘక్రోధము దాల్చియుండిరి. ఆపరాభవమునకుఁ దోడుగ నిప్పు డతనికొడుకు స్త్రీరత్నము నపహరించుకొని పోవుచుండఁగా రాజులు కన్నులారఁ జూచి యూరకుండుట యరిదికదా! అందుచేత విదర్భరాజ పుత్రికను దోడ్కొని పోవు చున్న కోసలరాజపుత్రుని నానారాజకుమారులు మార్గమధ్యమున బలివైభవము హరించిన వామనపాదమును మహేంద్రశత్రులగు రాక్షసులు దాకినట్లు చుట్టుముట్టి తాకిరి. తనకును దండ్రికిని విశ్వాసపాత్రుఁడై యాప్తుఁడైన మంత్రిని భోజరాజతనయాసంరక్షణార్థము కొంతసేనతో నిలిపి గంగానదిని శోణానది తాకునట్లు రాఘవుఁడు మిగిలిన సైన్యముతో శత్రుసైన్యమును దలపడెను. పదాతిని పదాతి, గుఱ్ఱపురౌతుని గుఱ్ఱపురౌతు, రథికుని రథికుఁడు, గజయోధుని గజయోధుఁడు దాకి సమానముగ ద్వంద్వయుద్ధముఁ జేసిరి. అప్పుడు రణదుందుభిధ్వానముల నొకరిమాట యొకరికి వినఁబడకపోవుటచేత యోధులు తమవంశకీర్తనలను మాని యాత్మగౌరవములను బాణాక్షరములచేతనే చాటుకొనఁజొచ్చిరి. గుఱ్ఱముల డెక్కలవలన రేగినధూళి రథచక్రభ్రమణముచేత మఱింత వృద్ధిఁ జెంది యేనుఁగుల చెవులగాలిచే బెచ్చుపెరిగి సూర్యమండలము గనఁబడకుండఁ జేయునట్టి తెర యయ్యెను. ఆసందడికయ్యమున సైనికులురథచక్రధ్వనులచేతను మదపుటేనుఁగుల మెడలలోని గంటలచప్పుడుచేతను తమతమ నాయకుల నామములచేతను తమవా రెవ్వరో పగవా రెవ్వరో తెలిసికొనుటకు వీలులేని యాధూళిలో స్వజనపరజనంబులఁ గనుఁగొనుచుండిరి. ధూళిపటములలవన

వ్యాపించిన పెంజీకటులలోఁ గాశ్వభటసమూహముల శరీరములఁ దగిలినగాయముల లోనుండి స్రవించు నెత్తురు భానుమండలమై వెలుతురు నిచ్చెను. లేచినదుమ్మును రక్తప్రవాహమణచివైవ గాలిపాటున మరల దానిపైఁబడిన క్రొత్తదుమ్ము మండి చల్లారిన నిప్పుమీఁది పొగవలె కనఁబడెను. శత్రువునిచేత దెబ్బతిని రథికుఁడు మూర్ఛిల్ల సారథి రథము దూరముగఁ గొనిపోవుటఁ జేసి రథికుఁడు తెలివి గలిగినతరువాత రథము దూరముగ దోలినందుకు వానిని చీవాట్లు పెట్టుకొని టెక్కెములు గురుతుపట్టుకొని మున్ను కొట్టినవానిమీఁదికి రథమును దోలించి వానిని సంహరించెను. చాపములు ధరించినయోధులు తీవ్రశరములను విడువ వానిని శత్రువులబాణములు మార్గమధ్యమున ఖండించుచుండెను. అట్లు ఖండింపఁబడినను నిసుపములుకు గలబాణభాగము నేల బడక రివ్వున నేగి లక్ష్యమునకుఁ దగులుచుండెను. మొదట తనచేత దెబ్బతిని రౌతు గుఱ్ఱపుమెడమీఁదఁబడి మరలఁ దన్నుఁగొట్టలేనియవస్థలో నున్నపుడు క్షత్రియయోధుఁడు వానిజోలికిఁ బోక విడుచుచుండెను. కూలినజోదులతలలు పండ్లుగ బొమిడికంబులు పానపాత్రములుగ రక్తప్రవాహము మద్యముగ యుద్ధభూమి మృత్యుదేవతయొక్క పానభూమిగ నుండెను. రణరంగము పీనుఁగుపెంట లగుటచేత నక్కలు పుల్లుఁగులు మొదలగునవి శవములఁ బీకికొని తినుచుండెను. ఒకశవభుజమును బక్షులు చీల్చుచుండఁగాఁ జూచి యొకనక్క యాభుజమును బట్టుకొని భుజకీర్తి మొనచేత తనతాలువు తెగి గాయపడ నొచ్చి మాంసముమీఁద నెంతో యాసక్తి యున్నను నొప్పిచేత దానిని విడిచిపెట్టెను. ఒకయోధుఁడు శిరము తెగి చచ్చినవెంటనే విమానారూఢుఁడై దేవకాంతతోఁ గూడ వీరస్వర్గమునకుఁ బోవుచు నప్పుడప్పుడే శిరమునుండి వేఱుచేయఁబడిన తనమొండెము నృత్యము చేయుచుండుటఁ జూచెను. ఇద్దఱు రథికులు తమసారథులు నేలఁ గూల తామే రథికులు సారథులుఁ గూడనై యరదంబులు నడుపుచు యుద్ధములు చేయుచు తమగుఱ్ఱములు కూలినతరువాత నేల కుఱికి ద్వంద్వయుద్ధముఁ జేసిరి. ఇద్దఱుయోధులన్యోన్యప్రహారములచేత నేకకాలమందు నిహతులై తత్క్షణమే యమరత్వముఁ బొందియప్సరఃకాంతనిమిత్తము మరలఁ బోరాటము సేయఁదొడఁగిరి. వెనుక గాలి వీచినప్పుడు వెనుకప్రక్కను ముందు గాలివీచినప్పుడు ముందుప్రక్కను సముద్రతరంగములు వృద్ధిఁ జెంది గాలి లేనప్పుడు క్షయముఁ జెందునట్లు రెండువ్యూహములలోను జయాపజయములు సమవిభక్తములై యుండెను. అజునిసైన్యము పరాజయము నొందఁగ నతఁడె స్వయముగ నుదగ్రమూర్తియై పరసైన్యంబును దాకెను. పొగ గాలిచేత దూరముగఁ బోయినప్పుడు మంటయె గడ్డిపైఁ బ్రసరించి దహించునుగదా ! ప్రళయకాలమందలిమహా

సముద్రజలమును వరాహమూర్తి యొక్కఁడే యాఁపినట్లు రాఘవుఁడు తా నేరథియై విలుకాఁడై కవచియై తూణియై పరసైన్యము నతఁడు నిలిపెను. అమ్ములపొదిమీఁద నజుఁడు కుడిచేయి పెట్టి యమ్ముదీయుట దానిని వింటఁ దొడుగుట పగతురపై విడుచుటఁ దెలిసికొన లేక శత్రువు లాకర్ణాంతముగ లాగినరాఘవునిధనుస్సు నుండియే బాణములు పుట్టి వెడలుచున్నవా యని శంకించిరి. చిట్టలుకచే బడినకన్బొమలముడులను నోరు గఱచుటచే గాయపడిన యధరములును గల శత్రుశిరములను రాఘవుఁడు నేల బఱచెను.

అప్పు డజునిధాటికిఁ జోర్వలేక గజబలంబులతోడను కవచభేదిని మొదలగు సాధనంబులతోడను సకలప్రయత్నములతోడను రాజులందఱు నొక్కపెట్టున నజునిపై కురిసిరి. శత్రువులబాణములు రాఘవునిరథమును సంపూర్ణముగఁ గప్పివైచుట చేత నతని టెక్కెమును బట్టియే యజుని రథమని తెలిసికొనవలసివచ్చెను. మంచుచేత సూర్యమండలము గప్పఁబడినప్పుడు తేజమును బట్టి సూర్యుఁ డక్కడ నున్నాఁడని తెలిసికొనవచ్చును గదా! మారసమానాకారుఁ డగు నయ్యజుఁడు తనకు ప్రియ వదుఁ డగు గంధర్వుఁ డిచ్చిన సమ్మోహనాస్త్రము నప్పుడు శత్రుసైన్యముపైఁ బ్రయోగించెను. ప్రయోగించినతోడనె సైనికు లందఱు మూర్ఛితులైరి. చేతులు నారిత్రాడును లాగఁజాలక పోయెను. తలమీఁది బొమిడికములు భుజములపై జాఱిపడెను. అప్పు డజుఁడు విజృంభించి శంఖము పూరించి భుజబలార్జితమైన తనయశస్సును త్రాగుచున్న లోకైకవీరుఁ డట్లొప్పెను. అంతకుమున్ను బరాజయము నొందిన యజునిసైనికులు శంఖధ్వని విని తమప్రభువు గెలిచినాఁడని ధైర్యము దెచ్చుకొని వేడియు నతనిచుట్టుఁ జేరి తామరపువ్వులనెల్ల ముకుళింపఁజేసిన చంద్రుఁ డటులు శత్రుయోధులనెల్ల మూర్ఛిల్లఁ జేసినయజుని గన్గొని యానందించిరి. అప్పు డజుఁడు నెత్తురంటిన బాణంపు మొనలతో “అజుఁడు దయాళు వగుటచేత మీప్రాణముల నపహరింపక మీయశంబు మాత్రమే యపహరించె” ననునక్షరముల వారి టెక్కెముల మీఁద లిఖించెను. లిఖించి చాపంబు మూఁపున ధరించి నెన్నుదుటఁ జెమటబొట్లు వ్యాపించియుండ భయపడుచున్న ప్రియురాలిఁ గలిసికొని యిట్లనియె.

“ఓవైదర్భీ! నీవు నన్ను వరించినందుకు మిక్కిలి యసూయఁ జెంది నాపైఁ బడిన శత్రువులను మూర్ఛ బొందించి వారిశస్త్రములను శిశువులు సయితము హరియించునట్లు చేసి వారికి సెలవిచ్చి వచ్చితిని.” ఆపలుకులు విని మనంబు కలక దేఱి యాయిందుమతి మాలిన్యము దొరంగిన యద్దమువలె స్వచ్ఛమై యొప్పెను.

ఆమె భర్తయొక్క జయమును లోన మెచ్చియు సిగ్గుచేత వెలికిఁ బొగడక సఖీజనంబుల మాటలను మెచ్చఁదొడఁగెను.

ఈవిధంబున శత్రురాజుల మూర్ధములపైఁ దనయెడమకాలు నిలిపి రఘునందనుఁడు శౌర్యశ్రీ రథ మెక్కించుకొని సైన్యమును దోడ్కొని యశ్వములు రేపిన ధూళి యామెయలకల కలకారములు పెట్టి నయోధ్యకుఁ బయనమై పోయెను. ఇందుమతియు జయలక్ష్మివలె శోభిల్లెను. అజునివృత్తాంత మంతయు మున్నె యెఱింగినరఘువు ప్రియవధూసమాగముఁ జెంది జయలక్ష్మీ సమేతుఁడై వచ్చి కొడుకును గారవించి రాజ్యభార మాతనిపై నిలిపి తాను తపోవనమున కరుగఁ దలఁచెను. ఇక్ష్వాకుకులీనులైన రాజులు కుమారుఁడు కులధుర్యుఁడు కాఁగానె గృహమందు నిల్వరుగదా !

వివాహకంకణము దాల్చియున్న యాయజునకు రఘువు రెండవయిందుమతివలె నున్నవసుధర నిచ్చి యేలుకొమ్మనెను. ఎంతెంత దుష్కార్యములఁ జేసియైన రాజకుమారులు దేనిని తనయధీనముగఁ జేసికొనుటకు సకలప్రయత్నములఁ జేయుదురో యట్టిభూమి యయాచితముగఁ దనవశ మగుచున్నపు డజుఁడు దానిని భోగతృష్ణచేత గాక తండ్రియాజ్ఞచేత నేలుటకిచ్చగించెను. వశిష్ఠునిచేతియుదకముల చేత నజునితోఁగూడ వసుధర పట్టాభిషిక్తయై చిన్నచిన్న యూర్పులచేత తన కృతార్థతను దెలియఁజేయుచున్నదో యన్నట్లు తత్కాలమున బయలుదేఱినయావిరులచేత భాసిల్లెను. అజుఁడు భూమినేగాక తండ్రియొక్క సమస్తకళ్యాణలక్షణములను దాల్చి యేలుచుండుటచే నితఁడు రెండవబాల్యము దాల్చి వచ్చినరఘుమహారాజే యని భావించుచు వచ్చిరి. పడుచుదనమునకు వినయము వన్నెపెట్టుటచేత రఘువు నిర్మలయశోవంతుఁడై పైతృక మగు రాజ్యము బరిపాలించెను. అమ్మహావీరుఁడు వసుంధరను నూతనముగఁ దాల్చియుండుటచే సాహసము జూపిన భీతిల్లునని యుడిగి క్రొత్తపెండ్లికూఁతును బుజ్జగించిన తెఱంగున నెంతో దయతో నేల జూచెను. సమస్తనదులు సముద్రునిచే నాదరమునే కాని తిరస్కారమును బడయనట్లు ప్రకృతిజనులలోఁ బ్రతిమనుష్యుఁడు తాను రాజున కాప్తుఁడే యని తలఁచుకొని గౌరవమునే గాని తిరస్కారమును బడయఁడు. అతఁడు రాజులయందతి మార్దవము జూపక మిక్కిలిచండతఁ బ్రయోగింపక నడిమిమార్గము ననుసరించి వాయువు వృక్షములను బెల్లగింపక వంచునట్లు రాజులను నిర్మూలనము జేయక వారు వంగి యుండునట్లు చేసెను. తనకుమారుఁడగు నజుఁడు రాజ్యమునందు సుప్రతిష్ఠితుఁడగుటఁ జూచి రఘువు భూలోక విషయములయం[illegible]

టయె గాక జ్ఞానసంపత్తిచేత వినాశధర్మములగు స్వర్గసంబంధవిషయములయందు గూడ బుద్ధి నిలుప లేదు. దిలీపవంశజులైన రాజులు వార్ధకమున దమ రాజ్యము పుత్రులవశము జేసి విషయముల గెల్చి నారచీరలను గట్టి తపోవనమున కరుగుట యాచారము గదా. రఘువు తపోవనమునకుఁ బోవ సమకట్టిన దనుఁడు విషాదగ్రస్త మనస్కుఁడై యడుగులపై వ్రాలి యడవికిఁ బోవలదని ప్రార్థించెను. పుత్రుని యం దధిక ప్రేమ గలవాఁ డగుటచే రఘువు పోవలదని తన్నుఁ గన్న కొడుకు ప్రార్థించినకొడుకుకోరికను దీర్చెను. కాని త్రాచుబాము విడిచిన కుబుసమును మరల దాల్పనట్లు రాజ్యమును మాత్రము గ్రహింపలేదు. ఇంద్రియంబుల జయించి చతుర్థాశ్రమమైన సన్యాసమును స్వీకరించి యూరివెలుపల నొకయెడ రఘువు వసియించెను. కుమారుఁ డనుభవింపఁ దగినకోడలు విధమున రాజ్యలక్ష్మి రఘువునకు సకలోపచారముల జేసెను. పూర్వపురాజు శాంతిదశయందుండుటచేతను క్రొత్తరాజభ్యున్నతుఁడై వెలయుచుండుటచేతను నాదీపకుల మస్తమించుచున్న చంద్రునితోడను బాలసూర్యునితోడను వెలయు నాకాశమువలె భ్రాజిల్లెను. యతివేషము దాల్చినతండ్రిని రాజలాంఛనములు దాల్చిన కుమారుని గని ప్రజలు మోక్షముయొక్కయు లౌకికమహాభ్యుదయముయొక్కయు నంశములు భూమిమీఁద నవతరించె నని తలంచిరి. దుర్జయులగు రాజులను గెలుచుటకై యజుఁడు నీతికోవిదులగు మంత్రులం గూడి యాలోచనలు చేయుచుండెను. రఘువు శాశ్వతమైన మోక్షపదమును సంపాదించుకొనుటకు జ్ఞానవంతులగు యోగులను గూడెను. పడుచువాఁ డగు కుమారుఁడు ప్రకృతిజనులకు న్యాయ మిచ్చుటకు ధర్మాసన మధిష్ఠించెను. విషయముల జయించినతండ్రి యోగమార్గమునఁ బద్మాసన మధిష్ఠించెను. వార్ధకములో నొకఁడు రాష్ట్రమందలి సకలరాజులం బ్రభుమంత్రిశక్తుల నరసి వశపరచుకొనుచుండ రెండవయతఁడు ప్రణిధానమునఁ జేసి శరీరగోచరములగు పంచవాయువులను వశపఱచుకొనుచుండెను. ఒకఁడు సర్వప్రపంచమున కధీశ్వరుండై శత్రుకార్యఫలములను భస్మము జేయుచుండ రెండవయతఁడు జ్ఞానాగ్నియందుఁ గర్మకాండ భస్మముఁ జేయుచుండెను. సంధివిగ్రహాదులు మొదలగు షడ్గుణములఁ బెక్కుగాఁ బరియాలోచించి యజుఁడు తత్తత్ఫలముల నందుచుండ రఘువు చిల్లపెంకును బంగారమును సమముగఁ జూచుచుఁ బ్రకృతిలో నున్న గుణత్రయమును గెల్చుచుండెను. క్రొత్తరాజు కార్యముల స్థిరముగాఁ బూని ఫలము బడయువఱకు ప్రయత్నమును మానఁడు. ప్రాతరాజు పరమాత్మనియనుసంధానముఁ బడయువఱకు యోగాభ్యాసము మానఁడు. ఇత్తెఱఁగున నైహికాభ్యుదయంబును నపవర్గంబును

గోరుచున్నట్టి యారాజు లింద్రియదోషములకుం బురికొల్పనేరలక యింద్రియములకు
వశులు గాక తమతమయభీష్టములను సంపూర్తిగ నెరవేర్చుకొనిరి. అట్లు రఘువు
సమదర్శనుండయి కుమారునియభీష్టప్రకారము కొన్ని వత్సరములు నడపి యోగ
సమాధినిష్ఠుండై యవ్యయుండగు పరమాత్మునింజేరెను. పితృమరణవార్త విని యజుండు
శోకపూరితుండై చాలసేపు కన్నీరు విడిచి యతులను గూడి యనగ్నికమైన దేహాంత
సంస్కారముల నాచరించెను. తండ్రియం దతిప్రీతిచేత నజుండు యథావిధిగ నుత్తర
క్రియల నొనర్చెనే కాని యోగనిష్ఠులై జ్ఞానమార్గమున శరీరత్యాగము చేసినవారు
కుమారు లిచ్చునట్టి పిండముల నపేక్షింతురా ?

గతించినజనకుని నిమిత్తము విచారింపం గూడదని యథర్వవేది యైన గురువు
చేసిన హితోపదేశంబు చెవి నిడి శోకంబు విడిచి ధర్మోత్తరంబుగ నజుండు ప్రజా
పాలనముం జేయుచుండెను. వసుమతియుం బతివ్రత యగు నిందుమతియు నజుని
భర్తగా బడసి యతనిని సంతుష్టుని జేసిరి. అందు మొదటిది బహురత్నముల
నిచ్చెను. రెండవది వీరుండైన పుత్రరత్నము నొసంగెను. ఆకుమారుండు దశశత
ధామతేజంబు గలిగి దశదిక్కులయందు యశంబు పర్వంజేసి దశకంఠవైరికి దండ్రి
యై భాసిల్లి తనరథంబు దశదిక్కులకును బోలించు నని యెఱింగి పెద్దలు వారికి
దశరథుండను పేరు పెట్టిరి. ఆరాజశేఖరుం డట్లు వేదాధ్యయనముచేత ఋషులఋణ
మును యాగములచేత దేవతలఋణమును సంతానప్రాప్తిచేత పితౄణమును దీర్చి
కృతకృత్యుండై పరిధినుండి విముక్తుండగు సూర్యునట్లు విరాజిల్లెను. ఆమహారాజు
బలమార్త జనసంరక్షణనిమిత్త ముపయోగింపంబడియె ; అతనివిద్య పండితసన్మతి
నిమిత్త ముపయోగింపం బడియె. అతనివిత్తమేగాక గుణవృత్తములుం గూడ పరుల
కుపయోగపడెను. అట్లు ప్రజలను బిడ్డలవలె గాపాడునట్టి యామహారాజు కొక్క
నాడు దేవీసహితుండై నందన వనంబున విహరించు నమరనాయకుం డట్లు నగరోప
కంఠముననున్న యుద్యానవనమందు విహరించెను. అప్పుడు దక్షిణసముద్రతీరప్రాం
తమున గోకర్ణమను క్షేత్రమున వసియించుచున్న బ్రహ్మదేవునియొద్ద వీణ వాయిం
పం దలంచి నారదుం డుత్తరదిక్కుననుండి యాక్షేత్రమునకు వెళ్లుచుండెను. ఆమహా
మునియొక్క వీణాగ్రమున జుట్టంబడినదివ్యకుసుమమాలిక దాని వాసన జూచుటకో
యన వాయువు హరించెను. ఆపుష్పసంబంధమైన వాసనలచేత జుట్టును దిరుగు తుమ్మె
దలు, వాయువు తనకు జేసిన యవమానమునకు మిక్కిలి వగచి వీణ విడుచుచున్న కాటు
కకన్నీరుబొట్లవలె నల్లనై శోభిల్లెను. పువ్వుదేనియకలిమిని సౌరభవిశేషమున వసంత
కాలలతను బోలి యున్నయాపుష్పదామము నృపాలశేఖరునిధర్మపత్నియొక్క స్తనా

గ్రములయందుఁబడెను. "పూలదండ మేన బడినతోడనె యిందుమతీదేవి భయంపడి ప్రాణములు బాసి నేల బడెను. భర్తయు నామెతోడనే నేలనొరిగెను. దీపకళిక తన కాధారమైన చమురుచుక్కతో గూడ క్రిందబడును గదా. ఏలిక లిద్దఱుం డునఁ బడుట చూచి సన్నిధానవర్తులగు సేవకులు దుఃఖపడఁగా నచ్చటి కమలాకరమునం దున్న పక్షులన్నియు సమదుఃఖము కలిగినట్లు రోదనచేసెను. వ్యజనములు వీఁచుట మొదలగు నుపచారములచేత రాజు తెప్పిరిల్లి లేచెను. కాని యామె కదలక యట్లే యుండెను. ఆయువున్నప్పుడే కద చికిత్సలు మొదలగు ప్రతీకారవిధానములుపయోగించుట. శ్రుతులు తెగియున్న వీణియ నొడిలో బెట్టుకొనినట్లు ప్రాణములు బాసిన యాయిందుమతి నతఁడు నితాంతప్రేమమున నొడిలో బెట్టుకొని సహజమైన ధైర్యమును విడిచి కన్నీరు విడుచుచు గద్గదకంఠములో మిక్కిలి విలపించెను. మిక్కిలి తప్తమైన యినుము సయితము మెత్తబడుచుండగా నింక మనుష్యమాత్రునిమాట చెప్పనేల ? అతఁడీక్రింది విధమున వగచెను.

శరీరము సోఁకినంతమాత్రమున బువ్వులుసయితము ప్రాణములు తీయజాలిన యెడల జంపఁదలఁచుకొన్నప్పుడు దైవమున కేది యాయుధము కాకుండును. ఒకవేళ మెత్తని వస్తువులను మెత్తనివాని చేతనే యముఁడు చంపఁదలఁచుకొన్నట్లు తోఁచుచున్నది. మంచుపడినతమాత్రముననె తామరపువ్వు మాడిపోవుట చూచుచున్నాము. ఇందు కదియె ప్రథమోదాహరణము. ఈపుష్పమాలికయె ప్రాణములు తీయఁగలదేని దానిని నేను వక్షస్థలమున ధరించుచున్నాఁడ గదా. అది నన్నేల చంపగూడదు ? ఈశ్వరేచ్ఛ యనుకూలమగునేని విష మమృత మగును. ప్రతికూలమైనచో నమృతము విషమగును. ఈపూలదండ నాభాగ్యదోషమున బ్రహ్మదేవునిచేత గల్పింపఁబడినదని చెప్పవచ్చును. ఏల యన నది కొమ్మలపై నల్లుకొన్న తీఁగను జంపెను. కాని చెట్టును చంపఁజాలకపోయెను. నేరము చేసినప్పుడైనను నన్ను దప్పుపట్టి రోయవు. అట్టినీవు నేఁ డేనేరము చేయనినన్ను బలుకరించి యొక్కమాటైన నాడవేమి ? నీవు నన్నిడ బాసి మరల రాకుండఁ బోవుచున్నను నేను నీవెంట రాఁజాలనైతిని. దీని బట్టి నేను నీయెడలఁ గపటవాత్సల్యము గలవంచకుఁడనైతిని గదా. ఓపాడు ప్రాణమా మొదట నామెలో గలిసి పోయి మరల నేల వచ్చితివి. స్వయంకృతాపరాధముచేత నాజన్మాంతము దుస్సహమైన వియోగదుఃఖ మనుభవించుచుండుము. ఈవనమందు విహరించుటవలన నీమొగంబున బొడమినచెమటబిందువులైన నారలేదు. ఇంతలోనె నీప్రాణము పోయెను. నీ యీదేహము లెంతయస్థిరములు. మనస్సుచేతనైనను నీకెన్నఁడు నే నప్రియము జేసి యెఱుఁగను. అట్టి నన్ను నీవేల విడిచి పో

వలయు. నేను పేరునకుమాత్రమే భూమిపతిని కాని నిజముగా నీకనురాగబద్ధుఁడను గదా పువ్వులతోఁ గలసియున్న తుమ్మెదలవలె నున్న నీకురులు గాలికి కదలుచుండుటచే నీకు మరల ప్రాణము వచ్చిన దేమో యని నేను సంశయించుచున్నాను. కావున నోప్రియురాలా! మరల నీవు బ్రతికి రాత్రి హిమవత్పర్వతగుహలలోనుండు చీఁకటిని మహాతేజోవంతము లగు నోషధులు నాశనముఁ జేసినట్లు దుస్సహమైన నా దుఃఖమును బాపి రక్షింపుము. లోపలితుమ్మెదలు ధ్వనులు సేయుట మానియుండ రాత్రిముకుళించుకొనిపోవు పద్మమట్లు మాట లుడిగియున్న నీముఖము నామనస్సుని మిక్కిలి బాధపెట్టుచున్నది. పులుఁగులలో మగజక్కవపిట్ట మరల నాఁడుజక్కవపిట్టను తెల్లవాఱుగానె కలియును. నిశాకాంత పగలు చంద్రునితో విరహమొందినను సూర్యాస్తమయముకాఁగానె యతనిని వెండియుఁ గలిసికొనును. మరల గలయిక కలుగునను నాసచే జంద్రచక్రవాకములు విరహము సైరింతురు. నీవో మరల నన్నెన్నఁడు గలియవు. ఈవియోగదుఃఖము నన్ను మరల బ్రతుకనిచ్చునే. మెత్తనిచిగురుపాన్పులమీఁద బవ్వళించినప్పుడు నయితము నీమేను నొచ్చుచుండెడిదిఁ అట్టినీవు మిక్కిలి దారుణమైనచితిమీఁద నెట్లుపవ్వళించెదవు. నీకు విశ్వాసపాత్రమగు ప్రథమసఖివంటిదైన యీమొలనూలు నీవు ధరింపక పోవుట చేత ధ్వనిమాని పెద్దనిద్దుర వోయిన నీతోడఁ దానుగూడ గతించినట్లు కనఁబడుచున్నది. తియ్యనైననీపలుకులను కోయిలలందును మందమందగమనంబులు రాయంచలయందును చూపులు జింకలయందును విలాసములను గాలిచే గదలుతీఁగలయందును నానిమిత్తము నిలిపి నీవరుగుచుంటివి. కాని దుఃఖోపశమనము జేయుటకు నీతో నేను వచ్చుట దక్క యివియెల్లఁ జాలునా? ఫలినీలతను సహకారవృక్షముమీఁద ప్రాకజేసి యారెంటికి వివాహము జేసి దంపతులను గావించి సంతోషించకుండ నీవిట్లు పోవుట న్యాయమా? నీవు దోహదము జేసి పెంచిన యశోకవృక్షము నీవు మిక్కిలిప్రియమున దాల్పఁదగిన పుష్పముల నిచ్చుచున్నది. అయ్యో! అవి నీతలలో ముడువక యెట్లు వీనిని నీచితిపై వైతును. అందెలకాలితో దన్ని యశోకమునకు దోహదము జేసి నీవెట్టి మేలు చేసినకతమున నది కృతజ్ఞత గలిగి పుష్పము లనియెడు బాష్పబిందువులు విడిచి నీకై యెంతో శోకించుచున్నది. నీయూర్పులవలె సువాసనలు గల యీపొగడపూవులతో సగము నీవును సగము నేనును దండ గూర్చుటకు పందెము వైచికొంటిమి. అందు నాసగము నేను గూర్చితిని. నీసగము నీవు కూర్చి ముగింపక యిట్టుల పెద్దనిద్దురఁ బోవుట నీకు న్యాయమా? సుఖదుఃఖసమానమైన సఖీజన మిదిగో యిచ్చట నున్నది. పున్నమచంద్రునిబోలు పుత్రకుఁ డిదిగో నిచ్చట నున్నాఁడు. విశేషించి యఖండప్రేమము

గలనే యున్నవాఁడను. ఇట్టి మమ్ముందఱ విడిచి నీవరుగుట మిక్కిలి నిష్ఠురముసుమా! నేటితో నాకు ధైర్యమెల్ల నశించెను; భోగములు పోయెను; గానముమీఁది యాశక్తి యుడుగఁబోయెను; ఋతువులమీఁదిప్రీతి క్షీణించెను; ఆభరణములప్రయోజనములంతకు మున్నె బాసె; నాపాన్పుశూన్యమయ్యె; నీవు నాధర్మపత్నివి; మంత్రివి; ప్రియసఖివి; మృదుకళయందు శిష్యురాలవు. కరుణాశూన్యమైన మృత్యువు నిన్ను హరించుటం జేసి నాసంబంధమైనది సమస్తమును హరింపఁబడియెను: నేను ముందుగా రుచి చూచి నీకిచ్చిన మధురరసము త్రాగుచుండెడుదానవు. అట్టి నీవు బాష్పజలకలుషితమైన జలాంజలి నెట్లు త్రాగనేర్తువు. అన్యచిత్తలెన్నఁడును నామనస్సును హరించి యెఱుఁగవు. నాకోరికలెల్ల నిన్నే యాశ్రయించి యుండెను. నీవు లేకపోవుటచేత నెంత మహైశ్వర్యమున్నను నది యజునకు వ్యర్థమే సుమా! కోసలేంద్రుఁ డిరీతి నిల్లాలిని గూర్చి జాలిగదురునట్లు విలపించుచుండ నచ్చటి వృక్షములు గూడ శాఖలనుండి కారుకరసరూపమున గన్నీటివర్షము గురిసి దుర్దినముగావించెను. అపుడు చుట్టములందఱు మిగులగష్టముమీఁద నిందుమతిని భర్తతొడమీఁదనుండితీసి కడసారి పూలదండలతో నలంకరించి అగరుపుల్లలతోడను మంచిగంధముతోడను దహనము జేసిరి. పరమవిజ్ఞానవంతుఁడయ్యు రాజు భార్యచనిపోయినప్పుడు వియోగదుఃఖము సహింపనేరక యామెతోఁ గలిసి నిప్పునం బడిచచ్చె ననులోకనింద వచ్చునను భయమున నతఁడు పత్నితో మృతినొందలేదు. కాని ప్రాణములమీఁదిప్రీతిచేత గాదు. అనంతర మారాజు గుణశేషురాలైన యాభార్యకు నుత్తరక్రియల నాయుద్యానవనమందె సలిపెను. నిశాకాంతను బాసినచంద్రునివగిదిని భార్యావిహీనుఁడైయున్నయారాజు పౌరకాంతలు విడుచుబాష్పజలప్రవాహములె తనశోకమునకు వఱదలుగ వెంబడియుం బట్టణము ప్రవేశించెను. అంతట నిక్ష్వాకుకులగురుఁడైనవసిష్ఠుఁడు తనశిష్యుడైనయజుఁడు భార్యావియోగదుఃఖమున దరపిల్లుచున్నాఁడని దివ్యదృష్టివలన యెఱిఁగి యజ్ఞదీక్షలోనుండుటచేత దాను స్వయముగ నయోధ్యకుఁ బోవుటకు వీలు లేక శిష్యులలో నొకని నజునియొద్దకుఁబంపెను. ఆశిష్యుఁ డజునితో నిట్లనియెను. "రాజా! నీదుఃఖకారణము వసిష్ఠమహాముని యెఱిఁగియుఁ దాను స్వయముగా వచ్చి పరామర్శచేసి నీకు దుఃఖోపశమనముఁ జేయుటకును నిన్ను పూర్వస్థితిలో నిలుపుటకును యజ్ఞదీక్షలో యుండుటచేత వీలులేకపోయినది. ఆయన నాముఖమున నీకు సందేశ మంపెను. ఆవాక్యము లన్నియు నాయనవే. అవి శ్రద్ధతో నాలకించి నీవు మనస్సున నిలుపుకొనఁదగును. ఆమహాముని విపులజ్ఞానవీక్షణములచేత భూతభవిష్యద్వర్తమానముల నెఱుంగును. కావున మీస్థితియు నతనికి గోచరమయ్యె. పూర్వకాలమున మహానుభావుఁడగు తృణబిందుఁ వను మహాముని

కలఁడు. అతఁ డుగ్రతపము సేయుచుండఁగా దేవేంద్రుఁ డాతపమునకు భయపడి తపోవిఘ్నము చేయుటకై నెఱజాణ యగుహరిణి యను నచ్చరను బంపెను. అంతట నామహాముని తనతపోభంగము జేయఁ దలంచి వచ్చిన యాకన్యపై మిక్కిలి కోపించి నీవు మనుష్యాంగనవై పుట్టవలసినదని శపించెను. ఆశాపముచే నది భయపడి స్వామీ నేను పరాధీనురాలను. దోషము చేసితిని కాన క్షమింపుమని ప్రార్థించుటయు నతఁడు జాలి గలిగి దివ్యకుసుములు నీపైఁ బడునంతవఱకు నీవు మనుష్యాంగనవై భూమిపై నుండుమని శాపావధి నానతిచ్చె. ఆకారణమున నాయచ్చర విదర్భరాజకులమున జనియించి నీకుపట్టపుదేవియై చిరకాలముండి శాపమోక్షణ కారణమగు పువ్వుదండ స్వర్గమునుండి జారినది కావున మరల స్వర్గమునకుఁ జేరెను. కాబట్టి యాయిందుమతీమరణమునకు విషాదమొందకుము, పుట్టినవారెల్ల గిట్టక మానరు. అదియునుఁగాక రాజులకు భూమియె ప్రథమభార్య. అది చేసియిప్పుడును గళత్రవంతుఁడవె కావున జాగరూకతతో భూమి నేలుకొమ్ము. మహైశ్వర్య మనుభవించుచున్నకాలమున మదము గలవాఁడ వనుపనిగ లేకుండ మిక్కిలివివేకముతోఁ బ్రవర్తించితివి. దుఃఖపీడితుఁడవైన యీకాలమునఁగూడ ధైర్యవంతుఁడను పేరు దెచ్చుకొనుము. ఈతెరంగున నీవు మిక్కిలి గుందుచు భార్యను బడయగలవా? నీ విపుడు మృతినొందినను నామెను కలిసికొనఁ జాలవు. శరీరధారులు తమతమ కర్మములంబట్టి వేఱువేఱులోకములకు బోవుదురు. కాని యొక్కచెలవునకు బోవరు. మృతి నొందినవారినిమిత్తమై చుట్టములు విడుచుకన్నీరు పరలోకమునందు నాప్రేతలను దహించునని శాస్త్రములు దెల్పుచున్నవి. కాబట్టి నీవిక వగచుట మాని యామెకు నివాపజలము నొసగుచుండుము. దేహధారులకు మరణమే ప్రకృతి యనియు జీవితము వికృతి యనియు బుధులు చెప్పుచున్నారు. కావున క్షణమాత్ర మూపిరి విడుచుచు బ్రతికియున్నను నదియె లాభమని మనము తెలిసికొనవయును. ప్రియబంధునాశనము హృదయశల్యమని మూఢుఁడు భావించును. విజ్ఞానవంతుఁడు కుశలద్వారము తెఱువఁబడినదని సంతసించును. దేహాత్మలందు సంయోగవిపర్యయంబులు జూచుచుండియు నెవ్వఁడు బాహ్యమై విషయసంబంధమైన విరహమును గూర్చి తాపమొందఁ దగునా? నీవు జితేంద్రియుఁడవై యుండియు సామాన్యులటుల విచారింపఁ జెల్లునా? వృక్షములవలెనే పర్వతములుగూడ గాలికి గదలినవక్షమునఁజెప్పవలసినదేమున్నది.” అజుఁడుమహాత్ముఁడైనవసిష్ఠుఁడంపంచిన యుపదేశంబులనాలకించి సగౌరవముగ మునిశిష్యుని బంపెను. కాని గాఢదుఃఖపరవశుఁడైనఅతనిమనంబున నాయుపదేశంబులు నిలువక మరలగురువుకడకే పోయినటుల కనబడె

ను. తనకుమారుఁ డగుదశరథుఁడు బాలుఁ డగుట చేత నతఁడు యుక్తవయస్కుఁడు ప్రాప్తించువఱకు ననఁగా నెనిమిదిసంవత్సరములవఱకు నారాజు ప్రియురాలియొక్క ప్రతికృతులను దర్శించుటవలనను స్వప్నములయందామెతో గలుగుక్షణమాత్రసంయోగము వలనను నెట్టకే కాలము బుచ్చెను. చిన్నరావిమొక్క గొప్పసౌధమును భేదించునటుల శోక మనుశల్య మారాజుహృదయమును బ్రద్దలు చేసెను. ప్రాణాపాయకరమై వైద్యుల కసాధ్యమైనయాశల్యము త్వరగా ప్రియురాలిని గలిసికొనుట కుపకరించు నని యతఁడు సంతసించెను. సకలశాస్త్రశిక్షితుఁడై కవచధారియై నెగడుచున్నకుమారుని దశరథుని! రాజ్యమున బ్రతిష్ఠించి రోగభూయిష్ఠమగుట చేతనిలువ గూడని తనదేహమును విడువఁ దలఁచి యజుఁడు ప్రాయోపవేశము జేసెను.

---

## దశరథమహారాజు.

---0---

జనకునిపరోక్షమున నుత్తరకోసలదేశంబున కధిపతి యయి నియమవంతుల లోను మహీపతులలోను నగ్రగణ్యుఁడును జితేంద్రియుఁడును మహారథుఁడును నగుదశరథుండు పాలించెను. క్రౌంచభేది తేజస్వి యయినయాదశరథుఁడు రాష్ట్రమును రాజధానిని నిజకులోచితముగను శాస్త్రయుక్తముగను బరిపాలించెను. కృషి సరిగా జేసినవారి కదునునకు సరిగ వర్షమిచ్చి రక్షించుమహేంద్రుని తమతమకార్యముల విధ్యుక్తముగ నెఱవేర్చు వారిశ్రమను బాపుదశరథుని, మాత్రిమి యాకాలమున విద్వాంసులు ప్రశంసించుచువచ్చిరి. అమరసమానుఁడయినయాయజనందనుండు మహీమండలి పాలించుచుండ భూమి పుష్కలముగఁ బండె. వ్యాధు లాదేశము ననడుగుపెట్ట లేకపోయెను. ఇంక శత్రురాజులు తేఱి చూడ నయినఁ జాలరని వేర చెప్ప నేల? దశదిశలు గెలిచి రఘువు పాలించుచున్నపుడు ధరణి యెంతో విలసిల్లెను. అతనివెనుక నజుఁ డేలినప్పుడును వసుధ యావిధంబుననె శోభిల్లె. వార్ధిఱతో సమానుఁడయినదశరథుఁడు శాసించునప్పుడు ధరణి యావిధంబున నుండక వేరుగలి నుండునా? భానుసమానతేజుఁ డయినయామహారాజు సమత్వమున యముని వసువృష్టివిసర్గమున గుబేరుని దుర్జనదండనంబున వరుణుని బోలియుండెను. తుహి

శ్వర్య మనుభవించు చున్నను దశరథమహారాజు వేఁటయందుఁ దమకము జూపఁడు. జూదమాడఁడు. సుర సేవింపఁడు. నూత్నయౌవను లగు ప్రియురాండ్ర తగులమున మెలఁగఁడు. ఆదశరథుఁ డాగ్రహ మెప్పుడో యెఱుఁగఁడు. పరుషుర నైన పరుషములఁ బలుకఁడు. హాస్యమున నైన నబద్ధ మాడఁడు. నిర్జరేంద్రుకడ నైన నీచమయిన కృపణవృత్తి జూపఁడు. ఆమహీపుని చేత నవనిపాలు రెల్ల నుదయాస్తమయములందు నుండిరి. శత్రులయెడల నతనిమనసు ప్రసన్నము. అలుక బుట్టించినవారియెడ నిరుపకుక. పే దశరథుఁ డయ్యును నొక్కరథముమీఁదఁ గూర్చుండి యొక్క విల్లెక్కువెట్టి యతఁడు మహీమండలము నెల్ల జయించెను. గజతురగస్యందనాదికమగునచతురంగబలము కేవల మతనివిజయములను ఘోషించుటకుమాత్రమె యుపకరించెను. ఏకరథము చేత మహీమండల మెల్ల గెలిచిన యాదశరథునకు సముద్రము జయభేరి యయ్యెను. నిర్జరేంద్రుఁడు నూఱంచులు గలకులిశాయుధము చేత మహీధరపక్షంబులఁ జెండాడె. దశరథుఁ డొక్కవింటను గూడి బయలుదేఱు బాణపరంపర చేత మహీధరపక్షంబులఁ జెండాడె. అమరు లమరేంద్రుని పాదంబులకు నమస్కరించినకరణి రాజు లనేకులు తమకిరీటమాణిక్యకాంతి నఖరాగంబునకు వన్నె పెట్టినట్లు దశరథునకు నమస్కరించిరి. భర్తలు పరాజయము నొంది దేశాంతరములకు బోవ శత్రురాజపత్నులు మంత్రులను సాయమిచ్చి కుమాళ్ళను దశరథునియొద్దకు ప్రార్థింపఁజేయ నతఁడు దయాళుఁడై దండయాత్రమాని సముద్రతీరమున విడిచి రాజధానికిఁ జనియెను. అనంతరము దశరథుఁడు దీక్షితుఁడై కిరీటము విసర్జించి యజ్ఞకర్తృకులవలెఁ దమసానదీతీరములందు నేక యూపస్తంభములను నిలిపెను. కృష్ణాజినము గంటను మృగశృంగమ్మును దర్భమేఖలయును మౌనము ధరించి యాగనిష్ఠాపరతంత్రుఁడై యున్నయామహారాజుదేహమున నీశ్వరుఁ డధివసించెను. అవభృథస్నానము చేత పరిశుద్ధుఁడై జితేంద్రియుఁడై మహేంద్రసభలో కూర్చుండ నర్హుఁడైన యాదశరథుఁడు మహావాహనుఁడై వృష్టిదానము సేయు నింద్రున కొక్కనికిమాత్రము శిరము వంచి నమస్కరించెను. లక్ష్మీభువుఁడును కకుత్స్థకులోద్భవుండును నైన యాపురుషరత్నమును విడిచి మహాపతివ్రతయైన లక్ష్మీదేవి యన్యనృపాలుర జేర నొల్లదయ్యెను. మహారథుఁడగు దశరథుఁడు రణముఖమ్మునందు దేవేంద్రునకు సహాయుఁడై నిలిచి బాణప్రయోగముల చేత దేవతావస్త్రులభయము బాపి జగజ్జేగీయమాన ప్రతాపము నెఱపెను. ఏకరథుఁడై ధనుర్ధరుఁడై యామహాబలుఁడు బలవైరి యండనుండి పోవునప్పుడు భాస్కరుని కభిముఖముగఁ బదఘట్టనమున లేచినధూళి రాక్షసుల రక్తధారల నణఁగజేసెను. పతియే దైవమని భావించునట్టిమగధకోసలకేక

యరాజపుత్రికలు నదులు సముద్రుని వరించినవిధమున మిక్కిలిప్రతాపవంతుఁడైన యా దశరథుని వరించిరి. ముగ్గురుభార్యలతో వెలయుచున్న యామహారాజు మూఁడుశక్తులతోనున్న యింద్రుఁడు భూమి నేలుటకు వచ్చెనో యన్నట్లుండెను. జగదేకవల్లభుండును నింద్రయమవరుణకుబేరసముఁడును నగు నమ్మహారాజు సాక్షాత్కరింపఁగా నిఁక గొలుచుటకో యన వసంతుఁడు క్రొత్తపువ్వులు దాల్చి వచ్చెను. మంచుచేతఁ బిప్పళ్లైన మంచిగంధపు జివుళ్లగమిగల మలయపర్వతమును విడిచి సూర్యుఁడు సాయంకాలమునందుఁ జక్రవాకములు పొందు వియోగమును జూచి జాలిపడెనో యన్నట్లుత్తరాయణగతుఁడై యాకసంబున జాలసేపు మసలఁదలఁచి దక్షిణదిక్కునుండి యుత్తరదిశకు గుఱ్ఱముల మరల్చి సారథిం బురికొల్పి మంచును హరించి ప్రభాతములను నిర్మలములు చేసె. మలయశైలము విడిచెను. వృక్షములయందు ముందు పువ్వుపూచెను. పిమ్మట చివుళ్లంకురించెను. అవ్వల కోకిలకూజితములును షట్పదఝుంకారములును బయలుదేరెను. ఇట్లు యథాక్రమముగ వనవృక్షములన్నియు శోభిల్లుచున్నపిమ్మట మధువారి ప్రవహించెను. ప్రణయకలహములచేత వియోగమునొంది మదనబాణహతులై వికలచిత్తులైన ప్రియురాండ్రకు శ్రావ్యనాదములతోఁ గూయు కోకిలలాప్తసఖులై ప్రియసమాగకారులై యుపకారము చేసెను. పండువెన్నెలలును సుఖప్రదములైన మలయమారుతములును పూచినచెట్లును మదించిన కోయిలలును గలవసంతకాల మహోత్సవమై భోగయోగ్యమై యుండెను గదా. మలయమారుతముచేత మొగ్గలతోఁ గలిసిన చిగుళ్లుగల లేమావితీగ మిగుల గంపించి యభినయము నేర్చికొనుచున్నదో యనునట్లుండి రాగము జయించిన యోగులకునయినను కామవికారము గలిగించెను. ధర్మోత్తరముగఁ బరిపాలనము సేయు రాజు [illegible] సరోవరములయందు మధుసంపదలఁ బోదలు [illegible] పులపై పురుగులు తుమ్మెదలు మూఁగెను. వసంతుని నవ్వువలె వెలయుచున్న పొగడపువ్వులమీఁద భృంగములు కడునాసక్తితోఁ బ్రాలెను. అశోకవృక్షములపై నమరిన పువ్వుల యందమే గాక ప్రియులను మోహింపఁజేయుటకై ప్రియురాండ్ర కర్ణముల యందాభరణములుగ ధరించిన చివుళ్లసయితము వికారము గలిగించెను. వసంతుఁడు వనలక్ష్మీదేహము నందు రచియించిన మకరికాదిపత్రములం బోలు గోరంటపువ్వులు తేనియలతో నిండియున్నకతమున దానినిమిత్తమై తుమ్మెదలు ఝంకారము సేయఁ జొచ్చెను. అతిదీర్ఘములుగ నున్నపక్షమున విరహదుఃఖమున నుండు కాంతలు బ్రదుకఁ జేరరని జాలిదలచియో యనునట్లు వసంతకాలపురాత్రులు తఱుఁగుచుండెను. కమ్మకమ్మనితావులతోడను గ్రొన్ననలతోడను వెలయువనములయందు ముగ్ధాంగనలు మునుముందు పలుకు మితవాక్యములటుల కోయిలకూజితములు విరళములై వినంబడెను. తుమ్మెదలపోదలు

శారీవగానవైఖరిగ బుష్పకాంతి దంతపంక్తిగ నుద్యానలతలు చల్లగాలికిఁ గదలుచిగు రుటాకు లనెడి హస్తములచేత నభినయనము చేయుచున్నవో యన్నటులుండె. తిలక భూరుహాగ్రమనెడు మేడపై నెక్కి కమ్మనిపూవుఁదేనెత్రావులు దెసల నలమికొన వే నవేలు తుమ్మెదలు ప్రియురాండ్రనుగూడి మనసు కరఁగింపనటుల గానము చేసెను. చక్రని తమ్మిపువ్వులతోడను మదకలనాదములు సేయుజలవిహంగముల చాలుతో డను విరాజిల్లు బొడ్డనబావులు నవ్వుమొగలములతోడను మొఱయుచుండు గంటల యొడ్డాణములతోడను వెలయువెలఁదుల తెఱంగున నుండెను. వరిణయకలాపా దయంబున వియోగమునొంది పువ్వులపిల్లనిహాళాహాళిచే మిక్కిలి గాసినొందిన యం గనలకు మిక్కిలి ప్రాచిన సహకారము మదించిన తుమ్మెదల బారున వంగి మునుపు న్నరవంత ధైర్యమును బోఁగొట్టెను. శివసంకుఁడు భుజించి కొంతభాగము హరించు టంజేసి నిశాకాంత చంద్రోదయమున వెలవెలఁబోవుచుఁ బలిని జాసిన పడఁతుక చందమున నానాటికి కృశించుచుండెను. చంద్రుఁడు మంచు లేక నిర్మలమునైన సురతశ్రీ మము హరింపఁజాలు చల్లని కిరణములచేత మన్మథుని విజృంభణమునకుఁ దోడ్పడె ను. మండుచున్న యగ్నివలె నుండు వనలక్ష్మికి జాజివానసెనగనై మొత్తనిరేకలు గలిగి యొప్పుసంపెంగపువ్వును ప్రియులు తగిలలో నిడ సకులానందమున ధరించి రి. కాటుకకణములవలె మనోజ్ఞములై యొప్పుతుమ్మెదలు పుష్పరాజపై వ్రాలి తిలక వృక్షములతో గూడిన వని తిలకము ధరించినదియు గనవలె నుండెను. తమ్మి పుప్పొళ్ళ ను ధరించిన మలయమారుతము చేతఁ గనలుచు కంపుగొల్పుచుఁ గోయిలలతో నొప్పారుచుఁ బు వ్వులబారున వంగిన యశోకవృక్షశాఖ విరహిణీస్త్రీలచిత్తముల నుత్తలపాటు నందఁ జేసెను. వసంతకాలమున నెఱ్ఱని చాయల నొప్పు నాకసములును గర్ణముల యం దాభరణములుగ నిడుకొన్న యహంకురములును మదనసైన్యములనదగినపికరవంబు లును వలపుకత్తెల రాగరసమున దేలికాండ్రను ముంచెను. ధనుర్ధరుఁడై వెడలి న తుంటవిలుకాని ధ్వజపటమో యువతులకు నెక్కి శోభాయమాన మగు ముఖచూర్ణ మో యనునట్లు గాలి నుద్యానవనములయందు బుప్పొళ్ళు లేచెను. వానివెంటఁ దు మ్మెదబారులు బయలుదేరెను. యూపసియంధ వసంతులు వసంతోత్సవ సమయ ములఁ బాగుగ నుయ్యాలల నూఁగఁ గడఁగిన బాలికలతలు ధన్యులఁ గావలించకొను టకై నుబలాటము పడుచు జడత్వము వహించి శాఖల నరిగిఁ బట్టుకొనజాలకపోవు టచే మనోరథసిద్ధి గాంచలేకపోయిరి. “ కోపము చాలింపుఁడు : వైరములు విడిచి బ్రతుకుఁడు ; ప్రాయము గడచెనా మరల రాదు: కావున సమస్త సుఖముల నను భవింపుఁడీ ” యనునట్లు మన్మథమంత్రము కోయిలలు మొరలగునవి చాట నినియో యనునట్లు జవ్వనులు సముచిత కేళివిలాసముల సలిపిరి. మధువిరోధి

యాగు విష్ణుని మన్మథుని వసంతుని బోలునట్టి దశరథమహారాజు హాయిగా మన్మథోత్సవ మనుభవించి పిమ్మట వేట కరుగఁదలఁచెను. వేట కదలుచున్న లక్ష్యముల నేయుటయందు నేర్పలవడఁజేయుననియు, మృగముల యలుక వెఱపు మున్నగు లక్షణములఁ దెలియఁ జేయుననియు, శరీరమున క్రొవ్వు మొదలగు వాని నుడగొట్టుననియు మంత్రు లొప్పుకొని పంప నారాజు వేట కరిగెను. మృగయాక్రీడ కనువైనవేషము ధరించి విల్లు మెడకుఁ దగిలించుకొని యారాజశేఖరుఁడు గుఱ్ఱపుడెక్కల తాకుడువలన లేచిన ధరణీపరాగంబు కలనడ మట్టి భూమ్యాకాశ మధ్యంబుల వ్యాపింప శిరసునందు వనమాల శోభిల్ల కవచము మోదుగాకులచాల నొప్ప తురగవల్గనంబుల చేత కుండలంబులు గదల నాప్రభువు వనవిహారము చేసెను. నన్నని తీగలయందు నెమ్మనుల నిమిషములమోదలయందు తమచూపుల నిలిపి వనదేవతలు కమలాయ తాక్షుఁడైన యానృపవరేణ్యుఁ గనుఁగొనిరి. వలలు వేఁటకుక్కలు మొదలగుపరి వారము గొని కాఱుచిచ్చులు మృగములునుండు తావులకు తోలంగ గుఱ్ఱముల ననుసరించి సింహశార్దూలగవయాదిమృగము లున్నయడవికి జనియెను. బంగారుకాంతుల నీను మెరుపుతీఁగ యను నారి గల యింద్రధనస్సును శ్రావణమాసము ధరించినట్టులు దశరథమహారాజు ధగధగలాడు కనకకార్ముకము ధరించి యెక్కుపెట్టెను. వేట కరిగిన యాతనికి ముందుగా లేళ్లమంద అగుపడెను. మందకు ముందుగా నల్లనిమగలేఁడి నడచుచుండెను. పొదుగులలో మూతులు పెట్టి పాలు త్రాగుచున్న పిల్లలు తల్లులఁ గదలనీయక పోయెను. తల్లిలేళ్లు ముందున్నదర్భలు కొరికి నోటనిడుకొనుచుఁ బిల్లలకుఁ బాలియ్యసాగెను. రాజు వేగముగల గుఱ్ఱము నెక్కి తూణీరమునుండి బాణము దీసి చేతఁ బట్టి యాలేళ్లమందయెదుట నిలువ నాజింకలు బెదరి చెదరి గాలి కెగిరిపోయిన నల్లకలువరేకులవలె తమ చూపుల నానాముఖములఁ బఱపెను. అతఁ డాకర్ణాంతము నారి లాగి వింట నమ్ముకూర్చిపెట్టి మగలేఁడిని జంపఁ దమకింప నాఁడులేఁడి ప్రేమాతిశయమునఁ బతికి రాజునకు నడుమ నిలిచెను. మహారసికుఁడగుటచేత రాజాదంపతులప్రేమ తెలిసికొని విల్లెక్కుపెట్టియుఁ గృష్ణమృగమును జంపక విడిచెను. తక్కిన జింకలం జంపఁ దలఁచినప్పుడు సయత్నము జడిసినవాని చూపులు తనప్రియురాండ్ర చూపులం దలపించుచున్నకతమున కనికరపు పట్టు సడలుచు వచ్చెను. అడవిపందులు బురదగుంటలు విడిచి నోటఁగడ్డి నేలరాలఁ బరుగెత్తుకొనిపోవ రాజు వానిని వెదకుచు బురదయడుగులజాడలు గల మార్గము ననుసరించి పోయెను. రాజు గుఱ్ఱముమీఁదఁ గూర్చుండి సగముశరీరము ముందుకు వంగి యడవిపందుల నేయుచుండ నవి చెట్లకుఁ జేరబడియుండి యచ్చోటనుండి సటలు విచ్చి రాజ

పై కుఱుక దమకించుచుండెను. అంతలో రాజు తీవ్రబాణముల నేసి వానిశరీరములు చెట్లు కంటుకొని పోవునట్లు చేసెను. అడవిదున్న యొకటి పొగరుకొని యతనిపైఁ బడ వచ్చుటయు నతఁడొకవాఁడియమ్ముఁ దీసి నేత్రరంధ్రమునఁ గొట్టెను. ఆబాణము రక్తము స్పృశింపకయె కాననమును జంపి తానును నేలఁ బడెను. ఖడ్గమృగములను జూచి ముందుగా కొమ్ములను నఱికి పిదపఁ గంఠములు ఖండించెను. దుష్టనిగ్రహ దీక్షితుఁడైన మహారాజు దుష్టమృగములయున్నను సహించి యూరకుండునా? సింహములకుఁ బ్రబలతేజము మృగరాజబిరుదము నుండుటచే దశరథమహారాజు వానిని సహింపక పొదలలో నిద్రించుచున్న సింగములను మేఘగర్జనములఁ బోలు ధనుష్టంకారములచేత లేపెను. ఏనుఁగులకు భయంకరశత్రువులగు సింగంబులం బూర్వము మున్నేనుఁగుల జంపుటవలన సింగములగోళ్ళలో దగుల్కొన్న కుంభస్థల మౌక్తికముల నేలఁదొల్లఁ జేసి తనకు యుద్ధమున సాయపడిన యేనుఁగుల ఋణము దీర్చెను. నెమిలి తనపింఛము విప్పి గుజ్జుము దగ్గఱ నాడుచున్నను కచబంధము వీడ వ్రేలాడుచున్న కురులు గలప్రియురాండ్రి సది తలపించుటచేత రాజు విల్లెత్తి దాని నేయఁజాలక పోయెను. కర్కశ విహారముచేత ముంగురులయందుఁ గ్రమ్మిన చెమటబొట్లపై వ్రాలివ్రాలి చివురుటాకులను విప్పి సుతుపు లల్లాడఁ గదిపి వచ్చిన చల్లనిగాలి యతని శరీరము స్పృశించి సుఖమిచ్చెను. ఇట్లు తక్కినకార్యములనెల్ల మఱచి రాజ్యభారము మంత్రులపై నిడి నెఱజాణయగు పడఁతుకకును లొంగినతెఱంగున రాజు వేఁటకు లొంగెను. అట్టివేఁటలో నొకనాఁడు సేవకుఁ డొకఁడును లేనిచోట జ్యోతిష్మతీలతలు దీపములుగఁ గెంజిగురుటాకులు పాన్పులుగ దశరథనృపాలశేఖరుఁడు రేయి గడపెను. అడవియేనుఁగుల చెవుల చప్పుడులు భేరీనాదములుగ శకుంతసంతతుల మనోహరకూజితములు వందిమాగధవైతాళికగానములుగ నాతని మేలుకొల్పెను. తనయనుచరులకుఁ గనఁబడకుండ నతఁడు లేచి యొకదానిని దఱుముకొని యది చన్నబాటనుబట్టి గమనాయాసముచేత గుఱ్ఱము నోటనుండి నురుగు వెడల మునిజనసేవ్యమైన తమసానదీతీరముం జేరెను. ఆనదిలో నొకకుఱ్ఱఁడు కడవముంచిన చప్పుడు కాఁగా నది యేనుఁగు ఘీంకారమనుకొని యాశబ్దమునుబట్టి యాచాయల నతఁ డొకతీవ్రబాణము నేసెను. రాజుల కష్టకార్యము నిషిద్ధమైనను ధర్మమార్గము నతిక్రమించి దశరథుఁ డాచెడ్డదారి తొక్కెను. ధర్మాత్ములు నయితము రజోగుణబద్ధులనపుడు చెడ్డత్రోవలయం దడుగిడుదురు కదా! ఆబాణ మతనిచేతినుండి వెడలఁగానె హా! తండ్రీ! యనునట్టి యార్తరవము రాజు చెవినిఁబడెను. పడగానె యతఁడు విభ్రాంతుఁడై యచ్చోటికిఁ జని పేపపొదచాటున బాణఘాతముచే బాధపడుచు ఘటము చేతఁబట్టుకొని పడి

యున్నమునికుమారుని గనియెను. అమ్మహాకులీనుఁడు గుఱ్ఱము డిగి యమ్మునికుమారుని సమీపించి కుల మేది యని యడిగెను. నేను ద్విజేతరుఁడ నని యామునికుమారుఁ డుత్తరముచెప్పెను. ఆమునికుమారునికోరికమీఁద శరముతో నుండఁగానె యతనిని కన్నులు లేనితల్లిదండ్రులకడకుఁ గొనిపోయి పొరపాటుచే దానొనర్చిన యాదుష్కార్యము వారి కెరిఁగించెను. ఆవార్త విని యావృద్ధదంపతు లెంతయు దుఃఖించి బాణ మూడఁదీయు మని రాజుని గోరిరి. అతఁడట్లు తీయ మునికుమారుఁడు మృతినొందెను. వృద్ధముని కన్నీరు చేతఁబట్టి "నావలెనె ముసలితనమందు నీవును గాఢమైనపుత్రశోకముచేత మృతినొందెదు" వని కాలితాఁకు తిన్నపాము విషము గ్రక్కినభంగిని శాపాక్షరముల విడిచెను. శపించుటయుఁ బధ్రమాపరాధియైనరా జిట్లనియె. "అయ్యా! పుత్రునిముఖారవింద మెట్టిదో యెఱుఁగని నాకు మీశాపము కుమారులు కలుగుదురుగాక యని యాశీర్వాదము చేసినట్లున్నది. పొలముతో నగ్నికట్టెలతో మండినను నది పంటకు కారణ మగునుగదా". నేను వధ్యుఁడను. నిషాదుండను. మీయాజ్ఞ యేమి యని రాజడుగ నాతనయునికడకే నేను పోయెదను. మాకగ్ని గూర్పు మని యావృద్ధమౌని పలికెను. మౌని యానతి సేయుమని సేవకులం బనిచి తన చేసినయకార్యంబును, తన కందువలనఁ గలిగినమహాపాతకమును శాపంబును దలంచుకొని దుఃఖించుచు బడబాగ్నితోఁ గూడినసముద్రమువలె మఱుగుచు రాజు రాజధానికిఁ జనియెను.

మహేంద్రవిభవుండైన యాదశరథమహారాజు సకలసంపదలు గలిగి యీవిధముగ మహీపాలనము సేయుచుండ నతని కప్పటికి పదివేలేండ్లు గడచెను.; కాని శోకాంధకారనివారణంబును పితృదేవతాఋణవిమోచనకారణంబును సకలసౌఖ్యసంధానకరంబును నగుసంతాన మతఁడు వడయఁడయ్యె.

అంతట సంతానకాముఁడైనదశరథనృపాలునకు సంతతి గలుగుటకొఱకై నిర్జితేంద్రియు లగుఋష్యశృంగాదిమహామునులు యాజ్ఞికులై యాతనిచేత యాగము చేయించిరి. మండువేసవియందలి చండాతపము సహింపలేక బాటసారి చల్లని నీడ నిచ్చుచెట్టు నాశ్రయించునట్లు దేవతలు రావణాసురునిబాధ కోడి హరిని శరణు జొచ్చిరి. క్షీరసాగరమునకు వారరిగినయాక్షణమందె యాదిపురుషుఁడైననారాయణుఁడు మేలుకాంచెను. వెంటనే దర్శన మగుట భావికార్యసిద్ధిసూచకముగ దాతి ఆదిశేషునిమీఁదఁ గూర్చుండి యతనిపడగలయందలి మణికాంతులచేత తనద్యుతి మెఱయుచుండఁ బ్రసన్నుఁడై యున్ననారాయణుని నిర్జరగణంబు దర్శించెను. పద్మాసనాసీనయై దువ్వలువకొంగున మెఱయుమొలనూలు గలిగి లక్ష్మీదేవికూర్చుండ

సానెుతొడలపై పాదములు చాచి యమ్మహావిష్ణువు పవ్వళించెను. ఉత్ఫుల్లపుండరీకనేత్రములవాఁడును బాలసూర్యప్రభను బోలుదువ్వలువ దాల్చినవాఁడును శరత్కాలదినమువలె రమణీయదర్శనుఁడైనవాఁడును లక్ష్మికి విలాసదర్పణ మయి జలధిసారమయి శ్రీవత్సముమీఁదఁ దనకాంతులు వ్యాపింపఁ జేయు కౌస్తుభమాణిక్యమును ధరించినవాఁడును, దివ్యాభరణభూషితములై శాఖలను బోలినబాహువులతోడ సముద్రమధ్యంబున జన్మించిన రెండవపారిజాతమువలె నున్నవాఁడును, దానవస్త్రీలకపోలములయందలి మకరికాదిపత్త్రికల సౌందర్యమును హరించు జీవవంతములై నెఱయు నందకసుదర్శనాద్యాయుధములచేత ఘోషింపఁబడుచున్న జయములుగలవాఁడును, వజ్రాయుధవ్రణచిహ్నము గలిగి పాములతో బగవిడిచి వినీతుఁడై చేతులు జోడించుకొని ప్రక్కను నిలిచినగరుత్మంతుని పైఁగటాక్షవీక్షణములఁ బ్రసరించువాఁడును, సౌఖ్యశాయనికులై పార్శ్వముల నిలిచి యున్నభృగువు మొదలగు మహర్షులను యోగసిద్ధాంతనిర్మలములై పావనములైననిరీక్షణముల ననుగ్రహించుచున్నవాఁడును, నగుజగద్వల్లభునకు నారాయణునకు వంద్యునకు దైత్యభంజనునకు నవాఙ్మానసగోచరునకు నమస్కరించి వేల్పులిట్లు పొగడిరి. మొట్టమొదట విశ్వము సృజయించి పిమ్మట విశ్వము పోషించి యనంతము విశ్వము నాశనము జేయుచు ముత్తెఱంగులనుండుమహాత్మునకు నీకు నమస్కారము. ఆకాశమునుండి పడినజలము మొదట నొక్కటియై [illegible] దేశభేదంబుల బ్రవహించినపిదపఁ [illegible] మారునట్లు నీవు సహజముగ నిర్వికారుఁడ వయ్యు త్రిగుణభేదముచేత నీవు మారుచుందువు. స్ఫటికము తెల్లనిదయ్యు నానావర్ణములవస్తువులయెదుట బడినప్పుడాయారంగులను దాల్చినట్లు నిర్వికారుఁడవయ్యు ననేకోపాధుల నాశ్రయించి యనేకరూపములఁ గనఁబడుచుందువు. నీవు కొలతకు దొరకవు. విశ్వములను కొలవఁగలవు నీవు కోరికలు లేనివాఁడవయ్యు నెల్లరకోరికలఁ దీర్పఁగలవు. నీవజేయుఁడవు. ఎల్లయెడల నీకు జయ మగును. అవ్యక్తుఁడ వయ్యు వ్యక్తకారణుఁడవు. హృదయస్థుడవైనను దూరస్థుఁడవంచును గోరికలు లేనిమహాతపస్వివంచును పరమదయాళుఁడవంచును పాపరహితుఁడవంచును ముసలితనములేనిపురాణపురుషుఁడ వంచునునిన్నుప్రాజ్ఞులునుతింతురు. నీవు సర్వజ్ఞుడవు. నిన్నెవరెఱుఁగరు. సమస్తమునకునీవె కారణము. నీకునునీవెకారణము. నీకొకప్రభువులేఁడు. నీవందఱకుప్రభుఁడవు. నీవొకఁడవె కాని యన్నిరూపుల నీవుందువు. సప్తసామంబులు నిన్ను సంస్తుతించు. సప్తసాగరజలంబు నీకు శయనంబు. సప్తజిహ్వుఁడు నీకు ముఖము. నీవు సప్తలోకాశ్రయుఁడవు. చతుర్వర్గఫల మయినజ్ఞానము, చతుర్యుగములయందు వ్యాపిం

చినకాలము, చతుర్వర్ణసమేత మయినలోకము చతుర్ముఖుఁడవైన నీవలననె కలుగుచున్నవి. హృదయస్థుఁడవైన నిన్ను యోగులు ముక్తినిమిత్తమయి చిరతరాభ్యాసమున నిగ్రహింపఁబడినమనస్సుచేత ధ్యానించుచుందురు. నీవజుఁడవయ్యు జన్మము నెత్తుచుందువు. కోర్కులు లేనివాఁడవయ్యు శత్రువులం జంపుచుందువు. నిద్రించుచుండియు జాగరూకుఁడవగుదువు. ఇట్టి నీవిచిత్రపరిభావముల నెవ్వఁడెఱుంగును? శబ్దాదివిషయముల ననుభవించుటకును దుస్తర మగుతపము జేయుటకును. ప్రజల బ్రోచుటకును. నుదాసీనభావము దాల్చుటకును నీవె సమర్థుడవు. పురుషార్థసిద్ధిహేతువులైన మార్గములు శాస్త్రములయందు భిన్నభిన్నములుగఁ గన్పడుచుండియు నెట్టకేలకు నీయందె యైక్యమగుదురు. గంగాప్రవాహములు భిన్నభిన్నములుగఁ బ్రవహించుచున్నను గొట్టకొనకు సముద్రమున జేరుచున్నవి కదా! సమస్తకర్మలు నీకర్పించి చిత్తమును నీయందే యుంచి వీతరాగులైయుండు యోగులముక్తికి నీవే గతివి. పృథివి మొదలగు పంచభూతములయందు నీమహిమ ప్రత్యక్షమయి కనబడుచున్నను వాచామగోచరమయియున్నది. అట్టి నీపరిభావ మింక ననుమానాది ప్రమాణములచే వేదములచే నెట్లు వర్ణింపగలవు. నీనామము స్మరించినంతమాత్రమున నెవ్వనినైనను నీవు పావనము చేయుచున్నావు, ఇంక నీదర్శనమే యైనపక్షమున నట్టిఫలములు చేకూరునో దీనిం బట్టి యూహింపఁగొనవచ్చును. జలధియందలిరత్నరాశియు భానుమండలమందలి కిరణజాలమును లెక్కించుట కష్టతరము గాదో యట్లే నీపరిభావమును వాఙ్మానసగోచరంబు. నీవు పొందనిదియుఁ బొందఁదగినదియు విశ్వమున నేదియు లేదు. నీవు లోకమునఁ బుట్టి జన్మకర్మలకు లోనగుట లోకము ననుగ్రహించుటకె యనుమా, దేవా! తారక పరిభావిశేషంబును. కొంతవఱకు నుతించి యూరకుండుట మాయాయాసము చేతను నశక్తముచేతను గాని నీగుణములను సంపూర్ణముగ గొనియాడగలుగుటచేఁ గాదు. ఈప్రకారంబునఁ బరమేశ్వరుని గొనియాడి దేవతలతనిని బ్రసన్నునిఁ జేసికొనిరి. కాని యావాక్యము లాపరమేష్ఠియొక్క నైజగుణములె కాని నుతులుకావు.

అంతట నారాయణుఁడు కుశలప్రశ్న మడిగి సురల నాదరించె వారు రాక్షససముద్రము ప్రళయమందక పొంగి పొరలి జగంబును ముంచుచున్నవార్త లాహరి కెఱింగించిరి. అదివిని కరుణాసాగరుఁ డగునాహరి సముద్రతీరశైలగుహలో నుండి బయలువెడలు ప్రతిధ్వని ననుసరించుచు సముద్రఘోషముఁ దిరస్కరించు గంభీరమైన స్వనముతో నిట్లనియె. ఆపురాణ కవీంద్రుని యందుండి తగినవర్ణస్థానముల బొంది యుచితసంస్కారముల బొంది వెడలిన

కతమున భారతి కృతార్థురాలైన దని తోఁచెను. దంతకాంతి యనుచంద్రికతోడ వెలయుచున్నయావాక్పూరము నారాయణునిచరణంబులం బ్రవహించినగంగ యూర్ధ్వముఖముగఁ బ్రవహించుచున్నదో యన్నటుల నలరెను. “ఓయమరులారా నరునియందుఁబుట్టినసత్త్వరజోగుణములకుఁ దమోగుణ మడంచినటులమీభావములఁ బెల్లు రాక్షసు లడంచి రనినే నెఱుంగుదును. తెలియక చేసినపాపఁబువలన సజ్జనుని మనంబు తప్తమౌకరణి రాక్షసులచేత జగత్త్రయంబు తప్త మగుచున్నదని నే నెఱుంగుదును. నేనును మహేంద్రుండును నేకకార్యపరుల మైయుండ వజ్రి నన్ను వేరే యికార్యమున వేఁడవలయునా. అగ్ని ప్రార్థింపకయె వాయువు సాయపడఁడా? ఆదనుజనాథుఁడు మున్ను తనతలలు తొమ్మిదింటి నగ్నికి సమర్పించి పదియవతల నాచక్రాయుధంబున కెఱ జేయుటకె దాచి యున్నాఁడు. తొల్లి బ్రహ్మదేవుఁ డిచ్చినవరంబులంబట్టి యాదురాత్మునియౌన్నత్య మింతవఱకు మంచిగంధపుచెట్టు సర్పవృద్ధిని సహించినటుల సహించితిని. ధాత యతనితపఁబునకు సంతుష్టుడై వరములు వేఁడు మన నద్దనుజుఁడు “మనుష్యులను నేను లెక్క సేయను. దేవతలు చేతఁగూడ నాకు చావు లేకుండ వర మీయవలసిన”దని కోరెను. నేను దశరథరాజనందనుడనై పుట్టి యుద్ధరంగమున కాతనితలలు తామరపువ్వుల నర్పించినవిధమున బలిగా నర్పించెద. అచిరకాలంబుననె మీరు యాగములయందు విధివిధానముగ వేల్వఁబడునట్టియు మాయదైత్యులు స్పృశింపనట్టియుహవిర్భాగముల నెప్పటియట్ల భుజింప గలరు. ఈవరకు మీరు విమానముల నెక్కి నిర్భయముగఁ దిరుగలేక మేఘములమాటున నొదిగి యొదిగి తిరుగుచున్నారు; ఇఁక మీఁద రావణుని విమానమగు పుష్పకమును జూచి చిత్తక్షోభము బొందనక్కఱలేదు.

రావణాగ్రహముచేత వాఁడిపోయినయమరసస్యముమీఁద వాక్యామృతమీవిధముగాఁ గురిసి కృష్ణమేఘ మంతర్ధాన మొందెను. దేవకార్యము నిర్వర్తింపనుద్యుక్తుడైనయావిష్ణుదేవుని మహేంద్రాదిదేవతలు, వృక్షములు పువ్వులచేత వాయువు ననుసరించినటుల దమతమయంశములచేత ననుసరించిరి. అంతట దశరథమహారాజు పుత్రకామేష్టిచేయఁగా యాగముయొక్కయంతమందు ఋత్విజు లాశ్చర్యము నొంద నగ్నియందు దివ్యపురుషుఁ డొక్కఁడుద్భవించెను. ఆపురుషుని చేతిలో నొకకనకపాత్రి యుండెను. ఆపాత్రిలో దివ్యపాయస ముండెను. ఆదినారాయణుఁడు పాయసరూపమున నాపాత్రిలోఁ బ్రవేశించి యుండుటంజేసి యాపాత్రి మిక్కిలిబరువైనందున నాదివ్యపురుషుఁ డతికష్టముతో దానిని మోసెను. ప్రాజాపత్యపురుషుఁడు తెచ్చినయాపాయసమును దేవవల్లభుఁడు క్షీరసాగరసారమయిన యమృతమును గ్రహించినటుల దశరథుఁడు

సంతోషమున గ్రహించెను. జగత్త్రయైకవిభుఁ డైననారాయణుం డారాజుకడుపునఁ గొడుకయి పుట్టఁదలంచినందున నతనివంటిధన్యులు జగంబున లేరని సర్వజనులు కొనియాడిరి. సూర్యుఁడు లేఁతయెండను భూమ్యాకాశంబులకుఁ బంచియిచ్చినట్లు పాయస మనువురూపు దాల్చినయావిష్ణుతేజమును రాజు భార్యల కిద్దఱకు సమముగఁ బంచెను. ఆరాజునకుఁ బట్టఁపుదేవియైన కౌసల్యయందు మిక్కిలి గౌరవము. కైకయురాజపుత్రికయందు మిక్కిలి ప్రేమ. అందుచేత వారి కిద్దఱకుఁ బాయసము సరిసగము నిచ్చి వారిభాగములలోనుండి సుమిత్రకుఁ గొంతపాయస మిమ్మని రాజు వారిరువురం గోరెను. పతేంగితజ్ఞానము గలభర్త యొక్క యిచ్ఛాప్రకార మాదేవు లిరువురు నిర్విచారముగఁ దమతమభాగములలో సగముదీసి సుమిత్రకిచ్చిరి. మదపుటేనుఁగుయొక్క గండస్థలద్వయమునుండి స్రవించు మదమును దుమ్మెద సమముగాఁ జూచునట్లు దనయందలి గాఢానురాగముచేత బాయసము పంచియిచ్చిన యిద్దరు సవతులమీఁద సుమిత్ర సమానప్రేమ గలిగియుండెను. అమృతమయములైన సూర్యకిరణములు జలమయమయిన గర్భమును ధరించునట్లు దశరథుని మహిషులు ప్రజలపాలుకొఱకు దేవాంశసంభవ మయినగర్భమును ధరించిరి. రాణు లొక్కమారుగ గర్భములుదాల్చి తెల్లవారినమేనులు గల్గి లోనపంటగల్గియుండు సస్యసంపదలవలె విరాజిల్లిరి. శంఖచక్రగదాఖడ్గప్రముఖములయిన యాయుధములు చేతఁబట్టికొని వామనులు తమ్ము సంరక్షించునట్లు దేవులు ముగ్గురుఁ దఱచుగా స్వప్నములు గాంచఁజొచ్చిరి. తనబంగారుఱెక్కలకాంతి నింగి నెల్లడ నలముకొనఁ దనమహావేగమునకు గదలి మేఘములు వెంట రాఁగ గరుత్మంతుఁడు తమ్ముముగ్గుర వీపుమీఁద నెక్కించుకొని యంతరిక్షమున బోవుచున్నట్లు వారు కలలు గాంచిరి. వల్లభుఁడైన నారాయణుఁడు తన కిచ్చిన కౌస్తుభమణి వక్షస్థలమున వ్రేలుచుండఁ దామరపువ్వువీవన విసరుచు లక్ష్మి తమ కుపచారము జేసినట్లుఁగూడ వారు కలలు గనిరి. ఆకాశగంగలో స్నానము చేసి వేదపాఠములు సేయుచు సప్తమహర్షులు వచ్చి తమ్ముఁ బూజించునట్లుఁగూడ వారు స్వప్నములు గాంచిరి. ఆస్వప్నవృత్తాంతములను భార్యలు వినిపింప విని మహారాజు మిక్కిలి సంతోషించి జగదేకగురుఁడైన జనార్దనునకుఁ దాను దండ్రియగుటయెఱిఁగి తన్ను ధన్యునిగ నెంచుకొనెను. చంద్రుఁ డొక్కఁడయ్యు నిర్మలములగు జలములందు వేర్వేఱు రూపములు దాల్చి యుండునట్లు మహావిష్ణు వొక్కఁడయ్యు వారి గర్భములయందనేకరూపములు దాల్చియుండెను. అంతటదశరథమహారాజుయొక్క యగ్రమహిషియైన కౌసల్య జ్యోతిర్మయ మయినయోషధిని రాత్రి గాంచినవిధమున శోక మడంచునట్టికుమారునిగనెను. మిక్కిలి యభిరామమయిన శరీరముగలుగుట

చేతను జగంబునకుఁ బ్రథమమంగళకారణ మయినరామనామధేయ మాకుమారునకుఁ దండ్రి యిడెను. అప్రతిమతేజోరాశియయి రఘువంశప్రదీపమయిన యాకుమారుని కాంతిముందర శయ్యాగృహమందలిదీపము లన్నియు మందతేజములై యుండెను. రాముఁడు జనించి శయ్యపై నుండుటచేత సన్నని యుదరంబు గలదై కౌశల్యా మహాదేవి సైకతాంభోజబలిచేత నొప్పుశరత్కాలగంగ వలె నుండెను. కైకేయికిఁ బుట్టిన కుమారుఁడు శీలవంతుఁడై భరతుండను నామము బడసెను. ఐశ్వర్యమును వినయమలంకరించినటు లాకుమారుఁడు తల్లి నలంకరించెను. సుమిత్ర లక్ష్మణశత్రుఘ్నులను కవలబిడ్డలను లెస్సగా నభ్యసింపఁబడినశాస్త్రవిద్య జ్ఞానవినయంబులను గన్నట్లు గనియెను. భూమిమీఁద నవతరించిన పురుషోత్తముని వెంట స్వర్గమంతయు వచ్చినట్లు సకలసద్గుణములఁ గాంచి జగతి దోషరహితమయి వెలయుచుండెను. నాల్గుమూర్తులతో నారాయణుండు భువి నవతరించుటం జేసి ధూళి లేకుండ గాలి విసరె. దశముఖునికి జడిసిన దశదిశలు నిర్భయముగా నూపిరివిడిచినట్లుండెను. అగ్ని పొగ లేక వెలుంగుటచేతను శుద్ధకిరణుఁడై సూర్యుఁడు ప్రకాశించుటచేతను రావణునిచేత బాధింపబడిన జగంబంతయు శోకమును విడిచి సుఖించునట్లుండెను. ఆసమయంబున రావణునికిరీటంబునుండి రత్నములు నేలరాలెను. అవి రాక్షసరాజ్యలక్ష్మి విడిచిన కన్నీటిబొట్లోయను నట్లుండెను. దశరథమహారాజునకు నందనోదయ మయ్యె నని పుత్రోత్సవసూచకముగ మొట్టమొదట మొఱసినవి దేవదుందుభులె. దశరథునకు సంతానముగలిగినందుకు వానిమందిరమున సంతానవృక్షములు జలజల పుష్పాలవాన గురిసి పుత్రోత్స జేయు కార్యములలో నదియె మొదటిదయ్యెను. జాతకర్మ మొదలయిన సంస్కారములుగలిగి దాసులయొద్దఁ బాల ద్రావుచు శిశువులు నలువురు జనకునకు మహానందజనకులయి వర్ధిల్లిరి. అగ్నికి సహజమయినకాంతి హవ్యముచేత మరింత వృద్ధియైనట్లు కుమారచతుష్టయమునకు సహజమయిన వినయము విద్యచే నత్యధిక మయి విరాజిల్లెను. అన్యోన్యమైత్రి కలిగి వర్ధిల్లినట్టి యాకుమారులు ఋతువులు నందనవనమునకు వన్నె దెచ్చినట్లు రఘువంశమునకు వన్నె దెచ్చిరి. సౌభ్రాత్రము సమాన మయినను స్నేహాతిశయమున రామలక్ష్మణులు లొకజతగాను భరతశత్రుఘ్నులొకజతగాను గూడి మెలఁగుచుండిరి. అగ్నికి వాయువునకును, చంద్రునకును సముద్రునకును, మైత్రి విడనితెఱంగున నారెండు జంటలకును భేద మెన్నఁడు లేకపోయెను. గ్రీష్మకాలాంతమందుఁ గారుమబ్బులు గార్కొన్న దినములు జనులకు సుఖము గలుగఁజేయునట్లు వినయతేజస్సంపన్ను లయిన యాకుమారులు ప్రజల కమితానందము గల్గించిరి. చతుర్విధముగా యున్న యానరపాలుని సంతానము ధర్మార్థకామమోక్షము లనియెడు చతుర్విధపురుషార్థము లవతరించినటు లుండెను. నేల నాలుగుచెఱగు లేలుచున్న

యామహారాజును నాలుగుసముద్రములు రత్నములచేతఁ బూజించినట్టుల పితృవత్సలు లైన నలుగురుకుమారులు గుణములచేత నర్చించిరి. దశరథమహారాజు శత్రువులనెల్ల బరాజయము నొందించి నలుగురు కుమాళ్ళు గలిసి సుఖించుచుండెను.

అంతట విశ్వామిత్రుఁ డొక్కనాఁడు దశరథునికడకుఁ బోయి యజ్ఞసంరక్షణార్థము కాకపక్షధరుఁ డైన రాముని బంపవలసిన దని యాచించెను. పరాక్రమవంతులవిషయమున వయస్సు చూడఁగూడదా. నిరంతరసజ్జనసేవ చేయు నారాజు మునినిమిత్తము లక్ష్మణసమేతముగ రాముని బంపెను. రఘువంశపురాజులు యాచించెడు వారికిఁ బ్రాణముల నైనను దాఁచక యిత్తురుగదా! రామలక్ష్మణుల నిర్గమనము కొఱకు పురవీథు లన్నియు నలంకరింపవలసినదని మహారాజు శాసించెను. పురజను లలంకార మారంభింపక మున్నె మేఘములు వాయుసహాయముం గాంచి పుష్పవర్షములు గురిసి రాజాజ్ఞ నెల్లించెను. ధనువులు ధరించి యాకుమారు లిద్దఱు తండ్రియాజ్ఞ నెఱవేర్పఁ దలఁచి యాతని యడుగులకు మ్రొక్కిరి. ఆరాజును మ్రొక్కుచున్నవారిమీఁద బాష్పములు విడిచెను. జనకుని బాష్పబిందువులచేఁ దడిసినకూఁకటులతో హస్తముల నొప్పారువిండ్లతో రామలక్ష్మణులు మునివెంటఁ జనుచుండఁ బురవీథులయందుఁ బౌరజనులదృష్టులు తోరణమాలికలై యుండెను. లక్ష్మణసమేతుఁడైనరాముని పంపింపవసిన దని కౌశికుఁడు యాచించినందున దశరథుఁడు కుమారులతోఁగూడ సైన్యము నంపక వారిని సంరక్షించుటకుఁ దనదీవనయే చాలు నని యాశీర్వదించి పంపెను. విశ్వామిత్రుఁడు వారిం దోడ్కొనిచని మార్గమధ్యమందు బలాతిబలము లనువిద్యల నుపదేశించెను. ఆవిద్యలప్రభావముచేత నాబాలకులు మార్గ యానముం జెందక తమతల్లులకడ నున్నటుల సుఖముగ నుండిరి. చిన్ననాటనుండియు వాహనము లెక్కి తిరుగుట కలవడిన యానృపకుమారులు కాలినడక నరుగుచున్నను దమ పితృసఖుఁడైన విశ్వామిత్రుఁడు చెప్పుచుండు పూర్వగాథల వినుచుండుటంజేత వారి కాయాసమే కనపడలేదు. సరోవరములు మంచినీళ్ళచేతను, విహంగములు మధురకూజితములచేతను, వాయువులు సుగంధపుష్పసంతతులచేతను, మేఘములు నీడలచేతను, దశరథపుత్రులను సేవించెను. తామరపువ్వులతోఁ గూడిన కొలంకుల వలనఁగాని నీడనిచ్చి శ్రమ నడంచువృక్షములవలనం గాని రామలక్ష్మణుల దర్శనము వల్లఁ గలిగినంత సుఖమును మహామునులు గాంచరైరి. ఫాలనేత్రునిచేత మదనుఁడు దగ్ధుఁ డైనయాయాశ్రమంబు మార్గమధ్యమం దుండుటం జేసి దానిం జొచ్చి రాముఁడు కార్ముకధరుఁడై యచ్చట నుండ, వికృతిచేష్టలచేతఁ గాక యాకారముచేత నతఁడు

సాక్షాన్మన్మథుఁడువలె నుండెను. తాపోపహతురా లైనసుకేతునందన తాటక వనమునెల్ల నాశనముచేసిన దని గాధేయునివలన విని ధనుష్కోటుల నేలమీఁద నిలిపి రాజపుత్రులు విండ్లెక్కువెట్టిరి. ఆధనుష్టంకారములు విని కపాలకుండలములు చెవుల వ్రేలాడ కృష్ణపక్షరాత్రులవలె నల్లనిచాయ గలిగి కొంగలతోఁగూడిన మేఘమువలె తాటకి వచ్చెను. తమగమనవేగముచేత మార్గమందలివృక్షములు పెల్లగిలఁగ శవములమీఁదిగుడ్డపేలికలు మేనధరించి పెద్దపెట్టున నఱచుచు శ్మశానభూమి మీఁద నిలుచు గాలివలె విజృంభించి యారాక్షసి రామునిమీఁదఁ బడెను. కట్టెవలె నెత్తియున్నభుజముగలిగి పేవు లొడ్డాణముగా ధరించి యున్నయారాక్షసాంగన మీఁద రాముఁడు దయను బాణమునుగూడ విడిచెను. ఆరామబాణమువలనరాతివంటి తాటకదేహమునందుఁ బడినరంధ్రము రాక్షసవంశములో నంతవఱకుఁ బ్రవేశింపఁ జాలని యమునకు ద్వారమయ్యెను. రామబాణభిన్న యయి యారక్కసి నేలం గూల దాని యడవిమాత్రమేగాక జగత్త్రయంబుఁగాల్చి వెలయుచున్నదశాననుని యైశ్వర్యముగూడ గంపించెను. రాముఁడనియెడు మన్మథునిబాణపుదెబ్బ హృదయమున నాట తాటక రక్త మనియెడుగంధము మేన నలఁదుకొని ప్రాణనాథుని సమక్షము జేరెను. మగటిమికి మెచ్చి విశ్వామిత్రుఁడతనికి దైత్యులను జంపునస్త్రముపదేశించెను. సూర్యకాంతము కట్టెలనుగాల్చుతేజమును సూర్యునివలననే గ్రహించును గదా! అనంతరము వామనాశ్రమవృత్తాంతము మునివలన విని రాఘవుఁడు తదాశ్రమము చేరి పూర్వజన్మవృత్తాంతమును. స్మరియింపఁ జాలకపోయినను మిక్కిలి యుత్సాహము గలిగి యక్కడ వసించెను.

అంతట మునివరుఁడు రాఘవులతోఁ దనయాశ్రమము జొచ్చెను. ఆతపోవనము దేవతార్చనకై శిష్యులు సిద్ధముచేసినపుష్పములతోఁ బల్లవాంజలులు సమర్పించుచున్నమహీరుహములతో మెడ లెత్తిచూచుచున్న లేళ్ళతో నెంతోసొగసుగా నుండెను. అనంతరము విశ్వామిత్రుఁడు యజ్ఞదీక్షవహింప సూర్యచంద్రులుదయించి కిరణములచేత నంధకారమునుండి జగమును గాపాడినట్లు దశరథనందనులు బాణములచేత మఖమును రక్షింపఁబూనిరి. యజ్ఞవేదికమీఁద మంకెనపువ్వులంతనెత్తురుబొట్లు రాక్షసమాయచేఁబడెను. అవి జూచి ఋత్విజులు మిక్కిలి భయపడి తమతమకర్మలు మానికొని కూర్చుండిరి. అంతట రాముఁడు తనయమ్ములపొదినుండి యొకతీవ్రబాణంబుఁ దీసి వింటఁదొడిగి తలయెత్తి పయికిఁ జూచెను. చూచునప్పటికి నభంబుపై రాక్షససైన్యము గనఁబడెను ఆసేనయొక్క పెక్కు

ములు గ్రద్దలకొక్కులగాలికిఁ గదలుచుండెను. అప్పుడు రాముఁడు మ్రుక్కడిరక్కసులను విడిచి యజ్ఞవిఘ్నకారులలో ముఖ్యనాయకు లగుదైత్యులమీఁద నమ్ముల నేసెను. మహాభుజంగములమీఁద కుటుకునట్టి గరుత్మంతుఁడు నీటికట్టెల జోలికిఁ బోవునా? అస్త్రకోవిదుఁ డైనరాముఁడప్పుడు వింట వాయవ్యాస్త్రముం దొడిగి వైచెను. అది దగిలి తాటకాతనయుఁడు కొండంత బరువుండియు నొకపండుటాకువలె నేలం గూలెను. అనంతరము మాయచే నిట్టటుఁ దిరుగుచున్నసుబాహుని వనిమొదు మఱియొక దైత్యుని దుత్తునియలుగా ఖండించి యాశ్రమంబున కావలఁ బడవైచి పులుఁగులకు విందు జేసెను. విఘ్నము లేకుండ యథావిధిగ యజ్ఞము చేయించిన యారాజసుతులను మునికులపతి యగువిశ్వామిత్రుఁడును ఋత్విజులును గొనియాడి యానందించిరి. కాకపక్షములు గదలునట్లుగా రామలక్ష్మణులు మునికి నమస్కరింప నతఁడు మహానంద మొందియవభృథస్నానములచేతఁ దడిసినవారిశిరస్సులను దనచేత నిమిరి దీవించెను అప్పుడు విదేహరాజైనజనకుఁ డొకయాగము సేయఁ దలపెట్టి దానికి విశ్వామిత్రునిరమ్మని ప్రార్థించెను. జనకునియింటనున్న శివధనుస్సుం జూడ రాఘవులు కుతూహలపడుచుండుటం జేసి గాధేయుఁ డాజన్నమునకు వారిఁదనవెంటఁ దోడ్కొనిపోయెను. అంతట వారు మునితోఁ బయనమై నడచి సాయంకాల మగు నప్పటికి గౌతమధర్మపత్నియైన యహల్య యేయాశ్రమంబున క్షణకాల మింద్రుని భార్య యయ్యెనో యాయాశ్రమంబుం జేరి యాచెట్లనీడల వసియించిరి. చిరకాలము నుండి శిలారూపముం గైకొని పడియున్న యాగౌతమపత్ని రామపాదరజము సోఁకి నంతమాత్రమున శాపమోక్షము గాంచిమనోహరమైనయాకారము దాల్చియుం డెను. రామలక్ష్మణసహితుఁడై కౌశికుఁడు తన యింటి కేతెంచినాఁడని విని జనక మహారాజు భక్తిమెఱయ నర్థకామములతోఁ గూడినధర్మముయొక్క యవతారమో యనునటుల మెఱయుచున్నవిశ్వామిత్రున కర్ఘ్యపాద్యముల నిచ్చెను. విదేహపుర వాసు లయినజనులు గగనమునుండి దిగివచ్చిన పునర్వసునక్షత్రములువలె మెఱయు చున్న యారాఘవులను దనివిననకుండఁ జూచి రెప్పపాటులు తమచూడ్కికి నడుమ నంతరాయము గలిగించుచున్నవని విసిగికొనుచు నానందించిరి. జనకునియాగము సమాప్తమగుటయు విశ్వామిత్రుఁడు శివధనస్సును జూడ రాముఁడుబలాటపడు చున్నాఁడని యామహారాజుతోఁ జెప్పెను. మిక్కిలి సుకుమారమగురూపముగల యారఘునందనుం జూచి మేటి విలుకాండ్రకైన నెక్కిడ నలవి కాని యావిల్లుం దలవంచి యది యెక్కిడినవానికే తనకూఁతు నిచ్చెదనని ప్రతిజ్ఞ చేసినందున జనకుఁ డింతయు మనఃపీడఁగాంచెను. ఓమునీంద్రా! మదపుటేనుఁగుల కైనను సాధ్యము

కాని మహాకార్యము పిల్లయేనుఁగు సేయఁ గడఁగుట హాస్యాస్పదము. కావున నీశైవ ధనువు స్పృశించుటకు నేను సమ్మతింపను. మహాధనుర్ధరు లగురాజు లెందఱో యీది వటిలో వచ్చి యీధనువును స్పృశించి భగ్నమనోరథు లయి సిగ్గుపడిపోయిరి." అని జనకుఁడు కౌశికునితో ననెను. ఆపలుకువినిమహర్షి యారాజున కిట్లనెను. "రాజా! యీకుమారుఁడు మహాబలుఁడు వజ్రాయుధము మహాపర్వతముల గూల్చి నటుల వీని మహాబలము నీచాపమును భంగము సేయును.', అని యాపూజ్యుఁడైనముని పలుకుటయు మిణుఁగురుపురుగంత యగ్నికణములో నత్యంతమైన దాహశక్తి యిమిడి యున్నటుల కాకపక్షధరుఁడైనరాఘవునియం దుగ్రతేజము లీనమై యున్న దని జనకుఁడు తలంచి మహేంద్రుఁడు మెఱుపును దెమ్మని మేఘముల నంపినటుల శివ కార్ముకముం దెమ్మని తన పరిచారకులను గుంపులు గుంపులుగాఁ బంపెను. జీర్ణ రూపముఁ దాల్చి పాఱిపోయిన యజ్ఞము మీఁద నీవింటినుండి పరమేశ్వరుఁడు బాణ ములు విడిచెనో, నిద్రించుచున్న పామువలె నెయ్యది భయంకరమై యున్నదో యట్టి హరధనువును జూచి రాముఁడు గ్రహించెను. కొలువులో నున్నవారందఱు ఱెప్పవాల్పక తన్నుఁ జూడ రాజకుమారుఁడు మీనకేతనుఁడు పుష్పధను వెక్కిడి నటు లవలీలఁగా మహాశైల్యమటు లున్న యావింటను నారి సంధించెను. అవ్వల రాముఁడు గట్టిగ నారిలాగ ధనువు మేఘముగర్జించునటుల పెళపెళరవముతో విఱిగి పోయెను. క్షత్రియులకు బద్ధశత్రుఁడైన పరశురామునకు మఱియొక క్షత్రతేజము ప్రపంచములో జన్మించిన దని ఘోషించినవిధమున నాధ్వని యొప్పెను. ఉదగ్ర కార్ముకమునందు రామునిభుజసారము దెలిసికొని మిథిలారాజు రూపవతియు నయోని సంభవము నగుదనకూఁతును సీతను శౌర్యశుల్కము గ్రహించి యగ్నియెదుటవలెనె మహర్షియెదుట నర్పించెను. నిమికులప్రభూతయైనసీతను మీకుమారునకుఁ జేసి కొండని వేడుచు జనకుఁడు దశరథునికడకుఁ దనపురోహితుని వినయపూర్వక ముగాఁ బంపెను. దశరథుఁ డంతకుమున్నె తగినకోడలుకొఱకు వెదకుచుండెను. అట్టిసమయమునందె జనకపురోహితుఁ డాతనికడకుఁ బోయెను. ధన్యులయినవారు తలఁచుకొన్నంతమాత్రము చేతనే కల్పవృక్షఫలములువలెఁ గామితార్థములు సిద్ధించు చుండును. ఆపురోహితునివాక్యముల కానందమొంది దశరథుఁడు తనసైన్యములు తరలన రేగినదుమ్ము భూమండలిఁ గప్పఁ బయనమై పోయెను కతిపయదినంబుల కతఁడు మిథిలాపురముఁ జేరి దానిచుట్టును విడిసెను. సైన్యములు చెలరేగి తోటలలోనిచెట్లు పాడుచేసెను. అప్పుడు పడుచుపడతి భర్తయొక్క విపరీతచేష్టలకలుగక యోర్చినటులు పురలక్ష్మి యాసైనికులదుండగముల కెల్ల సహించెను. ఎల్లసాంప్రదాయము

లెత్తఁగిన యామహారాజు లిద్దరును వరుణవాసవు లటులు భాసిల్లుచుఁ బుత్రపుత్రికా వివాహములను మహావైభవముతోఁ జేసిరి. రాముఁడు సీతను వివాహమాడెను. ఆమె చెల్లెలను లక్ష్మణుఁడు స్వీకరించెను. జనకునిసోదరుఁడగు కుశధ్వజునిపుత్రిక లిద్దఱను భరతశత్రుఘ్నులు వివాహమాడిరి. క్రొత్తపెండ్లికూఁతులంగూడిన యానలుగురు కుమారులు ఫలవంతలై సామదానభేదదండము లనియెడుపేళ్ళంబరఁగెడుదశరథుని చతురుపాయంబులపగిదిం దనర్చిరి.

ఆరాజకుమారులును రాచకన్నెలును బరస్పరసమాగముచేత ధన్యులై ప్రకృతిప్రత్యయములట్లు వెలసిరి. ఇట్లు నల్వురుకుమారుల పెండ్లిండ్లు చేసి దశరథుఁడు జనకుని వీడ్కొని యయోధ్యకుఁ బయనమై పోయెను. అత్తరి జంఝామారుతము బయలుదేరి మార్గముననున్నచెట్లనుగూల్చి గట్టు తెగఁగొట్టికొని వట్టినేల ప్రవహించుచెఱువువలె దశరథునిసైన్యము నెంతయుం జికాకువెట్టెను. భాను మండలము బరివేషము వట్టెను ఆపరివేషము చుట్టచుట్టుకొని గరుత్మంతునివలన జచ్చిపడియున్నపామువలెను భానుమండలము దానినెత్తిమీఁదనుండి పడిన మణి వలెను వెలసెను. అపుడు సాయంకాల మయ్యెను క్షత్త్రియరక్తముతోఁ బితృతర్పణములుసేయునట్టిభార్గవరాముని దమ్మనిపిలుచుచున్నదో యనునట్లు పడమటి దిక్కున నక్కలఱచెను. చండమారుతము మొదలగు దుశ్శకునములం గనిపట్టి దశరథుఁడు భయపడి వానికి శాంతులు చేయుమని గురువు నడుగ సర్వజ్ఞుఁడైన యావసిష్ఠుఁడు తుదకు శుభమగు నని చెప్పి యాతనభయము బాపెను. అప్పుడు సైనికుల యెట్టయెదుట నద్భుతమైనమహాతేజ మొకటి కనఁబడెను. కన్నులు నవరించుకొని వారు నిదానముగఁ జూచునప్పటి కాతేజము పురుషరూపమై కనఁబడెను. చంద్రునితోఁ గూడిన సూర్యుఁ డట్లు, సర్పముతోఁ గూడిన చందన వృక్షమట్లు తండ్రి యంశమైన యజ్ఞోపవీతంబును, తల్లి యంశమైన యాయుధమును దాల్చి వచ్చురాసి మహాగ్రహమున నిష్కరుణుఁడై తల్లిం జంపుమని యాజ్ఞాపించిన తండ్రి యానతి దాటక గడగడ వడంకుచున్న తల్లిశిరమును గండ్రగొడ్డటం దెగ నేసి పితృవాక్యపాలకుఁడై యతనికరుణకుం బాత్రుఁడైనట్టి వానిని, క్షత్త్రియులను దా నిర్వది యొకసారి బరిమార్చె నను విషయమును సూచించుటకో యనన నిరువదియొక్క పూసలు గల రుద్రాక్షమాలిక కుడిచేతం దగిలించుకొన్నవానిని, జనకుని వధించినారను కారణమున రాజవంశములు నిర్మూలించినవానిని, భార్గవరాముని జూచి బాలుఁడైన తనకుమారునిం జూచి తన యవస్థం జూచి దశరథుఁడు విషాద మొందెను. రామశబ్దము తన కుమారుని

యందును శత్రుండైన భార్గవుని యందును జూపట్టుటచే హారము
సర్పములయందును, గనంబడు మణివలె నది ప్రియ మయ్యె. భయంక
అర్ఘ్యపాద్యములు తెండితెండి యని పలుకుచున్న దశరథుని సరకు
వుడు క్రోధవహ్నులు గ్రక్కుచు తన వేండిచూపులను రాముని
అప్పుడు రాముండించుకేనియు భయపడక యెట్టయెదుట నిలి
కయ్యమునకుం గాలుదువ్వుచుం జాపమును పిడికిటంబట్టి వ్రేళ్ళ
కొని వింట సంధించి రామునకిట్లనియె. “క్షత్రియాతి నాశప
శత్రుస్థాన మైనది. దానిని బలుమారు నిర్మూలము చేసి నేన
గాని నిద్రించుచున్న పాము కఱ్ఱ దెబ్బ తిని మరల బుస
క్రమము విని వెండియు విజృంభింపవలసి వచ్చెను. ఇంత
లయినరాజు లెవ్వరును వంచియైన నెఱుంగని జనకుని
చిలివని విని నాపరాక్రమము నీచేత శృంగభంగ
చున్నాను. రాముండను మాట ఎవరి నోటనుండి
వర్తించుచుండెడిది. ఇప్పు డది విపరీతప్రవృత్తుండ
డుటచేత నేను సిగ్గుపడవలసివచ్చెను. నాశరము
పోవలేదు. అట్టి నాకు సమానశత్రులు లోక
మాయావుదూడను దీసికొనిపోయిన కార్తవీ
హరింపదలంచుకొన్న నీవొకండవు. నాక
నను నిన్ను గెలువని వక్షమున వ్యర్థము.
గూడ దహించినప్పుడె కదా యగ్నిమహి
ద్ధించిన యీశ్వరధనుస్సు హరిబలవ
శ్రేష్ఠం దోలంచి వైచిన పిదప నేటి
తము గూలునుగదా! ఇదిగో నావి
మవసరము లేదు. అటులు చేసిన
కొందును. అటులు చేయలేక
సిలి వేని వెఱ్ఱి బింకము
విగ్రహుండైనభార్గవ
టుల మందహాసము చేసి
యాతని చేతినుండి ధన
రాఘువుడెంతయు దర

డును. దానిమీఁద మెఱుపు వ్యాపించినవక్షమున నందము చెప్ప వలసిన
బాహుబలశాలి యగు రాముఁడు వింటికొప్పు నేల నాటునటుల
రిసంధింప భార్గవరాముఁడు మంటయెల్లఁ బోయి పొగమాత్రమె
లె పరిభారహితుఁడై యుండెను. వర్ధమానతేజుఁడయిన రాముఁ
డయిన భార్గవరాముఁడును నటు లొండొరులయెదుట నిలువ
రికిఁ బున్నమనాఁటి సాయంకాలమున నుదయించుచున్న
ంచున్న సూర్యుని జూచున ట్లయ్యెను. వింట సంధింపఁబడి
శమును జూచి, గళిత వీర్యుఁడైన భార్గవరాముం జూచి,
నైన రాముఁడు కరుణార్ద్రచిత్తుండై యిట్లనియెను
వై నను బ్రాహ్మణుఁడవగుటచే నిన్ను నేను నిర్దయగా
ఘ మైనది. దీని నిప్పుడు దేనిమీఁద విడువవలయునో
వార్జించిన పుణ్యలోకముమీఁద విడుతునా? లేక
డుతునా.'' అనుడు భార్గవుం డిట్లనియె. "నీవు
దేవుండ వనియు నే నెఱుఁగక యిటులు చేయలేదు
ంరొక్క పరిభావము జూడఁ గోరి నీ శాగ్ర
విరోధులను భస్మీభూతము చేసితిని. మహీ
ము జేసితిని. అన్నివిధముల చేత ఘనుఁడ
టయు శ్లాఘ్యమె యగును. మహాత్మా! పు
ఁడ గాన నాగమనము రక్షింపుము. స్వ
. అది చెడినను నాకు విచారము లేదు.''
గి తన యమోఘబాణము వదలెను.
సమార్జితము లైనలోకము లతని
శురామునిచరణములపయి వ్రాలి
పరాజితులయిన శత్రువులయొ
దా! అప్పుడు భార్గవరాముఁ
నః దొలఁగించి జనకసంబంధ
నా కొడఁగూర్చితివి. నీ ని
నీవు తీర్చెదవు గాక!
విమ్ము నే నరిగెద, నని
వెను. భార్గవుండటులు

పోయినవెనుక నద్భుతమగునజయమును సంపాదించిన ప్రియపుత్త్రుని గాఁగిటంజేర్చి దశరథుఁడు మహానందమును బొందెను. మొదట నధికతరవిషాదము నొంది పిమ్మట మహానంద మొందినయారాజు మునుముందు గాఱిచిచ్చుచేత దహింపఁబడి పిమ్మట వానచేఁ దడిసినచెట్టువలె నుండెను. అటులు పయనము చేసి యయోధ్యాపురసమీపమునకుఁ బోయి యూరిబైట గొన్నిదినములు పరగృహంబులలోనుండి యతఁడు పట్టణముఁ బ్రవేశించెను. దశరథమహారాజు సకలలోపభోగంబు లనుభవించి ప్రాతఃకాలమునందు నారిపోవుటకు సిద్ధముగ నున్నదీపమువలె మోక్షమార్గప్రయాణమునకు సిద్ధముగ నుండును. ముసలితనము వెండ్రుకలరూపు దాల్చి, కైకేయిశంకచేత రాజ్యలక్ష్మిని రామునియందు నిలుపవలసిన దని యాతని చెవిదగ్గఱఁ జేరి చెప్పుచున్నదో యన్నట్లుండెను. ఉద్యానవనమందలి చిన్ననీటిబోది తోటలోని ప్రతిచెట్టునకు నీ రొసంగునటులు రామునకుఁ బట్టాభిషేకమగు నన్నవార్త యయోధ్యాపురమం దున్నప్రతిపురుషునకుఁ బ్రతిస్త్రీకి నానందమిడెను. అతని పట్టాభిషేకమునకు జరిగిన యత్న మంతయు బాపనిశ్చయురా లయినకైక విషాదపూరితుఁడైనరాజు కన్నీటి బొట్లచే దూష్యము చేసెను. వరము లిచ్చెద నని చెప్పి యారడించిన భర్తనుజూచి కైక వానకురియుటకు సిద్ధముగ నున్నప్పుడు భూమి నెరియలలోనుండి పాములను విడుచుచున్నటుల తనకుఁ గావలసిన క్రూరవరములను వెలిబుచ్చెను ఒకటవరమున రాముని బదునాలుగేండ్లు వనవాసమున కంపఁగోరెను రెండవవరమునఁ దనకు వైధవ్యమువ్రధానఫలముగ నుండునట్లు రాజ్యసంపద తనపుత్త్రున కిమ్మని కోరెను. భూభార మువహింపుమని తండ్రిచెప్పినప్పుడు రాముఁ డందుకు విచారపూర్వకముగ సమ్మతించెను. అవ్వల నరణ్యమున కేఁగుమని యానతిచ్చినప్పుడు దానిని సంతోషపూర్వకముగ స్వీకరించెను పట్టాభిషేకమున కనువైన దువ్వలువలు దాల్చినప్పుడును, వనవాసోచితములైన నారచీరలు కట్టుకొనునప్పుడును సమానముఖవికాసము గలిగి భాసిల్లుచున్న రామునిం గని పౌరులు విస్మయాక్రాంతులైరి. సత్యభ్రష్టుఁడుగాకుండ తండ్రిని నిలిపి సీతాలక్ష్మణసమేతుఁడై యతఁడు దండకారణ్యమును, దానితోబాటు సకలసజ్జనచిత్తములను బ్రవేశించెను. పుత్త్రియోగార్తుఁడైదశరథుడు తాను మున్నొనర్చిన దుష్కర్మములవలనఁ గలిగినశాపముందలంచి తాను పుత్త్రుని జేసిన దుష్కర్మమునకు మరణమె తగినపరిహార మనియెంచెను. కొడుకులు దూరమం దుండుటయు రాజుమృతినొందుటయుఁ దెలిసి రంధ్రాన్వేషణదక్షులైన శత్రువులు రాజ్యము సెరగాఁ జేసికొనఁ దలంచిరి. రాజమరణమునకు దుఃఖించుచున్నమంత్రులు తల్లిచుట్టాలయింట నున్నభరతునికడకుఁ గన్నీఁ పెట్టుకొనక ధైర్యము నిలుపగల

యాప్తులను బంపి రప్పించిరి. తండ్రియావిధముగ మృతినొందినవార్త విని భరతుఁడును తల్లికిని రాజ్యలక్ష్మికిని భరాఙ్ముఖుఁడై రామసన్నిధికిఁ బయనమైపోవ మార్గమధ్యమున మునులు సీతాలక్ష్మణులఁ గలిసి రాముఁడు విశ్రమించిన యాశ్రమవృక్షములం జూచుఁ జూచి విచారించి బలములోఁ గలసి చిత్రకూట పర్వతమునకుం జని రామునింగని తండ్రి స్వర్గస్థుఁడైనవార్త దెలిపి యనుచ్ఛిష్టమైనరాజ్యము స్వీకరింపుమని ప్రార్థించెను అన్నగారు తాల్పనొల్లనిరాజ్యము తాను వహించినపక్షమున నగ్రసోదరుఁడు వివాహ మాడకమున్ను పెండ్లియాడిన కనిష్ఠునకు వచ్చుదోషమె తనకు వచ్చునని ధర్మవేత్తయైన భరతుఁడు తలంచెను అప్పుడు రాజ్యము పూనుట స్వర్గస్థుఁడైనజనకుని శాసనము మీరుటయగునని రాముఁడు రాజ్యస్వీకారము నంగీకరింపక పోగా భరతుఁడు పూజ్యదేవతలుగ రాజ్యమందు నిల్పుటకుఁ బాదుకల నైననిమ్మని యడిగెను. అలాగె యని రాముఁడు పాదుకల నొసంగ భరతుఁడయోధ్యాపురమునకుం జనక నందిగ్రామము నందుండి యొకఁడు తనయొద్ద దాచినసొమ్ము జాగ్రత్త పెట్టినట్లు భోగముల ననుభవింపక యన్నగారి పేరనె రాజ్యమేలెను. తనతల్లి చేసిన మహాపాపమునకుఁ బ్రాయశ్చిత్తము చేయుచున్నాఁడో యనునట్లు భరతుఁడు రాజ్యకాంక్ష విడిచి రాముని యందు దృఢవిశ్వాసము కలిగి మునివృత్తినుండెను.

## శ్రీరామ మహారాజు.

——:)o(:——

పార్థకంబున నిక్ష్వాకువంశస్థులు పూనునట్టివ్రతము ప్రాయమునందె పూని రాముఁడు సీతాలక్ష్మణ సమేతుఁడై యొకయడవినుండి యొకయడవికిం బోవుచుండెను. ఒకనాఁడా రఘువంశతిలకము మిక్కిలి డస్సినట్లుండి తనప్రభావము చేతఁ గదలనినీడగల యొకచెట్టుక్రింద సీతాదేవితొడమీఁద దలపెట్టుకొని పండుకొనెను. అప్పుడు దేవేంద్రనందనుఁడైన ధూర్తుఁడు కాకాసురుఁడు సీతాదేవి వక్షోజములను దనగోళ్ళతో గీఱెను. అంతట జానకి మేల్కొల్ప రాఘవుఁడు లేచి మంత్రించి ఇల్లుతూపొకటి వానిపైఁ బ్రయోగించెను. కాకాసురుఁడు భీతుఁడై కావు కావుమనుచు రాముని పాదములపైఁ బడి యొకకన్ను నిచ్చి ప్రాణములఁ

దక్కించుకొనెను. అయోధ్యకు సమీపమం దుండుపక్షమున భరతుఁడు వచ్చి మరలఁ దన్ను బలవంతపెట్టునేమోయను భయమున నతఁడు చిత్రకూటము విడిచి దూరపు టడవుల కరిగెను. మిక్కిలి యాదరంబునఁ దమ కాతిథ్యమిచ్చునట్టి మహర్షులగృహములయందు వసించుచు రాముఁడు దక్షిణదిక్కున కరిగెను. వర్షమునుగురియు నక్షత్రములయందు వసించుచు భాస్కరుఁడు దక్షిణదిక్కున కఱుగును కదా. అతని వెంట నరుగుచున్నవిదేహరాజపుత్రికం జూడఁ గైక వద్దన్నను వినక సకలగుణసంపన్న యైన రాజ్యలక్ష్మి యాతనివెంటఁబడి వచ్చుచున్నదో యన్నటులఁ దోఁచెను. అనసూయాదేవి వైదేహికి సుగంధయుతమయిన యంగరాగ మొకటియిచ్చెను. ఆయంగరాగముయొక్క సౌగంధ్యమునకు వలచి పుష్పములమీఁద వ్రాలుట మాని తుమ్మెదలు దీని పై వ్రాలఁ జూచ్చెను. ఒకనాడు సంధ్యాకాలపుమేఘమువంటి ఛాయగల విరాధుఁ డనురాక్షసుఁడు చంద్రునకు రాహు వడ్డ మైనటుల రామునిమార్గమున కడ్డమై నిలిచి శ్రావణభాద్రపదములకు నడుమ నున్నవర్షము నవగ్రహ మెత్తుకొని పోవునటులు రామలక్ష్మణుల నడుమ నున్న సీత నెత్తుకొని పోయెను. రాఘవు లిద్దరు లోకశోషణుఁ డైన యాదనుజుని జంపి మహర్షుల యాశ్రమములకు దుర్గంధము గలుగకుండ శవమును భూమిలోఁ బాతిపెట్టిరి, అంత నగస్త్యునియాజ్ఞాప్రకారము వింధ్యపర్వతము తన యథాస్థితి దాల్చి యున్నటులు రాముఁడును దననివాసంబునఁ బంచవటి కరిగి యచ్చట నుండెను. గ్రీష్మమున నెండవేఁడిమి కోడి యాఁడుపాము మంచిగంధపుచెట్టుం జేరునటులు రావణుని చెల్లెలైన శూర్పణఖ కామాతుర యై రామునికడ కరిగెను. అది తన వంశముం జెప్పికొని సీతసముఖముననె రాముని వరించెను. అధిక కామమోహిత లైనయంగనల యెడల మన్మథుఁడు సమయాసమయము లెఱుఁగఁడుగదా! "ఓసి! బాలా! నాకు భార్య యున్నది. నాతమ్మునికిప్పుడుభార్య లేదు. పోయి వాని నాశ్రయింపుము." అని యాకాముకురాలిని వృషస్కంధుఁ డైనరాముఁడు పంపివైచెను. "అగ్రజుని సన్నిధి కరిగిన దానవు. నిన్ను నేను గూడ" నని సౌమిత్రి పంపివైవ నది మరల రెండుగట్ల నొరసిన నదివలె రామసన్నిధిం బ్రవేశించెను. దానిం జూచి జానకి నవ్వెను. అంతదనుక సౌమ్యరూపముధరించియున్న యారాక్షసాంగన సీత నవ్విన తోడనె వికృతరూపము ధరించెను. గాలి లేనంత సేపు ప్రశాంత మైయున్న సముద్ర చంద్రోదయ మైనతోడనె ఘూర్ణమాన మగును కదా!

"ఓసీ! నీవు నన్ను జూచి నవ్విన నవ్వుయొక్క ఫల మిప్పుడే యనుభవింతువు. చూడు నాప్రజ్ఞ. నీవు నాయెడ నొనర్చిన యపరాధము బెబ్బులియెడ లేడిచేసిన యపరాధమువంటిది సుమీ" యని మిక్కిలి భయపడుచు మగనితొడమీఁదఁ గూర్చున్న

జానకితోఁ బలికి తక్కిని కామరూపమును విడిచి శూర్పణఖ నామమునకుఁ దగిన భయంకర వికృతవేషము నారాక్షసి ధరించెను. మొట్టమొదటఁ గామరూపముతో నున్నప్పుడు మనోజ్ఞములయిన కోయిల పలుకులుపలికి పిమ్మట ఘోరస్వరముగల నక్కకూతలు కూయుట చేత నది వికృతవేషిణియైన రాక్షసాంగనయని లక్ష్మణుఁడు తెలిసికొనెను. తెలిసికొని సౌమిత్రి పర్ణశాలకుఁ బోయి యొరనుండి కత్తిదూసి సహజముగ వికృతరూపము ధరించినదానిని ముక్కుచెవులు గోసి మరింత వికృతరూపధారిణిఁ జేసెను. అంతట నారక్కసి వంకర గోళ్ళతో నంకుశములవంటి వ్రేళ్ళతో వెదుళ్ళవంటి కీళ్ళతో వెలువు గొలుపుచు నాకాశంబున కెగిరి రివ్వున జనస్థానంబున కరిగి రాముఁడు రాక్షసకులమునకు నూతనముగాఁ జేసిన పరాభవమును ఖరుడు మొదలగు రాక్షసుల కెరింగించెను. అంతట ఖరదూషణాది రాక్షసులు శూర్పణఖను ముందిడుకొని రామునిపయి దండయాత్ర కరిగిరి. ముఖమునందలి యవయవము లన్నియుఁ దరిగివైవబడిన చుప్పనాకను ముందిడుకొని పోవుటయే రాక్షసులకు మిక్కిలి యమంగళలక్షణ మయ్యెను. దానవులు శస్త్రముల నెత్తి రాఘవుని మీఁద వేయుటకయి రాఁగా రాముఁడు విదేహకన్యారక్షణభారము సౌమిత్రిమీఁదను విజయభారము వింటిమీఁదను నిలిపి నిలిచెను. రణమునకు రాముఁడొక్కఁడె కాని రాక్షసులు వేన వేలుండిరి. కాని, ప్రతిరాక్షసు నొక్కొక్కరాముఁ డెదుర్కొని నట్లు వారి కగుపడెను. శుభాచారుఁడై యాత్మదూషణము సహింపని రాఘవుఁడు దురాత్ముల చేతఁ బంపఁబడిన దూషణుని రణముఖంబున సహింపుచునా ? అంతట రణమారంభము కాఁగా రాముఁడు వింటినుండి ఖరునిమీఁద దూషణునిమీఁద త్రిశిరుని మీఁద బాణములు విడువ నవి ధనుస్సునుండి యొక్కసారిగా వెడలినట్లు దోఁచెను. రామబాణములు రాక్షస శరీరములు దూరి యెప్పటివలె బయటికి వచ్చి రాక్షసుల ప్రాణవాయువుల హరింపఁ బక్షులు నెత్తురు ద్రావెను. రామబాణములచేత నిహతమైన రాక్షససేనయందు జోదుల మొండెములు తప్ప నిలువఁబడిన పదార్థము లేవియు లేకపోయెను.

రాముఁడు కురిసిన బాణవర్షము చేతను రాక్షససైన్యము గ్రద్దలనీడలఁ బెద్ద నిద్దురఁ బోయెను. రాఘవుని చేత నిహత మయిన యారాక్షసులలో రావణుని కీదుష్టవార్తఁ దెలుపుటకయి శూర్పణఖ యొక్కత మాత్రము బ్రతికి యుండెను. చెల్లెలైన శూర్పణఖ కవమానము సేయుట చేతను మిగుల నాప్తు లయిన ఖరదూషణాదుల ఖండించుట చేతను దన పది తలలమీఁద రాముఁ డడుగు పెట్టినట్లె యని రావణుఁడు తలంచెను. తలంచి పగ దీర్చుకొనుటకై యొక రాక్షసుని చేత జింకరూ

మెత్తించి రాఘవులను మోసపుచ్చి, పక్షిరాజైనజటాయువు నడ్డగించినను నిలువక రావణుఁడు సీత నెత్తుకొని పోయెను. అంతట రాఘవులు సీతను వెదకుచుఁ బోయి కంఠగతప్రాణుఁడై తన ప్రియసఖుఁడైన దశరథుని ఋణము దీర్చికొని ఱెక్కలు తెగి పడియున్న గృధ్రరాజైన జటాయువుం గనిరి. ఆజటాయువు రావణుఁడు సీత నపహరించినవార్త మాటలతో రాఘవునికిం దెలిపి దారుణములైన వ్రణములచేతఁ దనమహాకార్శ్యములఁ దెలిపి మృతి నొందెను. పితృమృతికి శోకించినట్లే యాపక్షి రాజుమృతికి శోకించి వారు తమతండ్రికిఁ జేసిన విధమున నగ్నిసంస్కారములు చేసి యుత్తరక్రియ లొనర్చిరి. తమచేతఁ జచ్చి శాపవిమోచనము నొందిన కబంధుఁ డను రాక్షసునివలన నుపదేశముఁ బడసి రామలక్ష్మణులు రామునితో సమానముగ దుఃఖము నొందుచున్న సుగ్రీవునితో సఖ్యము సేసిరి. అనంతరము వీరుఁడైన రాముఁడు వాలిం జంపి చిరకాలమునుండి సుగ్రీవునిచే వాంఛింపఁబడుచున్న యాతని పదమునందు సుగ్రీవు నభిషిక్తుం జేసి ప్రతిష్ఠించెను. సీతాదేవిని వెదకుటకయి వానరరాజు పంప వనచరులు రామునిమనోరథములటులు నానాదేశములకరిగి తిరుగం జొచ్చిరి. సీతయొక్కవార్త సంపాతివలన విని నిర్మమతుఁడు సంసారము దాటినటుల హనుమంతుఁడు సాగరము దాఁటెను. దాఁటి లంక చొచ్చి యానగరమెల్ల కలయం గనుంగొని యతఁడు విషలతచేతఁ జుట్టుకొనఁబడియుండు దివ్యౌషధివలె రాక్షసస్త్రీలనడుమ నున్న సీతం గనుగొనెను. కని భర్తయానవాలుగా నిచ్చిన యుంగరమును మారుతి యామెకు సమర్పించెను. నేత్రములనుండి చల్లని యానందబాష్పములు దొరఁగ నామె యాయంగుళీయకము ధరించెను. అటులు భర్తృసందేశ మెఱిఁగించి సీతను సంతోషపఱచి యక్షకుమారునిం జంపి యుద్ధతుఁడై క్షణకాలము రాక్షసులచేతఁ బట్టువడి పిమ్మట లంకాపురమెల్లఁ గాల్చెను. మూర్తీభవించిన సీతాదేవియొక్క హృదయమువలె నున్న రత్నమును సీతవలన హనుమంతుఁడు గ్రహించి కృతార్థుఁడై దాని రామున కిచ్చెను. రాముఁ డారత్నమును వక్షస్థలమం దిడికొని కన్నులు మూసికొని సీతాదేవిని గాఁగిలించికొనినట్లే యానందమొందెను. ప్రియురాలి వార్తను విన్నపిదప నామెను జూడవలయు నని గట్టి కోరికె యాయనకుఁ గలిగెను. కల్గుటయు లంకానగరముం జుట్టిన లవణసముద్ర మాయనకుఁ జిన్న కందకమువలెఁ దోఁచెను.

అంతట నతఁడు శత్రునాశనము కొఱకుఁ బయలుదేఱెను. భూమియే గాక యాకాశముగూడ నిండునటులు వానరు లాయనవెంట నంటి నడిచిరి. రాముఁడు

సముద్రతీరముం జేరియుండ రాక్షసరాజ్యలక్ష్మి చేయఁదగినకార్యముల నెల్ల జెప్పి పంపినతెఱంగున విభీషణుఁడు వచ్చి రాముని శరణుజొచ్చెను. రాక్షసరాజ్యము నతనికి బట్టము గట్టెద నని రాముఁ డప్పుడు ప్రతిజ్ఞఁజేసెను. అదును దప్పక ప్రయోగించినవక్షమున నీతులు మంచిఫలము నిచ్చునుగదా. అంతట రాఘవుఁడు వానరులచేత సముద్రమునకు సేతువు గట్టించెను. నారాయణుఁడు శయనించుటకొఱకుఁ బాతాళము నుండి లేచివచ్చిన శేషుఁడువలె సముద్రముమీఁద నాసేతువు దనర్చెను. ఆసేతువు మీఁద సముద్రము దాఁటి రెండవ బంగారుకోటవలె నున్న వానరసమూహముతో నానగరము ముట్టడించెను. అపుడు దానవులకు వానరులకు ఘోరయుద్ధ మయ్యెను. రామజయ రావణజయ, యను శబ్దములు దిక్కుల వ్యాపించెను. శత్రువుల చేతనున్న పరిఘలు వృక్షములచేత భగ్నము లయ్యెను. ముద్గరములు రాళ్ళతో భిన్నము లయ్యెను. గోళ్ళు శస్త్రముల మించెను. పర్వతము లేనుంగుల మద మణంచెను.

రాక్షసులు రామునిశిరచ్ఛేద మైనటులు మాయాప్రయోగములు చేయ నది నిజమని సీత నమ్మి శోకముచే మూర్ఛిల్లెను. అది మాయయని త్రిజట తెల్పి సీతాదేవి దుఃఖముఁ బాపెను. ప్రాణేశ్వరుఁడు బ్రతికియున్నాఁ డని విని యామె శోకము న్విడిచెను; గాని, యాయన మృతి నొందినాఁ డని వినఁగానే ప్రాణము బాయక బ్రతికి యున్నందుకు మిక్కిలి సిగ్గుపడఁ జొచ్చెను. రామలక్ష్మణులకు మేఘనాదునివలనఁ గలిగిన యురగపాశ బంధనపీడ గరుత్మంతుని రాకవలన స్వప్న వృత్తాంత మయ్యెను. రావణుఁడు లక్ష్మణుని యురస్స్థలమున శక్తిఁ బ్రయోగింప నతఁడు మూర్ఛిల్లెను. కొట్టఁబడకయె రాముఁడు గుండె లవియునటులు తమ్ముని కొఱకయి శోకించెను. హనుమంతుఁడు మహౌషధి దేఁగా లక్ష్మణుఁడు, దాని వలన బ్రతికి లంకాపురస్త్రీలకు మరల బాణములవలనఁ గలుగు విలాపమును నేర్పనట్టి యాచార్యుఁ డయ్యెను. ఇంద్రధనుస్సును మేఘనాదమును గనఁబడకుండఁ జేయు శరత్కాలమువలె లక్ష్మణుఁడు మేఘనాదహంతయై తద్ధను ఖండముఁ గూలఁ జేసెను. కుంభకర్ణుఁడు కపిరాజువలనఁ దన తోఁబుట్టువైన శూర్పణఖయొక్క యవస్థం బొంది యులిచేతఁ జక్కఁబడిన మణిశిల గలమహాపర్వత మటులు రాముని మీఁదఁ బడెను. “నిద్రాప్రియుఁడవైన నిన్ను నీయన్న యకాలమందు వృథాగ మేల్కొల్పెను” అని రామబాణ మతని నోదార్చు పగిది తాఁకి యతనిని పెద్దనిద్దుర బుచ్చెను. ఆమహాయుద్ధమున లేచినదుమ్ము రక్తనదులవలన శాంతించెను. తక్కిన రాక్షసులు క్రమక్రమముగా వానరులచేఁ జచ్చిరి. నేఁడు లోక మరావణమొ యరామమొ తప్పక యయి తీరు నను గట్టినమ్మకముతో రావణుఁడు మందిరము

విడిచి యుద్ధమునకు బైలు దేఱెను. రాముఁడు పాదచారి యై యుండుటయు రావణుఁడు రథ మెక్కి యుద్ధమునకు వచ్చుటయుఁ జూచి దేవేంద్రుఁడు మంచి గుఱ్ఱములు గట్టినతనరథము మాతలిచేత నంపెను. ఆకాశగంగాతరంగవాయువులచేతఁ గదలు టెక్కెములు గలిగి జయప్రదమై వెలయునారథము మాతలి చేయూఁతఁగాఁ గొని రాఘవుఁ డెక్కెను. రాక్షసులు ప్రయోగించు మహాస్త్రములు దేనిమీఁదఁబడి కలువపూలువలె నిష్ఫలము లైపోవునో యట్టిమహేంద్రకవచమును మాతలి రామునిమేనం దొడిగెను. రామరావణులు చిరకాలమునుండి తమతమ ప్రతాపంబులు ప్రకటింపఁ దలఁచి యుద్ధమున కెదురు జూచి చూచి పోరుచుండుటచే వారి యుద్ధము చరితార్థ మైనటులు దోఁచెను. యుద్ధభూమిలో రావణుఁ డొక్కఁడె యున్నను శిరస్సులు చేతులు మిక్కిలి యుండుటచేతఁ బెక్కుచుట్టాలతోఁ గలిసి యున్నట్లే నిలిచెను. దిక్పాలుర నవలీలఁగా జయించినట్టియు, శిరస్సుల కోసి బలియిచ్చి మహేశ్వరు నర్చించినట్టియు, కైలాసపర్వతముఁ గదిపినట్టియు రావణుని బలవంతుఁ డైనశత్రునిగా రాముఁడు భావించెను. సీతాదేవిని గొలఁదికాలములోనే చూడఁగల్గు నని సూచించుచు మాటిమాటికి నదరు చున్నరామునికుడిభుజముపై రావణాసురుఁడు క్రోధాతిశయమునఁ గ్రూరబాణముఁ బ్రయోగించెను. రాముఁడు ప్రయోగించినమహాస్త్రము రావణునివక్షస్స్థలముఁ దాఁకి బైటికి వచ్చిదశకంఠుని నొప్పించినవార్త నాగులకుఁ దెల్పుటకుఁ బాతాళలోకమునకు పోయినదో యన నేలఁ జొచ్చెను. మాటకు మాట. శస్త్రమునకు శస్త్రము ప్రయోగించి వారు ఘోరయుద్ధమును జేయ నది వాదులవాదము వలెనె ప్రబలెను. రామరావణు లొకరితరువాత నొకరు సంగరమున విజృంభించుటచేత జయలక్ష్మి సమానమై యిరువురిం జెందక పోరాడుమదపుటేనుగులనడుమ నుండువేదికవలె శోభిల్లెను. రాముఁడు జయించినప్పుడు దేవతలును, రావణుడు జయించినప్పుడు రాక్షసులును సంతోషమునఁబుష్పవృష్టులు గురియింపఁగా నమ్మహాయోధుల తీవ్రబాణము లాకుసుమవృష్టుల నసహించక విజృంభింపఁ జొచ్చెను. రావణుఁడు రామునిమీఁద యమగదాదండమును బోలునట్టి లోహకంటకశతఘ్నిఁబ్రయోగించెను. ఆ శతఘ్ని తన రథముదరికి రాకమునుపె యర్ధచంద్రాస్త్రముతో దానిని రాక్షసులయాశలతోడ రాముఁ డరఁటిచెట్టు నఱికినట్లు మిక్కిలి యవలీలఁగా ఖండించెను. తనమనస్సులో నాఁటి యున్నసీతావియోగదుఃఖశల్యమును బాపుటకుఁ దగినదివ్యౌషధ మయిన బ్రహ్మాస్త్రమును రాముఁడు రావణునిపైఁ బ్రయోగించెను. పదిముఖంబులు దాల్చి యాకసంబున నుండు చున్నయాబ్రహ్మాస్త్రము కరాళఫణిమండల మగుశేషుని

శరీరమువలె భయంకర మయి కానఁబడెను. ఈవిధంబున మంత్రప్రయుక్త మయిన బ్రహ్మాస్త్రము చేత వ్రణబాధ యించుకేనియు లేకుండ రావణుని దశశిరస్సులు నిమిషార్ధమున నేల గూలెను. నేలఁ గూలెడి రావణుని తలలు కదలుచున్న సముద్ర తరంగములమీఁదఁ బ్రతిఫలించు సూర్యబింబముల ట్లుండెను. ఆదైత్యుని శిరస్సులు నేలఁ గూలుట కనులారఁ జూచియు నవి మరల నతనిశరీరముతో నతుకుకొను నేమో యనుభయమున నతఁడు చచ్చినటులు దేవతలు నమ్మఁజాల రైరి. అచిర కాలములోఁ బట్టాభిషిక్తుఁ డగుటకు సిద్ధముగా నున్నయారామునిమీఁద దివ్యులు పుష్పవర్షము గురిసిరి. ఈవిధంబున రావణుని సంహరించి దివ్యులకార్యముం దీర్చి ధనుర్గుణము దింపి రాముఁడు స్వర్గమునకుఁ బొమ్మని మాతలికి సెల వియ్య నతని యాజ్ఞాప్రకార మతఁడు స్వర్గమునఁ కరిగెను. అంతట సీతాదేవి యగ్నిం జొచ్చి తనపరిశుద్ధచరిత్రమును బ్రకటించినపిదప నామెను గ్రహించి విభీషణునకు లంకా రాజ్యముఁ బట్టము గట్టి,యతఁడును సుగ్రీవుఁడు లక్ష్మణుఁడు హనుమంతుడు మున్నగు వారందఱుఁ గొలిచి రాగ, విమాన మెక్కి రాముఁ డయోధ్యాపురికిం జనెను. రామ నామధేయుఁ డైనయాశ్రీహరి శబ్దగుణప్రధాన మై తన పాదమె యైనయాకాశము నందు విహరించుచున్న విమానమునందుఁ గూర్చుండి సీతకు సముద్రముం జూపిసీతతో మెల్లఁగా నిట్లనియె. "ఓసీతా! నేను గట్టినసేతువు చేత రెండుగాభిన్నమయి తెల్లని నురుగులతో వెలయు నీసముద్రమును జూడు! దివ్యగంగ చేత రెండుపాయ లయి నక్షత్రములతో విరాజిల్లు చున్న యాకాశము వలె నున్నది. మాపూర్వులలో నొకఁడు యజ్ఞదీక్షితుఁ డై యుండ నతని యజ్ఞహయమును హరించి కపిలమహాముని యొద్ద పోయెను. ఆహయమును దెచ్చుటకై యాతనికుమారులు నేలఁద్రవ్య నదియె సముద్ర మయ్యె నని మాపెద్దలు చెప్పుచు వచ్చిరి. సూర్యకిరణము లిచ్చటనే జలగర్భముం ధరించును. రత్నము లిచ్చటనే లభించును. బడబాగ్ని యిచ్చటనే వృద్ధి పొందును. జగదానందకర మయినచంద్రుఁ డనుజ్యోతి యిక్కడనె పుట్టెను. బహురూపంబుల ధరించినట్టియుఁ దనమహిమచే దశదిశలు నిండినట్టియు విష్ణువుఁ బోలినట్టియు నీ మహాసముద్ర మిట్టి దనియు నింత విశాల మనియు నెవఁడు వర్ణింప నోపు. విరాట్పురుషుఁడు సకల లోకసంహారముఁ జేసి యీసముద్రముమీఁదఁ బ్రళయ కాలమందుఁ బవ్వళించి నాభీపద్మమందున్న చతుర్ముఖుఁడు పొగడుచుండ హాయిగా యోగనిద్రఁ జెందుచుండును. మహేంద్రుఁడు వజ్రాయుధము చేత రెక్కలం దునుమ నుక్కు దక్కి వందలకొలఁది పర్వతము లీ సముద్రమును శరణు జొచ్చెను. బలవంతుఁ డైన శత్రువునకు భయపడినరాజులు, శూరులు ధర్మాత్ములు నైన మధ్యమ

రాజునీవిధముగానే యాశ్రయించుటకదా! ప్రళయకాలమునఁ బొంగిన యీ మహార్ణవజలము పురాణపురుషుఁడైన శ్వేతవరాహమూర్తి పాతాళమునుండి భూమిని పైకిఁ దెచ్చునప్పుడా వసుంధరకు క్షణకాలము మేలిముసుఁగయ్యెను. సముద్రమును రెండు పాయలుగాఁ జీల్చుటకో యన నడవియేనుఁగులు దుముకుచున్నవ దిగో. అటులు దుముకుట చేత క్షణకాలము మాత్రమె వానిచెక్కిళ్ళయందుఁ గర్ణచామరములటులు నురుగుముద్ద లంటుకొనెను. సముద్రతీరపు గాలి మేసి పాములు లక్ష్యముగఁ దరఁగములవలె నున్నవి చూడు. సూర్యునికిరణముల చేతఁ బడగలమీఁద నున్న మాణిక్యములు ప్రజ్వరిల్లుటచే నవి పాములని మనకుఁ దెలియ వచ్చుచున్నవి. జలము ద్రాగుటకు మేఘము సముద్రమునం బ్రవేశించి సుడిగుండమునందుఁ బడి పయికిఁ బోవ లేక నిట్టట్టుఁ దిరుగుచున్నది. దానిఁ జూడ మందరపర్వతము మరల సముద్రము న్మథించుచున్నదా యని సందియము పొడముచున్నది. కల్యాణీ! యీ మహాసముద్ర మొక యినుపచక్రము వలెఁ గనబడుచున్నది. తీరమునందలి తాటితోటల నీల కాంతి యా చక్రపుటంచునఁ బట్టిన తుప్పువలెఁ గనఁబడుచున్నది. కళ్యాణీ! మన మిప్పుడు క్షణములో సముద్రతీరమును జేరినాము. ఇదిగో చూడు. ఇసుక తిన్నెలపై ముత్తెపుచిప్పలు చెదరి పడియున్నవి. పోకచెట్లు కాయల బరువున వంగి యున్నవి. సుందరీ! యొకసారి తిరిగి చూడు. అంతకంతకు మనకు దూరమగుచున్న సముద్రములోనుండి వనసమేతమైన యీ భూమివచ్చుచున్నటులు గన్పడుచున్నది. ఈవిమాన మొక్కసారి దేవమార్గము ననుసరించిపోవుచున్నది. ఒక్కతూరి మేఘములదారి నరుగుచున్నది. ఇంకొకసారి పక్షు లేగుత్రోవను బోవుచున్నది. ఇది నేనెటులు కోరిన నటులు పోయి నాకానందము గల్గించుచున్నది. దేవేంద్రునిగజమగు నైరావతముయొక్క మదగంధము స్పృశించి యాకాశగంగాతరంగ స్పర్శమువలనఁ జల్లనైన యీగాలి యీ మిట్ట మధ్యాహ్నమువేళ నీమొగమున వచ్చిన చెమట బిందువులను హరించుచున్నది చూడు. విమానపు గవాక్షమునుండి హస్తముఁ జాచి మేఘములను స్పృశింపఁగా నందులోనుండి మెఱుపువచ్చి నీచేయి తాకి నీకుఁ గ్రొత్త యలంకారముఁ గూర్చిన ట్లున్నది. సుందరీ! యిది జనస్థానము. ఇది రాక్షసశూన్యమై నిర్భయముగానుండుట చేత మునులు చిరకాలము క్రిందట విడచిపోయినందమ యాశ్రమములను మరలఁ జేకొని పర్ణశాలలఁ గట్టుకొనుచున్నారు చూడు. నీ పాదమునుండి యూడిపడి భవద్వియోగదుఃఖమున మాటాడ లేక మౌనము ధరించినట్లున్న నీ కాలి కడియమును మేము చూచినచోటదేసుమీ! రాక్షసుఁడు నిన్నుఁ గొనిపోయిన యాదారి మాటలతోఁ జెప్పలేక యీ లతలు

వ్రేళ్ళను బోలెడు చిగుళ్ళచేతఁ జూపెను. ప్రేయసీ! యీ ప్రాంతముల యందలి యాఁడులేళ్ళు సైతము దర్భాంకురములఁ గొఱుకుట మాని దక్షిణ దిక్కునకుఁ జూడ్కులు బఱపి నీవు చనినదారి యెఱుఁగక బాధపడెడు నాకు నెత్తినఱెప్పలచేత మార్గముఁగనఁబఱచెను. అదిగో! శృంగములచేత గగనంబు నొఱయుచున్న మాల్యవంతమును జూడుము. ఈ కొండయందను జేరి నేను నీ నిమిత్తము కన్నీరు విడువ నీ శైలము నాశ్రయించిన మేఘము క్రొత్తనీరు కురిసి నాతో సమానదుఃఖముఁ జూపెను. వర్షధారాహతములైన పల్వలములనుండి బయలు వెడలు సుగంధమును సగము విచ్చెడు కడిమిపూవులు, నెమిలికూఁతలు సహజముగా మనోహరములయ్యు నీవు లేమి యవి నా కింపుగా నుండలేదు. సుందరీ! వర్షాకాలమున శైలగుహలలో నుఱుములు ప్రతిధ్వను లిచ్చినప్పుడు భయమున నీవు నన్ను మున్ను కౌఁగిలించుకొన్నమాట జ్ఞప్తికిరాఁగా నేను దాళఁజాలక పోయితిని క్రొత్తగాఁ గురిసిన వానచేత నేపుగాఁ బెరిగిన యరఁటిపూలు నీ వివాహసమయమున నగ్నికడ నీవు కూర్చున్నప్పుడు పొగచేత నెఱ్ఱవడిన నీకన్నులవలె మనోహరములై కానఁబడి నన్నెంతో పీడించెను. సఖీ! యిది పంపాసరస్సు. గట్టుమీఁదఁ బేవవనములుగలిగి తరుగొత్తుచున్న కొంగలు కొంచెము కొంచెము మగుపడుచున్న నీసరోవరముమీఁద శ్రమచేత నీరు ద్రాగుటకో యనునట్లు దూరమునుండి నాదృష్టిపడెను. ఈకొలనిలోని యుత్పలకేసరముల నొండొరులకిచ్చుకొనుచు నెడబాటు లేక యుండు కోకదంపతులను భవద్వియోగదుఃఖాతురుఁడ నైననేను జూచి విషాద మొందితిని. పుష్పగుచ్ఛంబు లనియెడు పాలిండ్లచే వంగియున్న తీరాశోకశాఖఁ జూచి నీ వనుకొని భ్రమపడి కౌఁగిటఁజేర్పఁబోఁగా లక్ష్మణుఁడు కన్నీళ్ళతో నన్ను నివారించెను ఈ విమానమునకుఁ గట్టఁబడియున్న బంగరుచిఱుగంటలమ్రోఁత విని గోదావరీ సారస పక్షులు నిన్నెదుర్కొనుటకో యనునట్లు మన కభిముఖముగా వచ్చుచున్నవి చూడు. నీవుసన్నని నడుముగలదానవయ్యు నెంతో శ్రమపడి కడవలతో నీళ్ళుపోసి పెంచిన మామిడిగున్నలు కలిగినట్టియుఁ గను లెత్తి పైకిఁ జూచుచున్న మృగములు గలిగినట్టియును, నీపంచవటిని చిరకాలమునకుఁ జూచుటచే నా కెంతో యాహ్లాదము కలుగుచున్నది. సుందరీ! యిదిగో గౌతమీతీరము. ఇచ్చట నొకనాఁడు నేను వేటమాని యీ నదీతరంగవాయువులచే నాయాసము బోఁగొట్టుకొని పబ్బలిఁగలయింటనుంటిఁగా నీ తొడపయిఁ దలపెట్టుకొని నేను పరుండిన మాట యిప్పుడు జ్ఞప్తికివచ్చినది. ఎవఁడు భ్రూభేదమాత్రమున నింద్రపదవినుండి నహుషునిఁ బరిభ్రష్టుం జేసెనో యెవ్వని రాకవలన మలినజలము పరిశుద్ధమగునో యట్టిమహాముని కీస్థాన మాశ్రమపదమునుమీ!

ఆయగస్త్యమహాముని వేల్పఁగా హవ్యగంధముతో శ్రేతాగ్నిధూమము లభ్రయా
నంబు నాటుంటు జేసి వాని నాఘ్రాణించి నేను రజోగుణవిముక్తుఁడనై సత్త్వప్రధాను
డ నగుచున్నాను. సుందరీ! యిది పంచాప్సరం బనుకొలను. శాతకర్ణిఁ డిందు జలక్రీ
డ సేయుచుండును. దీనిచుట్టును వనము లుండుటచే నిదిమబ్బులనడిమిచందమామవలె
మన్నది. ఆశాతకర్ణిఁడు పూర్వము లేతదర్భలె తిని లేళ్ళతోఁ గలిసి మిక్కిలి నియ
మవంతుఁడై యీయడవిలో నుండనతనితపో మహిమకు వెఱచి యింద్రుఁడు తపోభంగ
ముగావింప నైదుగు రచ్చరల నంపెను. ఆముని మహాతపము మఱచిపోయి యౌవనజ
ముఖులజవ్వన బనువలలోఁ జిక్కెను. ఆసరోవరమధ్యమ దున్నమేడలో నుండి
యాతనిసంగీతమృదంగరవ మాకాశ మంత మనపుష్పకముయొక్క చంద్రశాలలోఁ
బ్రతిధ్వని సేయుచున్నది. ఇతఁడు మఱియొకమహాముని జితేంద్రియుఁడు ఇతనిపేరు
సుతీక్ష్ణుఁడు. నాలుగుప్రక్కల నాల్గగ్నిహోత్రములు వెలుఁగ నీతఁడు నడుమ
నిలిచి సూర్యుఁ డైదవయగ్నియై మొగముఁ గాల్ప ఘోరతపము సేయుచున్నాఁడు.
ఈయనను గూడ మహేంద్రుఁడు శంకించి యచ్చరల నంపెనుగాని వారిమందహాస
విలసితకటాక్షవీక్షణములుగాని మిషఁ జూపినమేఖలలు మొదలగు నలంకారములు
గాని తదితరవిలాసములుగాని యామహాత్ముని చలింపఁ జేయఁ జాలకపోయెను.. అక్ష
మాలయనుకడియము గలిగి దర్భలు గోయుటకును జింకలను గోకుటకును నలవడిన
దక్షిణహస్తమునితఁడు మనల సత్కరించుటకు చాచుచున్నాఁడు చూడు! ఈమహాముని
మాటలాడఁ గూడ దనునియమము ధరియించుటచేత నానమస్కారము దలయూఁ
చుటచేతమాత్రమే స్వీకరించెను. సూర్యునివంక జూచుచున్న యీమహాత్మునకు
మన విమానము క్షణకాల మడ్డమయ్యెను. విమానము తొలఁగినతోడనే యతఁడు
మరల సూర్యునివంకఁ జూచుచున్నాఁడు ఇదిపావనమైనశరభంగమౌనితపోవనము.
అతఁడాహితాగ్ని, ఆర్తావనపరుఁడు. ఈతఁడు చిరకాలము సమిధలతోడనే యగ్ని
నర్చించి యర్చించి యెట్టకేలకు మంత్రపూతమైనశరీరమునే యాహుతి చేసెను.
ఆమహాముని గతించినను నీయాశ్రమంబున నతనిబిడ్డ లనిచెప్పఁ దగినయీవృక్షముల
యందతిథిసత్కారము నిలిచి యున్నది. ఎట్లన నీవృక్షములు తమనీడలచేత బాటసా
రులశ్రమ నడంచి తినుటకు బక్వఫలముల నిచ్చి యాదరించుచున్నవి. ఇది చిత్ర
కూటము. ఈపర్వతము నాదృష్టికి వృషభమువలెఁ గనఁబడి సంతోషము గలిగించుచు
న్నది. ఎట్లంటివేని గుహాముఖము. జలధారాస్వనములంకె వేయుట. శృంగములె
కొమ్ములు. శిఖరములయందున్న మేఘములె పోరాటమువలనఁ గలిగినమన్ను. ఈశై
లసమీపమందుఁ బ్రవహించుచున్న మందాకినీనదినిఁ జూడుము దూరమునుండి మనము

చూచుటచే మిక్కిలి సన్నమై వసుంధరాదేవి మెడ నిడుకొన్న ముత్యాలసరమువలె నలరుచున్నది. ఈపర్వతముచుట్టును బరిమళించుచున్న తమాలవృక్షములచిగుళ్ళతోనీకు నేనవతంసముఁ గల్పించితిని. ఇది యత్రిమహామునితపోవనము ఇందు వృక్షములు పువ్వులు లేకయే పండుచుండును. మృగములుమచ్చికపడినిర్భయముగ సంచరించుచుండు. త్రిలోచనుని తలమీఁదిపూలదండయై సప్తమహర్షులకు బంగారుతామర పువ్వుల నిచ్చునీయాకాశగంగను నీపాత్రివ్రతములయందు నుండుమహర్షులస్నానములనిమిత్తమై మనసూయామహాదేవి యీపరిసరంబులఁ బ్రవహింపఁ జేయుచున్నది. ఈయాశ్రమమున నునయీచెట్లను జూడుము! గాలి లేకుండుటఁ జేసి కదలక యరుగులమీఁద నిలిచి పరమయోగాధిరూఢులై యచలాసనంబులఁ గల్పించుకొని తూఁగుచున్న మహామునులవలె నున్నవి. పూర్వము నీచేతఁ బరిచర్యల నందుకొన్న నీమఱ్ఱిచెట్టునుజూడుము. దీనికి శ్యామ యనిపేరుగదా! ఎఱ్ఱనిపండ్లతోడను బచ్చనియాకులతోడను నిండి యీచెట్టు పద్మరాగములతోఁగూడినగండపచ్చలరాశివలె నున్నది. ఓకల్యాణీ! యమునానదీజలంబులంగూడి పాఱుచున్న యీగంగానదిని జూడుము! ఇంద్రనీలమాణిక్యములతోఁ గలిసినముత్యాలసర మట్లొక్కచోట, నల్లకలువరేకులునడుమనడుమ గల తెల్లతామరపూదండవలె నొక్కయెడ, నల్లయంచలతోఁగూడిన రాజమరాళపఙ్క్తివలె నొక్కచోట, కృష్ణాగరుపత్రములు నడుమనడుమఁగలమంచిగంధపుపూతవలెనింకొక్కచోట, నడుమనడుమ చెట్లనీడలుగల వన్నెలవగిది నింకొకచోట, నడుమసందులలోనుండినల్లనియాకాశ మగపడుచుండునట్లు వ్యాపించెడుశరత్కాల మేఘమండలమువలెనొకచోట, తెల్లనిబూడిదెపూతమీఁదఁ బ్రాకుచున్న నల్లత్రాచులుగల శంకరునిశరీరమట్లొకచోట వెలయుచున్నది. గంగయు యమునయుఁ గలియుచున్నయీచోట స్నానముచేసిన పుణ్యాత్ములు తత్వము తెలియనివారైనను బునర్జన్మము నొందక శాశ్వతముక్తిఁ బడయుదురు. ఇది నిషాదాధిపతియైనగుహునిగ్రామము. ఇచ్చట నేను మౌళిమణిని దీసి జడలు దాల్పనన్నుఁ జూచి మంత్రియైన సుమంత్రుడు దుఃఖము బట్టలేక "కైకేయి! నీకోరికలు పండెన"వని యేడ్చెను. కల్యాణీ! ఇది సరయూనది యక్షకాంతలు జలక్రీడ సేయుచుండుసరము దీనిజన్మభూమి యని పెద్దలుచెప్పుదురు ఇదిరాజధానియగునయోధ్యనంటి ప్రవహించుచున్నది. దీనిరెండుగట్లమీఁద నశ్వమేధసంబంధములయిన యూపస్తంభములు గలవు. ఇక్ష్వాకువంశస్థులిచ్చట వాజిమేధములు సలిపి యీనదిలో నవభృథస్నానము జేయుటచేసి యీనది మిక్కిలి పవిత్రమైనది.

ఈనదీమతల్లి యొక్క పయఃప్రపూరము కడుపారఁ ద్రావి దీనిసైకతము లనియెడు నుత్సంగముల నుత్తరకోసలప్రభువులెల్ల నధివసించుటచేత నిదియారాజుల నెల్ల సమానముగాఁ బెంచినదాన యని తలంచెను. పూజ్యుఁడైన దశరథమహారాజును బాసినమాతల్లి వలెనె నీసరయూనది చల్లగాలిని వెదజల్లు తరంగహస్తములతో దూరమునుండియె ప్రేమాతిశయమున నన్నుఁ గౌఁగిలించుకొనుచున్నట్టు లున్నది. అల్లదె యెట్టయెదుట భూరజము సంజకెంజాయపగిది నెఱ్ఱగా లేచుచున్నది. హనుమంతుఁడు నారాక దెలుపుటంజేసి నన్నెదుర్కొనుటకు సైన్యసహితుఁడయి భరతుఁడు తోతెంచుచున్నాఁడని తలఁచెదను. నేను ఖరదూషణాదులం జంపి మరలి వచ్చినప్పుడు శ్రద్ధతో సంరక్షించి నిన్ను నాకు లక్ష్మణుఁ డర్పించినటులు పితృవాక్యపరిపాలకుఁడనైన ప్రతిజ్ఞ సంపూర్తిఁ జేసిననాకుఁ బరమసాధు వైనభరతుఁడు రాజ్య మర్పించును. అదె వల్కలములు ధరించి చేత నర్ఘ్యము గ్రహించి గురువుల ముందిడుకొని వృద్ధులైనయామహాత్ములు, సైన్యము వెంటరా భరతుఁడు పాదచారియయి నానిమిత్తము వచ్చుచున్నాఁడు తండ్రి రాజ్యలక్ష్మిని దనకిచ్చినను నది తనతోడ మీఁద నున్నను నాయందలి గౌరవముచేత నీతఁడు పదుచువాఁడయ్యు దాని ననుభవింపక యిన్నిసంవత్సరములు దానితోఁగూడి యసిధారావ్రతమును సలుపుచున్నటులు గనఁబడుచున్నాఁడు. ఇటులు వచియించుచు రాముఁడు విమానమునుండి నేలకుఁదిగఁ దలఁచెను. అతని తలఁపెఱిఁగి విమానాధిదేవత భరతునివెంటనున్న మునులు ప్రకృతిజనులు విస్మయమొంద నక్షత్రపథమునుండి విమానము క్రిందికి దింపెను.

అంతట రాముఁడు విమానమును దిగెను. విభీషణుఁడు ముందు నడచి స్ఫటికశిలానిర్మితసోపానములుగలమార్గమును జూపెను. సుగ్రీవుని చేయి బట్టుకొని రాముఁ డామార్గమున నడచిపోయి ముందుగా నిక్ష్వాకుకులగురుఁడగు వసిష్ఠునకు నమస్కరించి యర్ఘ్యమందుకొని భరతునిఁ గౌఁగిలించుకొని తండ్రి యొసగినరాజ్యాభిషేకము దననిమిత్తమై నిరాకరించిన యాతనిశిరమును దనకన్నీట నభిషేకము జేసి మూర్కొనెను, గడ్డములు మీసములు పొడవుగాఁ బెంచుకొని పెద్దయూడలతో నున్నజువ్విచెట్లవలె నున్న వృద్ధమంత్రులు వినయముతో నమస్కరింప నందుకొని రాఘవుఁడు మంజుభాషణములతో వారి నాదరించి కుశలమరసి "యితఁడు మనప్రియమిత్రుఁడు, వానరభల్లూకముల కధీశ్వరుఁడు సుగ్రీవుఁడు, ఇతఁడు మహాసమరవీరుఁడు విభీషణుఁ" డని యెఱిఁగింప భరతుఁడు వారికిఁగూడ నతివినయముతో నమస్కరించెను అనంతరము లక్ష్మణుఁడు నమస్కరింప నాశీర్వదించి మేఘనాదప్రహారణములచేతఁ గడుకర్కశమైనయాతనివిశాలవక్షస్స్థలము నొచ్చునటులుగా

ఘాలింగనము జేసెను. అంతట రాఘవుని యాజ్ఞచే వానరనాయకులు మనుష్యరూపము దాల్చి మదధారలు స్రవించు నాముటేనుగులపై నెక్కి మహాపర్వతములమీద నెక్కినప్పుడు గల్గుసుఖ మనుభవించిరి.

రాఘవుని యానతని రాక్షసరాజగు విభీషణుండు సపరివారముగ దశరథరాజనందనుఁ దర్పించినరథముల నధిష్ఠించెను. అత్యంతమాయావిలాసముల నలరారుచున్నను తమరథము లీరథములముందఁ బనికిరావని యతఁడు తలంచెను. సాయంకాలమున మిగులఁ జంచలములైన మెఱుపులుగల మేఘమండలముమీఁద బుధగురులంగూడి చంద్రుఁ డెక్కినట్లు రాముఁడు సోదరసహితుఁడై కామరూపములుగల ధ్వజములతోఁ బ్రకాశించు పుష్పకవిమానమును మరల నెక్కెను. ఆదివరాహమూర్తి ప్రళయపయోధినుండి వసుంధరను గ్రహించినట్లును, శరదృతువు మేఘమండలము నూడి చంద్రికలను గ్రహించినట్లును, రాముఁడు దశకంధరునిబారినుండి యేదేవిని రక్షించెనో యావిదేహరాజనందనకు భరతుఁడు నమస్కరించెను. తన్ను వరింపుమని పలుతెరంగుల వేఁడుకొన్న రావణుని నిరాకరించి జగంబులకెల్ల వంద్యములైన జానకీదేవిపాదములు పూజ్యుఁడైన రామునివలె జడలు ధరించిన భరతునిశిరమును గలిసి కొని యన్యోన్యపావనము లయ్యెను.

అట్లు ప్రకృతిజనపురస్సరముగా నర్ధక్రోశదూర మరిగి రాఘవుఁడు తననిమిత్తము శత్రుఘ్నుఁడు సిద్ధము చేయించిన పటకుటీరములు కలిగి మిక్కిలి సొగసగు నయోధ్యాపుర బాహ్యోద్యానమును ప్రవేశించి యందు వసియించెను.

ప్రాపుగానుండుచెట్టు తెగుటచే నిరాలంబములైనతీఁగలతెఱగునభర్తృవియోగముచే నార్తిఁ జెందియున్నతల్లులను రామలక్ష్మణులారామమందుఁ జూచిరి. శత్రుసంహారణకృతకృత్యులై శౌర్యరాసులగు పుత్రులిరువురు తమతల్లులకు నమస్కారము జేసిరి. బాష్పధారలచే తల్లులకన్నులకుఁ బుత్రులు కనఁబడక దేహసంస్పర్శసుఖముచేత మాత్రము కనఁబడిరి. హిమవత్పర్వతమందలి మంచు కఱఁగి చల్లనినీరై ప్రవహించి, యుష్ణతప్తములగు గంగాసరయూజలములను జల్లబరచునట్లు శోకజనితములై మొదల స్రవించినవేఁడికన్నీళ్ళను పిదప జనించిన యానందబాష్పములు చల్లబరపెను. కొడుకులం గౌఁగిలించుకొనినతోడనే తల్లులకు మున్ను రాక్షసులశస్త్రములచేతఁ గుమారులశరీరములయం దైనవ్రణములు పచ్చిపుండ్లుగఁ గనఁబడెను. వీరమాతలు కావలెనని క్షత్రియాంగనలు కోరెడుకోరికలు తమయెడ సఫలములైనవని వారు సంతోషించిరి. ప్రాణనాధునకు మిక్కిలి కష్టముఁ గూర్చిన పాపచరిత్రను సీతను నేనని తనపేరు చెప్పుకొనుచు జానకి, భర్తృవియోగదుఃఖితలైన యత్తలకు

నమభక్తితో నమస్కారము చేసెను. అమ్మాయి! లెమ్ము. నీపవిత్రచరిత్రమే కదా తమ్మునితో గూడ రాముని దుఃఖమునుండి సముద్ధరించె ననుచు వారు ప్రియోక్తులు పలికి కోడలిని లాలించిరి. మొట్టమొదటఁ దల్లుల యానందబాష్పాభిషేచన మైన పిదప వృద్ధమంత్రులు హేమకుంభములఁ బుణ్యజలంబులఁ దెచ్చి రఘువంశప్రదీప కునకు మహావైభవముతోఁ బట్టాభిషేకము జేసిరి. వానరవీరులును దానవవీరులును దిగంతముల కరిగి తెచ్చిననదీసముద్రసరోవర జలములు వింధ్యపర్వతముమీఁద మేఘ ములు మహావృష్టిగురిసినవిధంబున రామునిశిరంబునం గురిసెను. పూర్వము తపస్వి వేషము దాల్చినపుడె యెంతో రమణీయమైయుండిన రామునియాకృతికి మహారాజా లంకారము పునరుక్తదోష మయ్యెను. మంగళతూర్యారావంబులఁ బ్రజ లెల్ల మహా నందభరితులు గాఁగఁ దోరణంబులు గట్టినమేడలమీఁదనుండి లాజవర్షములు గురియ రాఘవుఁడు మంత్రులతోడను దనుజవానరవీరులతోడను రాజధానిం బ్రవేశించెను. భరతుండు ఛత్రముఁ బట్ట లక్ష్మణశత్రుఘ్నులు చామరంబులు వీవ రథస్థుఁడైన రా ముఁడు చతుస్పాయనసమన్వితుఁడైనటుల దోఁచెను. శ్వశ్రుజనము చేత చేయఁబడిన యలంకారము గలిగి, కర్ణీరథ మెక్కి సీతాదేవి చనుచుండఁ బౌరకాంతలు మేడల కిటికీలలోనుంచి చేతులు జోడించి నమస్కరించిరి. సీత తాను శుద్ధచరిత నని ప్రజలకుఁ దెలుపుటకు భర్తృనానతి నగ్నిలోఁ బ్రవేశించి మెఱసినటులవనమునఁ దనకనసూయ ప్రసాదించినయంగరాగమును దాల్చి మిక్కిలి శోభిల్లెను. అంతట రాముఁడు తనమిత్రు లను సమస్తోపకరణములుగల గృహములయందు నిలిపి పూజాద్రవ్యములుగలిగి, జన కునియాలేఖ్యమునుగలిగి యున్నగదిని బాష్పాకులితలోచనుఁడై ప్రవేశించెను. ప్రవే శించి యచ్చటనున్న కైకేయిం జూచి నమస్కరించి "అమ్మా! స్వర్గపథమిచ్చు సత్య వ్రతమునుండి జారకుండ నాజనకుఁడు నీవలనఁగాదె కృతార్థుఁడయ్యె" నని ప్రశం సించి తన్నుఁ జూడ శంకించుచున్న యాదేవిలజ్జం బాపెను. సంకల్పమాత్రము చేతనె యభీష్టసిద్ధి బడయఁగల వానరదానవీరుల మనస్సులు విస్మయోద్భ్రాంతము లగు నటుల రాఘవుఁడు బహువస్తువులు వారికి కానికలు కట్నములుగానిచ్చెను. పట్టాభి షిక్తుఁడైనరాముని సందర్శించుటకు మహామును లనేకులు వచ్చి యతనిం బొగడిరి. తనవిజయమునకు వన్నెబెట్టినట్టి వైరివీరులజన్మవృత్తాంతాదులను రాముఁడాసంయ మువలన వినెను. ఆజడదారులెల్ల జనినపిదప రాముఁడు సౌఖ్యవంతుఁడై దినములు గడచుచే యుండఁగ సీతాదేవి యిచ్చునట్టిపరిచర్యల నంది మహానందము నొందు చున్నకపిరాక్షసవీరులను వారివారి స్వస్థలముల కంపెను. పుర్వవలె రావణునిప్రాణ ములతోఁగూడ హరింపబడినట్టియుఁ దలంచినమాత్రమున నె వచ్చునట్టియుఁ బుష్పక

విమానము పూర్వము కుబేరుని దౌటచే రాముఁడు వెండియు దానిని యక్షనాయ
కుని యొద్దకుఁ బంపెను. అటుల జనకునానతి వనవాసవ్రతముఁ గడపి మరల నయో
ధ్యకు వచ్చి పట్టాభిషిక్తుఁడై రాముఁడు ధర్మార్థకామములయందుపలెనే ముప్వురు
తమ్ములయందును సమానప్రీతిఁ జూపెను. షణ్ముఖములతో సమానముగా జనుఁబ్రాలు
ద్రావనిచ్చినకృత్తికలయెడలఁ గుమారస్వామియుంబోలె రాఘవుఁడు ముప్వురుతల్లుల
యెడలను సమానప్రతిపత్తి గలిగి యుండెను. అతఁడు దానశీలుఁ డగుటచేఁ బ్రకృతి
జను లెల్ల ధనవంతు లైరి. విఘ్నములు దొలఁగించుటచేత సత్కార్యనిష్ఠితు లైరి.
రక్షకుఁ డగుటచేఁ దండ్రిగలవా రైరి. సంతాపహరుఁ డౌటచేఁ బుత్రవంతు లైరి.
తగినకాలమునందే పౌరులకార్యములనెల్ల గనిపెట్టి తీర్చి యారఘుకులప్రదీపకుఁడు
తనతోఁ గ్రీడించుటకు భూలోకమ దవతరించిన మహాలక్ష్మియో యనునటుల వెల
యుచున్న సీతాదేవినిఁ గూడి యథేచ్ఛముగ విహరించెను.

యథేచ్ఛముగా నింద్రియసుఖము లనుభవించుచు నాదంపతులు చిత్రపటము
లుగల గృహములయందు విహరించునపుడు దండకారణ్యములయం దనుభవించిన
దుఃఖములనెల్ల వాసుమరచిరి. అంతట సీతాదేవి గర్భవతియయ్యెను. మిక్కిలిస్నిగ్ధము
లైనకన్నులు తెల్లుపువ్వులవంటి తెల్లనిమేను మొదలగు చిహ్నములే యామెగర్భవతి
యైనట్లు చెప్పక చెప్పెను. అప్రియామెలనాగమూర్తి రామునకత్యానందకరమయ్యెను.
మిక్కిలికృశించి సిగ్గుపెంపునఁ దనకోరికలం జెప్పకయున్న ప్రియురాలిం దొడపైఁ
గూర్చుండఁబెట్టికొని నీ కేమికావలె నని యతఁడు బుజ్జగించి యడిగెను. ఎచ్చోట
నిడినబలులను గ్రూరమృగములు భక్షింపవో యెచ్చోట మునికన్యలతోడ మైత్రికలు
గునో యచ్చట దర్భలు విశేషముగాఁ బెరుగునో యట్టిగంగాతీరంబుననుండు తపో
వంబునకు మరల నొకసారి యరుగఁ దనకుఁ గోరిక కలదని యామె భర్తకు విన్న
వించెను. ఆప్రియురాలికోరికదీర్ప ననుమతించి రఘుపుంగవుఁడు తనపరిపాలనము
చేత సంతోషించుచున్న యయోధ్యానగరమును జూడవలయునని యనుచరులంగూడి
మేడ నెక్కెను. జనసమూహము చేత నరికట్టఁబడినరాజమార్గముఁ జూచి, నావలతోఁ
గ్రిక్కిరిసిన సరయూనదిని జూచి ప్రియురాండ్రతోఁ గూడి ప్రియులు విహరించు
నట్టి యుద్యానవనములుజూచి యానృపాలమౌళి మిక్కిలి సంతోషించి భద్రుఁడను
యొడు సేవకునిం బిలిచి ఓరీ నానడతంగూర్చి ప్రజ లేమిచెప్పుచుకొనుచున్నారురా,
యని యడిగెను. అడుగుటయు భద్రుండు మొదట నుత్తర మీయక రాఘవుండు
నిర్బంధము చేసి యడిగినమీఁదట నతఁ డిటుల సర్వముఁ దెలిపెను. "దేవా! ప్రజ
లన్నివిషయముల దేవరవారిని స్తవము సేయుచున్నారుగాని రక్కసునియింటనుం డి

వచ్చినదేవిని మరలఁ దెచ్చికొనుటమాత్రము సరిగా లే" దని యనుకొనుచున్నారు. ప్రియురాలిపైఁబడిన యపనిందను వినినతోడనే సమ్మెటపెట్టుచేత నెఱ్ఱగాఁ గాలిన లోహము వ్రయ్యినట్లు రాముని హృదయము వ్రయ్యలయ్యెను. నాపైఁ బడినయీ యపవాదము నుపేక్షించుట మంచిదా, లేక పూతచరిత్రయైనసీతను విడుచుట మంచిదా యని రాఘవుని మనసు యుయ్యాలవలె నొకయెడ నిలువక విచారాధీనమై చలింపఁ జొచ్చెను. ప్రియురాలిని విడువకపోయినపక్షమున నపనింద పోవదని యామెను విడిచి యాయశఃకాముఁ డపకీర్తిని బాపుకొనఁ దలంచెను. కీర్తికాములకు దేహములకంటె యశమే ప్రధానమగుచుండ నింక నింద్రియార్థములమాట వేఱె చెప్పనేల? అట్లు నిశ్చయించి రాముఁడు కడుంగడు నెవ్వగఁగూరితన్నుఁజూచి విచారమనస్కులగుతమ్ములం గని యిట్లనియె.

"మబ్బుమీఁద గాలిచేత నద్దము మలినమైనట్లు పరమపావనమైన సూర్యుఁడు వంశకర్తగాఁగల యిక్ష్వాకువంశము నావలన నెట్లు కలంకమైనదో చూడుఁడు. మదపుటేనుఁగు కంబమునకుఁ గట్టువడుట కిచ్చగించనట్లు నే నీయపవాదమును సహింపఁ జాలను. నీటియలలమీఁద బడిననూనెబొట్టు వ్యాపించినతెరఁగున నీనింద నత్వరముగాఁ బ్రజలయందు వ్యాపించుచున్నది. తండ్రి యానతిచేత మున్ను సముద్రమేఖలయగువసుంధరను విడిచినట్లు నింద బాయుటకై నిందుచులాలైనను విదేహరాజనందనను విడువ నిశ్చయించితిని. దేవి పావనచరిత్ర యని నే నెఱుఁగుదును. ఐనను లోకాపవాదము మిక్కిలి గొప్పదికావునఁ బరిత్యజింపవలయు. భూమియొక్క నీడ సోఁకినంతమాత్రమునఁ బరిశుద్ధుఁ డైనసోముఁడు మలినుఁ డగుట మనము చూచుచుండుటలేదా. రావణసంహారము పగదీర్చుకొనుటకై నేను చేసితినిగాని నా ప్రయాణమువ్యర్థము గాదు పాము తన్నుఁ దొక్కినవారిపైఁ బగఁ దీర్చికొనుటకుఁ గఱచును గాని రక్తమును ద్రావుటకుఁ గఱచునా? అపనింద యనుశల్యమును బాసి నేను సుఖముగఁ జిరకాలము జీవింపవలెనని మీరుకోరుదురేని దయామయులై నేను చేసినయీనిశ్చయమును మీరనుమతింపుఁడు ,,ఇట్లు జనకరాజపుత్రికను గూర్చి పరుషవాక్యంబులు పలికినయగ్రసోదరుని నిశ్చయము నిషేధించుటకుఁ గాని యనుసరించుటకుఁగాని చాలక యనుజులు సందిగ్ధమనస్కులైరి. జగద్గేయకీర్తియు, సూనృ వ్రతానుష్ఠానపరుఁడు నగురామచంద్రుఁడు తనయాజ్ఞానువర్తియగు లక్ష్మణుంజూచి "సౌమ్యా, యని పిలిచి రహస్యమున నతని కిట్లనియె. "చూలా లయినయాదేవి ని కోరికలు కోరుమని నేనడిగినప్పుడు తపోవనంబులఁగొంతకాలముండవలెనని కోరెను.

కాఁబట్టి యాసేవము వెట్టె యాపెను రథ మెక్కించి తోడ్కొనిపోయి వాల్మీకిమహాముని యాశ్రమంబుఁ జేర్చిరమ్ము." "జనకుని యాజ్ఞ పాలించి భార్గవరాముఁడు శత్రువును సంహరించినట్టు తల్లిఁ దెగటార్చె" నన్నకథ వినియున్నవాఁడు కావున లక్ష్మణుఁడు సోదరుని యాజ్ఞ శిరసావహించెను. పెద్దలయాజ్ఞ మీఱఁగూడదుగదా! అనుకూలమైన యావార్త విని జానకి మిగుల సంతోషించి పయన మయ్యెను. సుమంత్రుఁడు బెదరని గుఱ్ఱములఁబూన్చి యరద మాయత్తము చేయ లక్ష్మణుఁడు సీతాదేవి నందిడుకొని వెడలెను. మార్గమధ్యమున రమణీయములగు వస్తువు లెన్నో కనఁబడుచుండ నవి చూచి వైదేహి ఆహా! నాభర్త మిక్కిలి మంచివాడు: నాకోర్కెల దీర్చుచున్నాఁడని యానందించెనేగాని కల్పవృక్షము ఖడ్గపత్రవృక్షమైన దని యామె తెలిసికొనకపోయెను. అప్పుడు సీతాదేవికి కుడికన్నదరెను. ఆదుర్నిమిత్తమునఁ బట్టి లక్ష్మణుఁడు చెప్పకపోయినను తన కేదో కీడు మూఁడ దలచుకొన్నదని యామె శంకించెను.

ఆదుర్నిమిత్తమువలనఁ గలిగిన విషాదంబున వైదేహి రాజనందన వాఁడిన ముఖారవిందము గలదై యనుజసమేతముగాఁ దనభర్తకు మంగళ మగుఁగాక యని ప్రార్థించెను. సోదరుని యాజ్ఞ నతిక్రమింపక జానకిని నట్టడవిలో లక్ష్మణుఁడు విడిచిపెట్టి వచ్చుట జూచిఁ గంగాదేవి తనతరంగము లనియెడు హస్తములతో వద్దు వద్దని నివారించుచున్నదో యనునటులు కెరటము లెత్తుగ లేచెను. సారథి గుఱ్ఱముల నిలిపి యరదంబు నావ సత్యసంధుఁడైన లక్ష్మణుఁడు వదినెను నిసుకతిన్నియపై దింపి మెల్లగా నిషాదుని నావ నెక్కించి తనప్రతిజ్ఞను దాఁటినట్లే గంగను దాటెను. బాష్పరోధముచేఁ దనకంఠము గద్గదము కాఁగ మెల్లగా గొంతు సవరించుకొని సౌమిత్రి ప్రళయకాలమేఘము శిలావృష్టి కురియుచందమున రామశాసనము వెడలఁగ్రక్కెను, పరాభవం బనెడు వాయువుచేత నిహతమయినధరణీతనయ మణిభూషణంబు లనియెడు పువ్వులు రాలునటులు తనయంగములకు మూలమయిన ధాత్రిమీఁద లతవలెఁ గూలబడెనుఁ. "అమ్మా! నీపతి సాధుచరితుఁడు, సుప్రసిద్ధమైన యిక్ష్వాకువంశమునఁ బుట్టినవాఁడు, నిన్నేల నిష్కారణముగ విడుచు', నని సంకించునదివ్రాలె ధాత్రి యామెను వెంటనే తనగర్భమునం జేర్చుకొనలేదు. మూర్ఛలో నున్నంతసే పామె విచార మెఱుఁగదు. మూర్ఛ తెలియగానె యామెను విషాద మావరించెను. మూర్ఛలో నున్నప్పటికంటె సౌమిత్రి యామె నోదార్చి తేర్చినపుడె యామెకుఁ గష్టమెక్కు వయ్యెను. పరమపతివ్రతయు సాధుశీలయు నైనయమ్మహాదేవి నిర్దోషిరాలైనతన్ను విడిచినందుకు భర్తను దూషింపక నేను దుష్టురాలను దుఃఖమనుభవించుటకే పు

ట్టితినని తన్నుతానే నిందించుకొనెను. సౌమిత్రి యాయిల్లాలి నోదార్చి వాల్మీకియాశ్ర
మమునకు దారిజూపి 'అమ్మా! నేను స్వామియానతిని నింతదుష్కార్యము చేయవలసె.
నన్ను క్షమింపవే' యని పాదములపైఁ బడి యేడ్చెను. జానకి యతనిని లేవనెత్తి
ప్రీతి నిట్లనియె 'వత్సా! లక్ష్మణ! నీవినయమునకు నేను ప్రీతురాలనైతిని. చిరంజీవివి
కమ్ము! ఉపేంద్రుఁడు మహేంద్రునియాజ్ఞ చెల్లించినటులు నీవు నీయన్న యాజ్ఞ
చెల్లించుము. అత్తలకుమువ్వురకు నానమస్కారములు దెల్పుము. నాగర్భముననున్న
బిడ్డను నాయనంతరము పెంచుకొమ్మని చెప్పుము. జనరంజకులైన మీయన్నగారితో
నాపలుకులుగా నిటులు విన్నవింపుము. నాడు మీరు కనులారఁ గనుచుండ నగ్నిప్రవే
శము చేసి పరిశుద్ధురాలనని యెల్లలోకముల కెఱుంగఁజేసితినిగదా! అట్టినన్ను లోకుల
మాటలు పాటిచేసి విడుచుట మీకులధర్మములకుం దగినపనియా?' యెల్లప్పుడు కల్యా
ణమె చేయఁదలఁచునట్టిమీరు నాకుఁ గీడుసేయవలెననుతలంపుతో నిటులు చేయరు.
పూర్వజన్మకృతమయిన నాపాప మిటులు వజ్రపాతముగఁ బరిణమించియుండవచ్చును
మున్ను మిమ్ము వరించిన రాజ్యలక్ష్మిని నిరాకరించి నన్నుఁగూడి యరణ్యములకరిగితిరి.
అయినను నేడు రాజ్యలక్ష్మి నన్ను మీయింటనుండి వెడలఁగొట్టి పగఁదీర్చుకొనఁ
బోలును. తమభర్తలు రాక్షసపీడలు పొందినప్పుడు మునిపత్నులు వచ్చి నాకడ మొఱ
లుపెట్ట నేను వారిదైన్యము మీకు విన్నవించి రక్కసులఁ జంపించి వారికానందము
మున్ను గల్గించితిని. మీరు దేదీప్యమానులై వెలయుచుండ నన్ను రక్షింపు మని
నేనితరుల నెటుల శరణార్థినై వేడుకొందును? నిండుచూలాల నౌటచేతగాని లేనియె
డల నీవియోగముచేత నిష్ఫలమైన యీజీవితమును నే నీపాటికే విడిచియుందును.
ప్రసవించినతరువాత నేను సూర్యమండలమందు దృష్టి నిలిపి తపోయోగంబునఁ
బ్రాణంబు విడిచెను. ఎడబాటు లేకుండ మఱియొకజన్మంబునందైన మహాత్మా! నీవె నా
భర్తవుకమ్ము. వర్ణాశ్రమపరిపాలనము రాజులకు విధియని మనువు శాసించెను. న
న్ను విడిచిపెట్టినను మునులతోడిపాటు నన్నుఁగూడ రక్షించుట మీయన్నగారి విధి
యని మనవిచేయుము.'' అని విలపింప యత్నైచేయుదు నని రామానుజుఁ డామెను
వీడ్కొని క్రమక్రమంబునఁ గంటికి దూర మగుటయు, నామె భయాకులితచిత్తయై
లకుముకిపెంటివ్రాలె నేడ్చెను. ఆరోదనధ్వనులు వన మంతయు నిండె. ఆయార్తనా
దము విని నెమిళ్ళు నృత్యములుమానెను. వృక్షములు పూవులు జార విడిచెను.
లేళ్ళు సగముసగము తిన్నదర్భలు తినక నేలఁబాలువైచెను. తొల్లి కిరాతుఁడొకఁడు
రెండుపులుగులలో మగపులుఁగును జంపినప్పు డాఁడుపులుఁగు యొక్కయార్తి విని
శోకించి యెవ్వఁడు తత్క్షణమె మహాకవి యయ్యెనో యట్టివాల్మీకిమహాముని సమిధలు

తెచ్చుటకై బైలుదేఱి యాయాక్రందనధ్వని వచ్చుదారినే పోయెను. అతనిఁ గని యవనితనయ కన్నీరు తుడుచుకొని శోకముడిగి వందనము చేసెను. ఆమెను గర్భవతి నిగా నెఱిఁగి వాల్మీకి సుపుత్రునిఁ గను మని దీవించి వెండియు నిట్లనియె "బిడ్డా ! జనకతనయ! అబద్ధపునిందకు జంకి రాముఁడు నిన్ను నిష్కారణముగ బరిత్యజించె నని తపోమహిమవలన నే నెఱిఁగితిని. నీవు చింతింపవలసినపని లేదు. అత్తవారియిం టనుండి నీవు పుట్టినింటికిఁ జేరితివి. జగత్కంటకుఁడైన దశకంధరునిఁ జంపినవాఁ డైనను గర్వదూరుఁడైనను సత్యవ్రతుండైనను లోకాపవాదమే యాధారముగాఁ జే సికొని పతివ్రతవగు నిన్ను విడనాడినందుకు నాకు రామునిపైఁ గోపమువచ్చుచున్నది. అమ్మా ! యశోధనుఁడైన నీమామ దశరథుఁడు నామిత్రుఁడు. సజ్జనులదోషములైన నడంపఁజాలిన పుణ్యశీలుఁడు నీతండ్రి. నీవో పతివ్రతలలో నగ్రగణ్యురాలవు. అట్టి నీయందు నాకేల జాలి కలుగదు జానకి ! మునులసహవాసముచేత నిచ్చట మృగములు సైతము క్రౌర్యమును విడిచి యుండును. నీకిక్కడ భయము లేదు. నీవి క్కడ సుఖముగాఁ బ్రసవింప వచ్చును. నీసంతతికి క్షత్రియోచితములైన జాతకర్మా దివిధులిచ్చట జరుగును. అమ్మాయి ! యీతమసానదిం జూడుము! దీనిరెండుతటము లమీఁదను మునికుటీరములు గలవు. ఇది పాపములు దొలంచును. ఇందు నీవు స్నానమాడి చల్లని యీయిసుక తిన్నియలమీఁద నీయిష్టదేవతలఁ బూజించితి వేని నీ మనసు ప్రసన్న మగును. నూతనదుఃఖముచేతఁ గుములుచున్న నీకు మాటలయందు మిక్కిలి నేర్పరులైన మునికన్యక లాయాకాలములయందు దొరకునట్టి పుష్పములు పండ్లు మొదలగువానిం దెచ్చి యిచ్చి నిన్ను సంతోష పెట్టుచుందురు. నీబలముకొ లఁది వరోఘటముతో నాశ్రమములోని బాలవృక్షములను నీవు పెంచుచుండుము. అందువలన నీవిప్పటినుండియు శిశుప్రేమ కలిగి శిశుసంరక్షణమునందల వాటుపడు దువు.' అని పలికి దయార్ద్రహృదయుఁడై వాల్మీకి యామెం దోడ్కొని పోయెను. అతనిదయాళుత్వమును వర్ణించుచు జానకి సాయంకాలమునందు వేదికచుట్టు జింక లు పండుకొనునట్టి యాతనిపర్ణశాల కరిగెను. వాల్మీకి యామెం గాంపోయి పితృదే వతలు భుజింపఁగా మిగిలిన చంద్రకళను దర్శి యోషధుల కిచ్చు తెరంగున నామె రాకకై యలరుచున్న మునికన్యకల కప్పగించెను. వాల్మీకి సీత వసియించుటకు గారనూనెదీపము వెలుఁగుచుండినయొక కుటీర మిచ్చి పండుకొనుటకు లేడిచర్మ మి చ్చెను. ఆమె ప్రతిదినము తమసానదిలో జలకమాడుచు నారచీరల గట్టుచు, యథా విధిగా నతిథిసత్కారముఁ జేయుచు, వన్యఫలముల నాహరించి తనువు పోషించుకో నుచుండెను, అంతట లక్ష్మణుఁ డయోధ్య కరిగి యన్న కప్పుడైన జాలి కలుగ వచ్చునని జానకి పడినపరితాప మంతయు సవిస్తరముగాఁ దెల్పెను.

జనాపవాదమునకు భయపడి జానకిని విడిచెను. గాని మనఃపూర్తిగ విడువ వలెనని రామచంద్రుఁడు విడువలేదు గావున సీతావిలాపము తమ్మునివలన విని చంద్రుఁడు పుష్యమాసమందు మంచుగురియునట్లు కన్నుఁగవనుండి బాష్పములు విడిచెను. అనంతరము రాముఁడు రజోగుణవిముక్తమైనమనస్సుతో శోకమునణంచుకొని సకల వర్ణాశ్రమధర్మంబులఁ జక్కఁగ నరయుచు జనులందఱు నమానముగా సుఖ మనుభవించునట్లు భ్రాతృసమేతుఁడై రాజ్యము పరిపాలించెను. అపవాదంబునకు జంకి భార్యను విడిచిన రామునివక్షస్స్థలముమీఁద రాజ్యలక్ష్మి సవతిలేనికాంతివలె భంగములేని సుఖము ననుభవించెను. రాఘవుఁడు సీతను విడిచి మరల వివాహముఁ జేసికొనక సీతాప్రతిమను సహాయము చేసికొని క్రతువులఁ జేసెను. ఆవార్త చెవిని బడినప్పుడు సీత యెంత మనోవేదనముఁ జెందెనో యెవరు చెప్పఁగలరు.

అటుల సీతాపరిత్యాగముఁ జేసి రాఘవుఁడు మున్నీరు మొలనూలుగాఁ గల వసుంధర నొక్కఁతనే యనుభవించెను. లవణుఁ డను రాక్షసుఁ యజ్ఞంబులఁ జెఱుపుచుండుట చేయమునాతీరవాసమునులు రాముఁడావాత్తవనదీక్షాపరతంత్రుఁడనియాతని శరణంబు వేడిరి. రక్షకుఁడు రాముఁ డున్నాఁడుగదా యని యామౌనులు తమతపోమహిమచే రాక్షసుని జంపలేరు. రక్షకులు లేనప్పుడుగదా మహామునులు తమతపోవ్యయము చేయవలసినయవసర ముండును. విఘ్నకారణము దొలఁగించెదనని రాఘవుఁ డామునులలోఁ బ్రతిజ్ఞ చేసెను. ధర్మసంరక్షణార్థమేకదా శార్ఙ్గపాణిధర నవతార మెత్తినది. "ఆదైత్యుని జంపునుపాయము రామునితో జడదారు లిట్లు విన్నవించిరి. "మహాత్మా! ఆదైత్యుని చేత శూలమున్నప్పుడు వాని నెవ్వరు గెలువం జాలరు. శూలము లేనియప్పుడే వానిం దాఁకి గెలువవలయు." శత్రునిగ్రహమువలన వాని పేరు సార్థకము చేయుటకో యన వారికి సేమము నొడఁగూర్ప మని రాఘవుఁడు శత్రుఘ్నున కాజ్ఞ యిడెను. రఘువంశమం దుఁ బుట్టినప్రతిమనుష్యుఁడును విశేషసూత్రము సామాన్యసూత్రమును బాధించినటుల బరంతపుఁడై యుండును. అగ్రజునియాశీర్వాదములంది దాశరథి రథ మెక్కి పుష్పసౌరభములు వెదఁజల్లువృక్షములుగల వనస్థలులఁ గన్గొనుచు వెడలెను. అధ్యయన మనునర్థమిచ్చెడు ధాతువున కధిశబ్దము పూర్వమం దున్నయట్లు రామునియాజ్ఞాప్రకారము యతనివెంట వెడలినసేన నిరర్థకమయ్యెను. సూర్యునిరథమునకు ముందు వాలఖిల్యాది మహర్షులు పోవునటుల వాని యరదంబునకు ముందు మార్గంబుఁ జూపుచు మహామునులు నడువ వానివెనుక నతఁడు భాస్కరుం డటుల పైనము జేసెను. అటుల పయనమయి పోవుచు సుమిత్రానందనుండు తనరథఘోషము విని మెడలెత్తి చూచునట్టి మృగంబులు గలిగి దారిలో

నున్న వాల్మీకిమహాముని యాశ్రమంబుంజేరెను. తపఃప్రభావము చేత సిద్ధించిన విశేష ప్రతిపత్తులతో వాల్మీకిమహాముని యలసినగుఱ్ఱములుగల యారఘుకుమారుని సమాదరించెను. ఆనాటిరాత్రియే గర్భవతియైన జానకిధరణి కోశదండంబులం గనునటుల సంపన్నులగు నిర్వురు కుమారులం గనియెను. అన్నకు సంతానము గలిగినదనువార్త విని శత్రుఘ్నుఁడు మిక్కిలి హర్షమొంది ప్రభాతమునందు మునియాజ్ఞఁ బడసి స్యందన మెక్కి మరలఁ బయనమయ్యెను. అడవి యర్పించినకప్పము వలెనున్న మృగములఁ గూడుకొని కుంభీనసానందనుఁడైన లవణాసురుఁ డతని నెదుర్కొనెను. పొగవలె నల్లనై క్రొవ్వుకంపు గలిగి మంటలువలె నెఱ్ఱగా నుండు తలవెండ్రుకలఁ గలిగి బహురాక్షసపరివార యుతుఁడై తిరుగుచున్న ప్రేతాగ్నివలె రాక్షసుఁడు కనఁబడెను. ఆసమయమందు లవణుని చేత శూలము లేకపోవుటచే నది సమయ మని సౌమిత్రి వానిం దాఁకెను. పగవారి మర్మంబు లెఱిఁగి తాఁకెడువారికి జయము సుభముగా లభించునుగదా! ఈదినమున నాయొద్దనున్న భోజనము నాకుఁ గడుపు నిండుటకు సరిపోదని తెలిసికొని తన్ను నై నేమిచేయుదునో యని భయపడి బ్రహ్మదేవుఁడు నాయదృష్టము చేత నిన్ను నాకడకుఁ బంపె నని జడిపించి యాదానవుండు శత్రుఘ్నుని సంహరించుటకై తుంగ పెకలించినట్లవలీల నున్నతవృక్షమును వేళ్ళతోఁ బెల్లగించెను. సుమిత్రానందనుఁడు తన వాఁడియమ్ములచేత నాచెట్టును రెండుముక్కలుగా నరికెను. ఆయనమీఁద వృక్షము పడకుండఁ బుష్పరజము మాత్రమే పడెను. ఆభూరుహము రెండుతునియలై నశియించుటఁజూచి పలలాశి క్రోధోద్దీపితుఁడై యముని చేతినుండి వెలువడివచ్చిన పిడికిలియో యనునట్లుండిన యొక గొప్పరాయి నెత్తి యాతనిపై వైచెను. అంతట శత్రుఘ్నుఁ డింద్రాస్త్రమును బ్రయోగించి యారాయి మిక్కిలి సూక్ష్మములకు పరమాణువులుగఁ గొట్టెను. ఒక్కతాటిచెట్టు మాత్రమే గలిగి మహావాయుప్రేరితమై పరుగెత్తు పర్వతమువలె రాక్షసుఁడు దక్షిణహస్త మెత్తి శత్రుఘ్నునిమీఁది కురికెను. అంతట వైష్ణవాస్త్రంబుఁ దొడిగి శత్రుఘ్నుఁడేయ లవణాసురుఁడు వక్షస్థలము పగిలి నేల గూలెను. ఆపతనముచేత ధరణికంపించెను. ఆశ్రమవాసులైన మునులకంపము వాయెను. అటుల చచ్చి పడియున్న రక్కసుని మేనిమీఁదఁ బలువులుంగులు వచ్చి వ్రాలెను. అదనుజాంతకునిమేనిమీఁద దేవతాపుష్పవృష్టి కురిసెను. అటుల లవణాసురుం గడతేర్చి. లంకలో నింద్రజిత్తును బరిమార్చిన లక్ష్మణునకుఁ దాను తమ్ముఁడనని తలంచెను అంతట మహర్షులు కృతార్థులమైతిమని యాతనిం బొగడిరి. విక్రమముచేత నతఁడు తల యెత్తికొని తిరుగవలసినవాఁడయ్యు వారిపొగడ్తచే సిగ్గుపడి వినయమునఁ దలవంచికొనెను. పౌరుషభూషణుండును, మధురాకృతియునగు నాశత్రుఘ్నుఁడు కాళిందీ

తీరమునందు మధుర యను పురమును నిర్మించెను. అతనిసత్పరిపాలనము చేత సంతుష్టు
లై యభ్యుదయముఁ గాంచుచున్నప్రజలతో నిండి యానగర మెంతయో శోభిల్లి స్వర్గ
మందుచోటు చాలక భూమిపైఁ గాపుర ముండఁ దలఁచి వచ్చినదేవతలతో నిండిన
స్థానమటు లుండెను. చక్రవాకపక్షు లనియెడుబంగారునగలుగలభూదేవియొక్కనల్ల
నిజడయో యనునట్లు భాసిల్లుచుండినయాయమునానదిని శత్రుఘ్నుఁడుతనమేడమీఁద
నుండి కనులు పండువుగాఁజూచి యానందించుచుండును. జనకదశరథనృపాలురకునఘుఁ
డైన వాల్మీకిమౌని సీతానందనులకు విధివిధానంబుగా క్షత్రియకుమారోచితమైన జాత
కర్మాది సంస్కారములఁ జేసెను. కుశలవములచేత సీతయొక్క గర్భమందలిక్లేశ
మడఁపఁబడుటచే గుశలవులను పేరు కుమారులకుఁ దగునని వాల్మీకి వారి కా పేళ్ళు
పెట్టెను. శైశవమించుక గడచినతోడనే కుశలవులచేత వాల్మీకి సాంగముగ వేదా
ధ్యయనము చేయించి యాదికావ్యమైన తన రామాయణము వారిచేత పాడించెను.
మధురమైన రామచరిత్రమును గానము చేసి కుశలవులు సీతకుఁ గొంతమనోవ్యథ వోఁ
గొట్టఁదొడఁగిరి. రామునిసోదరులు మువ్వురు తమతమభార్యలయం దిద్దఱేసికొడుకు
లం గనిరి. శత్రుఘ్నుఁడు కుమారులలో జ్యేష్ఠుఁడయిన శత్రుఘాతిని మధు
రాపురరాజ్యమున కభిషిక్తుంజేసి రెండవవాఁడగుసుబాహువునకు విదిశాపురరాజ్యము
బట్టముగట్టి యన్నను జూచువేడ్క నయోధ్య కరిగెను. సీతాకుమారులు పాడు
రామాయణము నేయాశ్రమమందలి మృగములు సైతము కదలక మెదలక మేఁతలు
మాని వినుచుండునో, యట్టివాల్మీకిమహాముని యాశ్రమము మరలఁ బ్రవేశింపక శత్రు
ఘ్నుఁడు దానిప్రక్కనుండి వెడలిపోయెను. తనరాకకొఱకు మిక్కిలి యలంకరింపఁ
బడినయయోధ్యాపురముం జొచ్చి యాసౌమిత్రి లవణాసురసంహార మొనర్చినందుకు
జనులచేత మిక్కిలి గౌరవింపఁబడెను. సీతాపరిత్యాగముచేత వసుమతి కొక్కదానికే
భర్తయైయున్న రాముని సభాసదులచేతఁబరివేష్టింపఁబడియున్నవానిని, శత్రుఘ్నుఁడు
కొలువుకూటమునఁ గాంచెను. కాలనేమియనురక్కసుని జంపినవిష్ణుని మహేంద్రుఁడు
కొనియాడినట్లు లవణదనుజుం జంపినయనుజుఁడు తనకు నమస్కరించ రాము
డాదరించి స్తుతించెను. "సమయము వచ్చినప్పుడు సీతను కుమారులను నేనే రామున
కప్పగించెద. ఈవృత్తాంత మేమియు రామునకు జెప్పవల"దని వాల్మీకి శాసించుటచే
శత్రుఘ్నుఁడు తక్కిన యెల్లవారి సేమ మెఱింగించెనుగాని సీతావిషయము రామున
కెఱిగింపలేదు. అంతట నొకనాఁడు గ్రామవాసి యైనయొకబ్రాహ్మణుఁడుచిన్నతన
మందె మృతినొందిన తన కుమారుని దోడ్కొని యయోధ్యకుఁబోయి యాబిడ్డం దొడ
మీఁద నిడికొని రాజద్వారమునందుఁ గూర్చుండి యీవిధంబున నేడ్వఁదొడంగెను,

"అమ్మా! భూదేవీ! నీకెన్నిపాట్లు సంభవించెనమ్మా! నీవు దశరథమహారాజును విడిచి రాముని చేతులంబడి సకలకష్టములపాలగుచుంటివిగదా!" "ఇక్ష్వాకువంశస్థులగు రాజులు పరిపాలించుచున్నప్పు డపమృత్యువెన్నఁడుం గలుగఁగూడదు. నేడిట్లేలగల్గెన" ని రాముఁడు మిగులఁజింతించి సిగ్గుపడి కారణముఁ దెలియలేక వెక్కివెక్కి యేడ్చుచున్న యానేలవేల్పు నూఁదార్చి యొక్కనిముస మూరకుండుమని బ్రతిమాలి యమునిమీఁదికి దండెత్తి పోవఁదలఁచి కుబేరపుష్పకముం దలంచెను. ఆ విమానము వచ్చుటయు దానినెక్కి రఘుపుంగవుఁడు శస్త్రాస్త్రంబుల పూని బయలుదేఱుచుండ నాకాశవాణి యిట్లనియె; "రాజా! నీ ప్రజలలో నెవఁడో యపచారము చేయుచున్నాఁడు. అన్నిదిక్కులు వెదకి దానిం గనిపెట్టి శమింపఁజేసితివేని నీవు కృతకృత్యుఁడ వయ్యెదవు." ఆయాప్తవచనము విని రాముఁడు వర్ణాశ్రమవిరుద్ధమైనకార్యము జరుగుచున్నదని గ్రహించి ధ్వజము నిశ్చలమైయుండు విమానముపై నెక్కి దానినరయుటకై దిక్కులఁ జూచెను. తిరిగితిరిగి రాఘవుఁ డట్టకేలకుఁ జెట్టుకొమ్మ నాధారముచేసికొని తలక్రిందుగాఁ దపస్సు చేయువానిఁ బొగచేత నెఱ్ఱవడినకనులు గలవాని నొకానొకని జూచి యతనిగోత్రనామము లడిగెను. ధూమపాయియైనయాతఁడు 'స్వామీ నేను శూద్రుఁడను, శంబుకుఁడను, స్వర్గముం గోరి యిట్టుల తపము చేయుచున్నాఁడ' నని ప్రత్యుత్తరమిచ్చెను. "శూద్రుఁడు తపమున కనర్హుఁడు, ప్రజల కనర్థదాయకుఁడు," నని రాముఁడు విచారించి వానితల నఱికివైవఁదగునని నిశ్చయించి శస్త్రమును జూచి యగ్నికణములచే మాడిపోయిన మీసములుగలిగి మంచుచే మాడిన కింజల్కములుగల తామరపుష్పంబుబోలియున్న యాతనివక్త్రమును కంఠనాళముతోడ నఱికి నేలఁబడవైచెను. శూద్రకులజుఁడైన శంబుకుఁడు రాజుచే న్యాయముగా దండింపఁబడుటంజేసి సిద్ధుడై తాను చేయఁగూడనితపము చేయుటవలన తనకు లభింపనిమోక్షపదమును సులభముగాఁ గాంచెను. అంతట రాముఁడు శరత్కాలము రాకాసుధాకరుని గాంచినట్లు దారిలో నుదారతేజుని నగస్త్యుని గాంచెను. మున్ను తనచేతఁ గ్రోలఁబడినసంద్రంబు తనకిచ్చినదియు వేలుపులు దాల్పఁదగినదియు నగుభూషణమును కుంభసంభవుఁడు రాఘవునకిచ్చెను. జానకి సరసను లేమి రాముఁ డాభూషణమును మెడఁదాల్పక భుజమునకుమాత్రము కట్టుకొని గృహాభిముఖుఁడై వెడలెను. రాముఁ డయోధ్యకుఁబోకమునుపే బ్రాహ్మణకుమారుఁడు మరల బ్రతికెను. యమునిబారినుండి నైతము రక్షింపఁగల యా రాఘవుని మున్ను దూషించిన యా బ్రాహ్మణుఁడు తనకొడుకు బ్రతికినతోడనే బహుస్తుతులు చేసి పూర్వము నిందించినపాపము బోఁగొట్టుకొనెను.

అనంతరము రాముఁ డశ్వమేధ మారంభించి గుఱ్ఱమును విడువ నరేశ్వరవా

నరేశ్వరరాక్షసేశ్వరులు మేఘుఁడు సస్యంబు గురియునటులు గానుకల వానలం గురిసిరి. రాముఁడు మహర్షులు నెల్లఁ బిలువఁ బంప మునులు భూమిమీఁదనున్న యాశ్రమములనేగాక దివ్యాశ్రమములనుగూడ విడిచి రామునిసన్నిధికిం జనిరి. అటులు మహర్షి మండలములో నిండి నాల్గుద్వారములు గల యయోధ్యాపురంబు, సృష్టింపఁబడు జీవలోకము పరివేష్టింపఁ గొలువున్న చతుర్ముఖబ్రహ్మవలె నుండెను. రాఘవుఁడు మరల వివాహముఁ జేసికొనక సవనముఁ జేయునప్పుడునైతము సీతయొక్క బంగారు ప్రతిమనే ప్రక్కన నిలుపుకొని యుండుట చేత నతఁడు శ్లాఘాపాత్రుఁ డయ్యెను. సకలయాగములకు విఘ్నములు గలుగఁ జేయు రాక్షసులే యాగరక్షకులై యుండుటం జేసియుఁ జన్నములకుఁ గావలసిన దానికంటె నెక్కువగ సామగ్రియుండుటం జేసియుఁ గ్రతువు నిరంతరాయముగ నిరుపమాన వైభవముతో జరిగెను. వాల్మీకి రచియించి యచ్చటచ్చట నించుక ప్రచురించియున్న రామాయణమును యజ్ఞశాలలో గురునియాజ్ఞ బడసి కుశలవులు రామసన్నిధిని గానము చేసిరి. చరిత్రము రఘురాముని చరితము, కవి వాల్మీకి మహాముని. పాడినవారు కిన్నరస్వరములు గల కుశలవులు. ఇంక దానిని వినుట కెవ్వరికానందము గలుగదు. రూపము చేతను గానము చేతను మనోహరులైన యాకుమారులు చదువు రామాయణమును భ్రాతృసమేతుఁడై రాముఁడు సంతోషముతో విని వారి రూపములం జూచి యానందించెను. ఆగానమును విని కొలువువారెల్ల నేకాగ్రచిత్తము గలిగి బాష్పకలితమై ప్రభాతకాలమందు గాలి చేఁ గదలక మంచు స్రవించుచున్నట్టి వనస్థలివలె నుండెను. ఈడునను వేషంబునను దక్క నక్కుమారులు తక్కిన లక్షణంబులఁ దప్పక రామునిఁ బోలి యుండుటం జేసి జనులు గుంపులు గుంపులుగా వచ్చి కుఱ్ఱలు వాల్పక యబ్బాలకులం జూచిరి. రామభూపాలుఁడు ప్రీతుఁడై వారికి బహువస్తువులు దాన మీఁదలచెను; గాని యాకుమారు లొక్కటైనఁ బుచ్చుకొనలేదు. అది చూచి వారి ప్రావీణ్యమున కాశ్చర్యపడిన దానికంటె వారి నిస్పృహతకు జనులు కెక్కువ యాశ్చర్యపడిరి. "ఈగానము మీకెవ్వరు నేర్పిరి? ఈమహాకావ్యమెవ్వరు రచించిరి?" యని రాముఁడు వారి నడుగ "వాల్మీకి" యని వారు ప్రత్యుత్తర మిచ్చిరి. అదివిని రాముఁడు సంతోషించి తమ్ములం గలిసి వాల్మీకిం జేరి శిరము వంచి నమస్కరించి నా దేహ మొక్కటి దక్క తక్కిన సామ్రాజ్య మంతయు నర్పణము చేయుచున్నాను గ్రహింపుఁడని నివేదించెను. "రాజేంద్రా! ఈకుమారులు సీతాదేవివల్ల నీకుఁ గలిగిన కుమారులు" అని దయాళువైన యమ్మహాముని వారిని రామునికిఁ జూపి సీతను బరిగ్రహింపుమని యాయనను వేడెను. అనవుడు రాఘవుడిట్లనియె. "అయ్యా నాఁడు లంకాపురమందే మీకోడ లగ్నిప్రవేశము చేసి తనచరితము శుద్ధమంచు

తెలిపె; కాని రాక్షసుఁడు దుర్గుఁ డొటచే నిచ్చట ప్రజ లది విశ్వసింపరైరి. జానకి తన చరిత్రమునుగూర్చి జనులకు నమ్మిక గల్గున ట్లానవాలు జూపినపక్షమునఁ బుత్రి సమేతముగ నామెను నేను దప్పక స్వీకరింతు.,' నని రాముఁడు పలుకఁగయుఁ దపము చేతసిద్ధిని రప్పించునట్లు సీతాదేవిని దపోవనమునుండి తత్క్షణంబ రామసన్నిధికి వాల్మీకిరప్పించెను. రాఘవుఁడామహానాఁడు తనమనోగతాభిప్రాయమెల్లఁ దెల్లముగ దెలియఁ జేయుటకై యయోధ్యపురజనుల నెల్లర రావించి వాల్మీకిమహామునిని గూడ రప్పించెను.

మహామునియుఁ గుమారసమేతముగా సీతం దోడ్కొని రామునిసమీపమునకు వచ్చెను. శాంతరస మొలుకు శరీరముగలిగి కాషాయాంబరము గట్టి తలవంచుకొని తన పాదములమీఁదనే దృష్టియుంచి నిలిచియున్న యాదేవిం జూచియామె పరిశుద్ధ చరిత్రయని విశ్వసించిరి. అప్పుడు పౌరు లామెమీఁదనుండి తమదృష్టులు మరల్చి వెన్నెలచేత వంగినవరిచేలువలెఁ దలలు వంచుకొని నిల్చిరి. అంతటఁ గొలువుకూటమునఁ గూర్చుండినవాల్మీకిమహాముని సీతం జూచి 'అమ్మా! లోకులకు నీయెడఁ గలసంశయములన్నియు నీభర్తయెదుటఁ బాపు' మని పలికెను. పలుకుటయు వాల్మీకిశిష్యుఁ డొకఁడు తనచేతఁ బవిత్రజలము పోయ నాజలముతో నాచమనము చేసి సీతాదేవి యిత్తెఱఁగున సత్యవాక్యంబులం బలికెను. “మనోవాక్కాయకర్మములచేత నేనుభర్తకుఁ దప్పక యుండుట సత్యమగునేని యోతల్లీ! విశ్వంభరాదేవీ! నన్ను నీగర్భమునకుఁ దీసికొనిపొమ్ము,, అని గంభీరముగ సీతామహాదేవి పలుకుటయు భూమి పట పట పగిలెను. ఆరంధ్రమునుండివిద్యుత్తేజమును బోలిన యఖండకాంతిపుంజ మొకటి బయలుదేరెను. అవివరమున నాదిశేషునిపడగలమీఁద నున్నసువర్ణసింహాసనముపైఁ గూరుచుండి సముద్ర మొడ్డాణముగఁ దాల్చి వెలయుచున్నవసుంధరాదేవి కనఁబడెను మగనిపైఁ జూపులు నిగిడించియున్న సీత నామె తొడపైఁ గూర్చుండఁ బెట్టికొని వలదు వలదామెనుఁ దీసికొని పోవల దని రాముఁ డనుచుండఁగనే క్షణములో నంతర్ధాన మొందెను. సీతను మరలించి ధరాసంరంభముడుపుటకు రాముఁడు ధనుష్పాణి యయ్యెను గాని, విధినియోగంబు ప్రబలమై యున్నది చేయునది లేదని గురు వాయనను వారించెను. యజ్ఞము ముగిసినపిదప రాఘవుఁడు మునులను, మిత్రులను, సత్కరించి యంపి సీతమీఁద దనకుఁ గలప్రేమ మంతయు సుతులపై నిలిపెను. భరతునిమేనమామయగు యుధాజిత్తు తన మేనల్లునికి సింధుదేశ మిమ్మని సందేశ మంపఁగా నట్లే యని రాముఁడు భరతునికి సింధుదేశ మిచ్చెను. భరతుఁడుఁ సింధుదేశమున కరిగి యచటిగంధర్వుల నిర్జించెను. ఆగంధర్వులు రాజ్యమును

విడిచి వీణలుమాత్రము చేతఁ బట్టుకొని తమ పూర్వవృత్తియందు మెలఁగిరి. భరతున కిరువురుకుమారులు గలిగిరి; అం దుజ్యేష్ఠుఁడు తక్షకుఁడు; రెండవవాఁడు పుష్కలుఁడు. వారిపేర తక్షపుష్కలము లనియెడు రెండుపట్టణములు గట్టి తక్షపురము తక్షునకుఁ బుష్కలపురము పుష్కలునకుఁ బట్టాభిషేకము చేసి రాముని గొల్చుటకై భరతుఁడు మరల నయోధ్యకు వచ్చెను. అంగదుఁడు చంద్రకేతుఁడని లక్ష్మణున కిద్దరు కుమారులు గలిగిరి. కారాపథంబను దేశమునకు రామునియాజ్ఞచే వారినిర్వురు లక్ష్మణుఁడు రాజులం జేసెను. ఇట్లు పుత్త్రులనెల్ల రాజ్యప్రతిష్ఠితులఁజేసి యారాఘవులు మృతినొందిన తమతల్లులకుఁ గ్రమముగా నుత్తరక్రియలు జరిపిరి. అంతట నొకనాఁడు యముఁడు మునివేషముం దాల్చి రాఘవుని సందర్శించి యిట్లనియె.—"రాజా! మనము రహస్యముగా మాటలాడవలయు. అట్టిసమయమున మరల నెవ్వఁడు చూచునో వానిని నీవు పరిత్యజింపవలయు" అట్లే యని రాముఁ డంగీకరింప నతఁడు తన నిజరూపముం జూపి "బ్రహ్మయాజ్ఞ యైనది ఇంక నీవు స్వర్గమునకు వేంచేయు" మని చెప్పెను. అప్పుడు రామసందర్శనార్థము దుర్వాసమహాముని వచ్చి లోపలికిఁ బోనిమ్మని యడుగ ద్వారమును బాలించుచున్న లక్ష్మణుఁడు జ్ఞానియయ్యు శాపభయమున లోపలి కరిగి యమరాఘవులను జూచి వారి సంభాషణమునకు విఘ్నము గలిగించెను. అంతట మహాయోగియైన లక్ష్మణుఁడు తాను చేసినదోషమునకుఁ దానే దండన విధించుకోఁ దలఁచి తిన్నగా సరయూనదికిం బోయి యందుఁ బ్రాణత్యాగము చేసి తన యన్నయైన రాముఁడు సత్యప్రతిజ్ఞుఁ డన్న మాట నిలిపెను. అట్లు లక్ష్మణుఁడు చన రాఘవుఁడు మిక్కిలి చింతించి తనలో నాల్గవయంశము తనకన్న ముందె స్వర్గమున కరుగుటంజేసి శిథిలుఁడై యొక్కకాలు పోవ మూఁడుపాదములతో మాత్రమే నిలిచియున్న ధర్మదేవతవలె నుండెను. అంతట రాముఁడు కుశావతీపురమందు శత్రుగజాంకుశుని గుశుని, రంజితసజ్జనహృదయ పల్లవునిలవుని, బ్రతిష్ఠించెను. అంతట రాముఁడు తమ్ములం గలసి ముందగ్ని వెడలుచుండ వలదని వారించుచున్నను దమ గృహంబులు వీడి పౌరులు వెంబడింప సాకేతపురము విడిచి యుత్తరదిశకుఁ బోయెను. ఆపౌరులు రాముఁడు తమ్ము విడుచుచున్నాఁడను దుఃఖముచేత కడిమిమొగ్గలం జేసి కన్నీటిబొట్లు విడుచుచుఁ జనిరి. ఆపురవాసులవెంట రాముని చిత్తవృత్తి యెఱిఁగి వానరులు రాక్షసులుఁగూడఁ బయలుదేఱిరి. విమానములు వచ్చి గగనముమీఁద సిద్ధముగా నుండెను. అప్పుడు రాముఁడు తనతో వచ్చు ప్రజ స్వర్గారోహణము చేయుటకు సరయూనది నిచ్చెనఁగాఁ జేసెను, అనఁగా రాఘవులు, ప్రజలు, కపిరాక్షసులు సరయూనదిలోదిగి ప్రాణములు విడిచిరి. ఆనదిలో దిగినజనుజ

నమ్మర్గము గోవుల యీఁతవలె నుండుటంజేసి యారేవునకు నాటనుండి గోప్రతార తీర్థ మనుపేరు కలిగెను. సురలయంశమునఁ బుట్టి మరల సురలోకముం జేరినయా ప్రజల నిమిత్తమై యావిభుఁడు వేఱొకలోకమును సృజించెను. ఆవిష్ణ్వంశుఁ డట్లు దశముఖశిరచ్ఛేదముం జేసి దేవకార్యముఁ దీర్చి దక్షిణగిరియందు విభీషణు, నుత్తరగిరియందు హనుమంతుని కీర్తిస్తంభద్వయమువలె నిలిపి సర్వజనసేవ్యమైన తన పూర్వదేహముం బ్రవేశించెను.

## కుశమహారాజు.

తక్కిన రఘువీరు లేడ్వురును జన్మముచేతనే గాక గుణముచేతఁగూడఁ దమకు జ్యేష్ఠుఁడైనకుశుని రత్నాదిభోగ్యవస్తువులకు భాజనము జేసి విధేయులై కొలుచుచుండిరి. రఘుకులమందుఁ బుట్టినవారికి భ్రాతృస్నేహ ముండుట యక్కజమా! వారు సేతుబంధనముచేతను గజశిక్షణాదులచేతను మిక్కిలి యెన్నిక గాంచియును సముద్రము తన మేర మీఱనియట్లే తమహద్దులం దాటరైరి. కుశుఁడు కుశావతీపురమును బాలించుచుండ నొకనాఁ డర్ధరాత్రమున శయ్యాగారమున దీపము కణికవలె వెలుగుచుండ భర్త గ్రామాంతరము వెళ్ళఁగా నలంకారములు లేకయుండు స్త్రీవలె నొకానొకయింతి మెలకువ వచ్చినసమయమునఁ గుశునికిఁ గనఁబడెను. ఆయింతి యారాజుకట్టెదుట నిలిచి రాజా! జయము జయమని పలికెను. పలుకుటయు రామనందనుఁడు లేచి పానుపుమీఁదఁ గూర్చుండి తలుపులు గడియలువేసి బిగించియుండఁగా నద్దమున నీడవలె లోపలఁ బ్రవేశించినయామెలనాగం జూచి యిట్లనియె.—"నీకడ యోగప్రభావ మేమియుం గనఁబడదు. ఆవరణములతోఁ గూడియున్న యీ గృహ మెట్లు ప్రవేశింపఁగలిగితివి? మంచుచేఁ బీడనొందిన తామరపువ్వువలె నీ వత్యంతము దుఃఖాకృతిం దాల్చితివేల? కల్యాణీ! నీవెవ్వతవు? ఎవ్వనిభార్యవు? నాకడకువచ్చిన కారణమేమి? రఘుకులప్రభువు లగురాజులు జితేంద్రియు లనియుఁ బరకాంతా విముఖు లనియు నీవెఱుఁగవాయేమి?" అనవుఁడు నిర్దోషిణియైన యాయింతి యిట్ల నియె.—"రాజా! నీతండ్రి సాకేతనగరమందలిప్రజల నెల్లఁ దోడ్కొని స్వర్గపథము నకుం బోవుటంజేసి యానగరము పతి లేని దయ్యె. ఆనగరమునకు నే నధిదేవతం జుమీ! నిరంతరకల్యాణ నైజవైభవంబులచేత మున్ను నేను స్వర్గపురిని మించి యుండియు సకలసౌభాగ్యంబులకుఁ బుట్టినిల్లు నయ్యు, భానువంశజుఁడవు, బలవంతుఁడవు నీ వుండఁగా నే ననాథనై దిక్కుమాలిన దాననై దీనదశ నంద వలసెఁ. భానుఁడస్తమించినపిదపఁ బ్రచండమారుతముచేతఁ జెదిరిపోయినమేఘములు

గలసంధ్యవలె మేడ లెన్నో విఱిగిపడుటచే నయోధ్యాపురము పాడుపడి యున్నది. పూర్వము ఘల్లుఘల్లున నందెలు మ్రోయ నభిసారికాజన మావీధులయందుఁదిరుగాడుచుండునో యావీధులలోనె నక్క లాహారము వెదకుకొనుచు కూతలుపెట్టుచున్నవి. మున్ను జవ్వనులు జలక్రీడాసమయములఁ జేతులం జఱచుటవలన మృదంగగంభీరధ్వనుల నెసఁగుదీర్ఘికలలోని జలము నేఁడు వనమహిషములు కొమ్ములం గ్రుమ్ముట వలన నాక్రోశించుచున్నవియుంబోలె నున్నవి. మ్రానిమేడలు కూలుటచేత నాపట్టణమండలిమయూరములు చెట్లమీఁదఁ గాపుర ముండి మద్దెలచప్పుడులు లేకపోవుటచే నృత్యములు మాని తమపింఛములు కార్చిచ్చు నెఱసులవలనఁ గాలిపోవ వనమయూరము లయ్యె. పూర్వము పారాణి పూసికొన్న కాళ్ళతో విలాసవతు లెక్కినట్టి మేడ మెట్లు నేఁటికాలమున జింకలను జంపుటచే రక్తసిక్తములయిన పాదములతోఁ బెబ్బులు లెక్కుచున్నవి. సరస్సులో దిగి యాడరయేనుఁగు లిచ్చునట్టి తామరతూండ్ల తునక లందుకొనుచున్నట్లు చిత్రింపఁబడిన చిత్రపుటేనుఁగులను నేఁడు సింహములు తీవ్రములైన యంకుశములవంటి గోళ్ళతోఁ జీల్చి నాశనము చేయుచున్నవి. త్రాచుపాము లచ్చోట విడిచినకుబుసములు నగరస్తంభములమీఁదఁ జెక్కఁబడిన స్త్రీవిగ్రహములయొక్క ధూళిధూసరితవక్షస్స్థలముమీఁద పయ్యెదలయి యలరుచున్నవి. కాలవశమున మేడలమీఁదిగచ్చు పాకుడుపట్టి గడ్డిమొలచుటచేత చంద్రికలయు నక్షత్రములును రవంతయైనను మార్పుఁజెందక మునుపటివలెనున్నను నచ్చోటఁ బ్రతిఫలించుటలేదు. తీగలను మిక్కిలిదయతోవంచి పూర్వము విలాసవతులు రేయుద్యానవనములలోనిపువ్వులు కోసికొనుచుండిరో యాయుపవనములందు నేడు చెంచువాండ్రవలె క్రోతులువిహరించి లతలను బాధచేయుచున్నవి. రాత్రులు వెలిగెడుదీపముల ప్రభ మాసెను. పగలు కనఁబడెడుకాంతలముఖకాంతు లస్తమించెను. అగరుచందన గుగ్గులధూపధూమము లదృశ్యము లయ్యెను. గవాక్షములయందు సాలెపురుగులు గూడు లల్లెను. స్నానపరిమళద్రవ్యములు లేనినీరు కలిగి, బలిపూజలు లేనిసైకతములు గలిగి, తీరములయందు శూన్యములైన ప్రబ్బపొదరిండ్లు గలిగియుండు సరయూనదినిజూడ నా కెంతయు విచారము గలుగుచున్నవి. కారణమానుషమైనదేహమును విడిచి నీతండ్రి పూర్ణమైనపరమాత్మను జేరినచందనమున నీ వీనగరమును విడిచి కులరాజధానియైన యయోధ్యకు రమ్ము. రఘువంశప్రదీపకుఁ డామెకోర్కెను మెచ్చి యట్లే యాగాక యని పలుక నామెయు నంతసించి యదృశ్యత నొందెను.

ఆరాత్రి జరిగిన వృత్తాంత మంతయు మఱునాఁడు కుశమహారాజు కొలువులో బ్రాహ్మణుల కెఱిఁగింప వారు సంతసించి కులరాజధానిదేవత స్వయముగా వచ్చి త

దంట మంచి దని చెప్పిరి. ఆకుశావతీనగరమును శ్రోత్రియ లగుబ్రాహ్మణుల కిచ్చి ప్రయాణమున కనుకూల మైనశుభదినమ్మున రాణివాసమును వెంటఁ బెట్టుకొని మేఘములతోడ గాలివలె సైన్యసమేతుఁడై రాజు బయలువెడలెను. ధ్వజము లుద్యానవనములుగా నేనుఁగులు క్రీడాపర్వతములుగా రథములు మేడలుగా రాజవెంటఁ జను సేన నడచుచున్న రాజధానివలె నుండెను. ఆయాతపత్రమండలముతో స్వస్థానమునకు గొనిపోఁబడుచున్న యాసేన యుదయచంద్రునిచేత గట్టుచేర్పఁబడుచున్న సముద్రమువలె నుండెను. నడచుచున్న యామహారాజు సైన్యములు త్రొక్కుటచేతఁ గలిగెడుబాధ సైరింపఁజాలక భూమి విష్ణుదేవుని రెండవపాద మైనయాకాశమునకడకుఁ బోవుచున్నదో యన్నట్లు దుమ్ము మింటవఱకు వ్యాపించెను. ప్రయాణమై వెడలుటకు సిద్ధమైనపుడుగాని వెడలునపుడుగాని మార్గమధ్యమునఁగాని ప్రయాణము ముగించి యొక్కెడనో యొకచోట విడియునపుడుగాని యెప్పుడుచూచిన నామహారాజుయొక్క సేన సంపూర్ణమై సకలవస్తుభరితమై యుండును. ఆమహారాజు సేన కదలునపుడు మదపుటేనుఁగులనుండి స్రవించెడు మదజలముచేత పొడిమట్టి తడిసితడిమట్టి యయ్యెను. గుఱ్ఱములు డెక్కలతోఁ గొట్టుటచేత తడిమట్టి పొడిమట్టి యయ్యెను.

ఆసేన దారి దప్పి వింధ్యపర్వతకటకములయందు బహువిధములుగ భిన్నమై రేవానదివలెనే తనమహారవముచేత వింధ్యగుహాముఖములు మాఱుమ్రోయునటులు చేసెను. రథనేమిధాతుపటములచేత నెఱ్ఱని సేనాకలకలము తూర్యారావమిశ్రితము గాఁగ నారాజు పుళిందులు తన కిచ్చుకానుకలను కృపాదృష్టిఁ గనుగొనుచు వింధ్యభూధరము దాటెను. పడమటకుఁ బాఱుగంగను మదపుటేనుగుల వంతెనలచే రాజు దాటుచుండ నానదిలోనుండి పైకెగురు రాయంచలఱెక్కలు ప్రయత్నముగ నతనికి వింజామర లయ్యెను. పూర్వము కపిలమహామునికోపవహ్నిచేత దగ్ధకాయులయిన తన పూర్వులకు స్వర్గప్రాప్తికారణ మయి యెన్నియో యొడలు గలిగిన యాభాగీరథీనదికి నానృపుడు నమస్కరించెను.

ఇట్లు కొన్నినాళ్ళు పయనము చేసి కుశమహారాజు సరయూనదీతీరముం జేరి రఘువంశపురాజులు బహుయజ్ఞములు చేసి వేదికలమీఁదఁ బ్రతిష్ఠించిన వందలకొలఁది యూపస్తంభములఁ గనుంగొనియెను. కుశలరాజధానియందలి యుద్యానవనవాయువు చల్లని సరయూతరంగములను స్పృశియించి కుసుమసౌరభసమేత మై బడలిన సైన్యములు గలిగిన యానృపాలు నెదుర్కొనియెను. కులకేతువు ప్రజారంజకుఁడు శత్రుహృదయశల్యము నైనయానృపాలుఁడు కదలుచున్న ధ్వజపటములు గల తనమహాసేనను నగరసమీపమున విడియించెను. మండువేసఁగి యెండలచే

మాడిపోయిననేలను మరల వర్షకాలమున మేఘములు బాగుచేసినట్లు రాజుచే నియోగింపఁబడినశిల్పులు బహుసాధనములతో పురమును క్రొత్తదానిఁ జేసిరి. అంతట రఘుప్రవీరుఁడు వాస్తుశాస్త్రజ్ఞులతోఁ గలిసి యుపవాసముండి బహుదేవాలయములుగల యాపురమునకు పశూపహారములతో సపర్యలు చేసి పురప్రవేశము చేసెను కాముకుఁడు కాంతాహృదయమును జొచ్చుతెఱఁగున సమ్మోహితుఁడు రాచనగరుఁ జొచ్చి యనుచరుల కెల్ల వారివారికి యోగ్యము లయిన నెలవు లిచ్చి బహుమానములు చేసి సత్కరించెను. లాయముల నాశ్రయించినగుఱ్ఱములు గలిగి స్తంభములకుఁ గట్టఁబడినయేనుఁగులు గలిగి సకలవస్తుసమృద్ధములైనయంగళ్లు గలిగి యానగరము సర్వాభరణభూషితయైనయంగనవలె నుండెను. రఘువంశపురాజులనాటిశోభ యంతయు మరలఁ బ్రాపించిన యాపురమందు వసియించి యానృపశార్దూలుఁడు దేవేంద్రకుబేరుల పదవులయందునహితము నిస్పృహుఁడై యుండెను. రత్నములుగూర్చిన యుత్తరీయములు ధరించి మెడలో హారములు తాల్చి యూపిరి విడిచినమాత్రమున నడలునట్టి సన్నపయ్యెదలు ధరించి వేసము లింక మార్చవలసినదని యాతనిప్రియురాండ్రకుఁ దెలుపుటకో యన గ్రీష్మకాల మాసన్న మయ్యెను. అగస్త్యనిలయమైన దక్షిణపుదిక్కునుండి సూర్యుఁ డుత్తరదిక్కునకు రాఁగా హిమవత్పర్వతము మహానందశీతలబాష్పవృష్టి గురిసెనో యన హిమజలము స్రవింపఁదొడఁగెను. ప్రణయకలహములచేత నన్యోన్యతాప మొందదంపతులట్లు గ్రీష్మకాలమునఁ బట్టపగలు మిక్కిలి తపించెను. రాత్రి మిక్కిలికృశియించెను. అత్తరి గృహదీర్ఘికలలో నీ రింకిపోయి స్నానములు చేయుట కనలకు మొలబంటి యయ్యెను. పాకుఁడు గట్టినయడుగుమెట్లు కనఁబడఁజొచ్చెను. తామరపూవులకాడలుకూడ గనఁబడెను. సాయంకాలమున నుద్యానవనములయందు పరిమళంబులు వెదజల్లుచు వికసించుచున్నక్రొక్కమల్లెమొగ్గమీఁద నిండుకసేపు నిలిచి ధ్వనిసేయుతుమ్మెదం గని నది యాపువ్వులు లెక్కపెట్టుచున్నదో యన్నటుల దోఁచును. ధనవంతులు ధారాగృహములయందుఁ జేరి ధారాయంత్రములనుండి చల్లనిహిమకణంపురులు మీఁదఁ బడుచుండ మంచిగంధపు నీటఁ గడిగిన చలువరాతి పలకలమీఁదఁ గూరుచుండి యానిదాఘసమయమును గడపిరి.

ఆసమయమునందు రాజు రాజమరాళము లుయ్యాల లూఁగుతరంగములుగల సరయూనదిలో నంగనాజనసహితుఁడై జలక్రీడ సేయఁదలఁచెను. నదిలో నున్న మొసళ్లను బెస్తవాండ్రు పట్టి తేఁగ నిర్భయముగా నున్నయాసరయువు నదియొక్క తటమున గుడారములు వేయించి మహోత్సవముతో నదియందతఁడు విహరింపఁ జొచ్చెను. గట్టుమీఁదినుండి మెట్లదారిని విలాసవతులు దిగునప్పుడు కాలియందెల

చప్పుళ్ళవలనను నొండొరుల దండకడియముల రాపుడువలనను రాజహంసలు బెదరి పారిపోయెను. అంగనలు జలక్రీడ సేయుచుండ నదియుల్లాసముతోఁ జూచుటకు రాజు నావమీఁద నెక్కెను. పడఁతులు నీడ దిగి చల్లులాడుచుండ రాజు తనకు వింజామర వీచుచున్న కిరాతాంగనం జూచి యిట్లనియె. "ఓసీ! యటు చూడు. నాయంతఃపురాంగనలు వందలకొలఁది వచ్చి క్రీడించుటచే వారియంగరాగంబు కరఁగి నీటఁ గలియ సరయూప్రవాహము మేఘములతోఁ గూడిన సంధ్యాకాలమువలె ననేక వర్ణములు గలిగియున్నది. జలక్రీడాసమయమున శ్రవణములను డి జారి నదిఁబడిన పుష్పాలు నదీప్రవాహమునం బడి తేలి పాచిని దినుటకుఁ బైఁ గులెత్తెడు మీనములకుఁ గొంతభ్రాంతిని గలిగించెను. జలము నొండొరులపైఁ జల్లుకొనువేడ్కలోఁ దగిలి యుండుటచేతను జలబిందువులు ముత్యాలవలె రాలుచుండుటచేతను ముక్తాహారములు తెగి ముత్యములు రాలుచున్నను అంగనల కాసంగతి తెలియకపోయెను. అంగనలబొడ్డు సుడిని బోలుచున్నది. కన్బొమలు తరఁగలఁ బోలుచున్నవి. పయోధరములు చక్రవాకముల మీరుచున్నవి. అవయవముల కుపమానముగాఁ బోల్పఁదగిన సమస్త వస్తువులు వీరిసమీపమందె యున్నవి. జలమునుండి బయలుదేఱుచున్న ధింధిమిధ్వానము స్త్రీలుపాడుపాటలతోఁ గలిసి తీరమున తమపింఛములు విప్పి యాడుచున్న నెమిళ్ళ కింపుగా మధురమై యొప్పెను. అంగనలు చేతు లెత్తి జలములొండొరులమీఁదఁ జల్లుకొనుటచేత నాజలము మొగంబులపైఁ బడ కరఁగినకుంకుమతోఁ గలిసి నీటిచుక్కలు కురులకొనలను డి రక్తబిందువులవలె రాలుచున్నవి. ఆ యింతులు జలక్రీడచే నెంతోయలసియున్నను మకరికాపత్రములు కరఁగి యున్నను కురులు చెదిరియున్నను వారిమొగములెంతో శోభాకరములై యున్నవి" అనిపలికి యడవియేనుఁగు తాను త్రెంచినతామరతూడు మెడను వైచికొని యాఁడయేనుఁగులం గూడి విహరించునట్లు కుశమహారాజు నావ దిగి నీటఁ బ్రవేశించి మెడలో ముత్యాలహార మల్లలనాడ స్త్రీలతోఁ గలిసి క్రీడించెను. అటు లా స్త్రీలు రాజును గూడి యెంతయుఁ జక్కఁగఁ గనఁబడిరి. ముత్యము నయనాభిరామము గద. అదియింద్రనీలమణితోఁ గలిసినప్పుడు దానిని వర్ణింపఁ దరమా. అంతట నయ్యంగనలు పసిఁడి చిమ్మనగ్రోవులతో రంగునీ తతనిపైఁ జిమ్మ జేగురునీ తోఁ గలిసి - యున్న మహాపర్వతమువలె నతఁడు శోభిల్లెను. అయ్యేఱులోఁ దనయంతఃపురాంగనలం గలిసి క్రీడించు నానృపతి యాకాశగంగలో సురస్త్రీలతోఁ గలిసి క్రీడించున మహేంద్రుని ట్లుండెను ఎయ్యది తొల్లి యగస్త్యునివలన రాముఁడు వడసి రాజ్యముతోఁగూడఁ గుశునకిచ్చెనో యాజయప్రదమైన నాభరణము [illegible] మునుఁగ నప్పుడు తెలియకుండ జలము

లంబడెను. అతఁడు తృప్తిగా స్నానము జేసి గట్టున నున్నవటగృహంబున కరుదెంచి యలంకారములు పెట్టుకొనుసమయమున దివ్యరత్నాభరణము లేదని తెలిసికొని యతఁడు దీనుఁడయ్యెను. ఆభరణము జయప్రదమును జనకదత్తంబును దివ్యంబును నగుట చేత నతఁడు దానికై విచారించెను. కాని లోభము చేతఁ గాదు. ఉదారచరిత్రులకు నగలుఁ బుష్పములు సమానములే గదా. ఆయాభరణమును వెదుక సమర్థులైన బెస్తవాండ్రు నతఁడు నియోగింప వారు మిక్కిలి శ్రమపడి వెదకి వెదకి కానక విసిగి వేసారి రాజుకడకుఁ బోయి యట్లు చెప్పిరి. స్వామీ మేము మిక్కిలి శ్రమచేసి వెదకితిమి గాని యది కనఁబడ లేదు. ఈనదిక్రింద కుముదుఁడను నాగుఁడున్నవాఁడు అతఁడు లోభమున దీనిని హరియించియుండవచ్చును. ఆపలుకులు విని కుశుఁడు మిక్కిలి కనలి యానాగుని నాశముఁ జేయుటకై గరుడాస్త్రమును వింట నంధించెను. అలుగు వింటఁ దొడిగినలోడనె యానది మిక్కిలి కలఁగి గోతిలోఁ బడినయడవియేనుఁగువలె ఘోరరవము చేసెను. మథింపఁబడినక్షీరసాగరమునుండి లక్ష్మీసమేతముగఁ గల్పవృక్షము బొడమినట్లు లాహ్రదమునుండి కన్యాసమేతుఁడై భుజగరాజు కనఁబడెను. ఆభుజగరాజు తనకు సమర్పించుటకై తెచ్చిన యయ్యాభరణ మతని చేతఁ గని కుశుఁడు ప్రసన్నుఁడై గారుడాస్త్ర ముపసంహరించెను. మహాపురుషులు ప్రణతులయెడ దీర్ఘక్రోధులు కారుగదా. కుముదుఁడు మిక్కిలిమానవంతుఁడైనను శత్రుమర్దనుఁడైనయాకుశునికడ శిరము వంచి యిట్లనియె. "రాజా నీవు కార్యాంతరము చేత మనుష్యరూపము దాల్చినవిష్ణుని పుత్త్రుఁడవు. నీప్రీతికి భంగము చేయుటకు నేనెంతవాఁడను. ఈమె నాచెల్లెలు. ఇది తనబంతి మీఁది కెగరవైచి దానింబట్టుకొనుటకై చేయిచాచి మీఁదికి చూచుచుండ నంతలో మింటనుండి చుక్కవలె నీయాభరణంబు చేతఁబడ దానిం బుచ్చుకొనియెను! రాజా. జ్యాకిణాంకమై భువనరక్షాపరిఘమై యాజానులంబియైననీబాహువునందు మరల నీయాభరణంబు గూర్పుము. ఈనాచెలి యలు నీయెడఁ జేసినదోషమును పోఁగొట్టుకొనుటకు శాశ్వతముగా నీపాదసేవ చేయఁ దలంచికొన్నది. కాన నీకుముద్వతిని మణిని గూడ స్వీకరింపుము." అని యతఁడు దానికి భూషణ మొసఁగెను. నీవు శ్లాఘ్యబంధుఁడవుగదా యని రాజతని బహూకరించెను. పిమ్మట బంధుసమక్షమున భుజగరాజు కుశునకు కుముద్వతినిచ్చి వివాహము చేసెను. మంగళకంకణశోభితమైనమానినిహస్తము గ్రహించి కుశుఁడగ్నికి ప్రదక్షిణము చేసెను. మంగళతూర్యారావములు సెలఁగెను. మేఘములు సుగంధపుష్పవృష్టి గురిసెను. జగత్త్రయగురువైన రామునకును బరమపావనచరిత్ర యగుసీతకును నందనుఁడైన కుశమహారాజు భుజంగరాజునకుఁ జుట్టమయ్యెను. తక్షకునకైదవతరము వాఁడైన కుముదుఁడు కుశునకు బంధువయ్యెను.

# అతిథిమహారాజు.

———:0:———

కుముద్వతి కుశునివలన నతిథి యనుకుమారునిం గనియెను. తేజంబునఁ దండ్రినిం బోలినయాయతిథినృపాలుఁడు దక్షిణోత్తరమార్గములను సూర్యుఁడు వెలయించునట్లు తండ్రియొక్కవంశమును దల్లియొక్కవంశముఁగూడ వెలయించెను. అర్థశాస్త్రవేత్తలలో నగ్రగణ్యుఁడయినకుశుఁడు మొట్టమొదటఁ దనకుమారుని వంశక్రమాగతవిద్యలయందుఁ గుశలునిం జేసి పిదప రాజకన్యలను బాణిగ్రహణ మొనర్చునట్లుఁ జేసెను. తనకులధర్మమును నెరపఁ దలఁచి దేవేంద్రునకు సహాయము చేయఁబోయి దుర్జయుండను నసురునిం దాఁకి వానిం జంపి కుశుఁడు వానిచేతఁదానుఁగూడ నిహతుఁడయ్యెను. వెన్నెల కువలయానందప్రదాయకుఁడైనచంద్రునితోఁ బోవునట్లు భుజగవల్లభుఁడైనకుముదుని చెల్లెలు కుముద్వతి మగనితో సహగమనము చేసెను. వారిద్దఱిలోఁ గుశుఁడు దేవేంద్రునర్ధసింహాసనము నధిష్ఠించెను. కుముద్వతి శచీదేవికి సఖియై పారిజాతవృక్షమునం దొకపాలు గొనియెను. సంగ్రామంబునకుఁ బోవునప్పుడు తమరాజు కుశుఁడు చెప్పినమాటలు జ్ఞాపకముంచుకొని వృద్ధమంత్రులు వానికుమారుఁడైనయతిథిని రాజ్యప్రతిష్ఠితుం జేయఁ దలఁచి శిల్పుల రావించి పట్టాభిషేకసమయమునకు నుచితమైనయొకరమ్యవేదికను, నాలుగుస్తంభములు గలయొక మనోహరవిమానమును నిర్మింపఁ బనిచిరి. అనంతరము అతనిని భద్రపీఠముమీఁదఁ గూర్చుండఁబెట్టి పుణ్యతీర్థజలములతో నిండినసువర్ణకుంభములు చేతఁ బట్టుకొని వృద్ధమంత్రులాతనిపరికర్మ నిలిచిరి. అగుఁడవిచ్ఛిన్నకల్యాణపరంపర ననుభవించునని యాసమయమున నవిచ్ఛిన్నముగ మ్రోగిన మంగళతూర్యరావములు తెలిపెను. యవాంకురములు గరికెయుఁ గలిసినమఱ్ఱిపట్టము లేతచిగుళ్ళను జ్ఞాతులును వృద్ధమంత్రులును సమర్పింప నతఁడు నీరాజనవిధిని గాంచెను. అంతట బ్రాహ్మణులు పురోహితుం బురస్కరించుకొని జయప్రదములైన యథర్వణమంత్రములచేత జయశీలుఁడగునతనికభిషేకము చేయందొడఁగిరి. అతనిశిరంబున నభిషేకసమయంబునఁ బడినజలము గగనమునుండి మహాదేవునితలమీఁదఁ బడుగంగాజలముం బోలెను. చాతకంబులు పొగడుటచేత వృద్ధిపొందెడు మేఘుఁడువలెనే వందిమాగధులచేత స్తుతియింపఁబడి యారాజు మిక్కిలి శోభిలెను. వర్షజలముచేత విద్యుదగ్ని వర్ధిల్లినకరణి మంత్రపూతజలముచేత నారాజు దేదీప్యమానుఁడై వెలసెను. పట్టాభిషేకము సమాప్తమగుడు నారాజు స్నాతకులకు వారివారియజ్ఞములకుఁ గావలసినధన మిచ్చి పంపెను. ఆస్నాతకు

లందఱు నాతని దీవించిరి. పట్టాభిషేకమహోత్సవసందర్భమున నారాజు చెఱసాల లోనున్నవారిని విముక్తులఁ జేసెను. మరణదండన విధింపఁబడినవారిని దండింపక విడిచెను పశువులపై బరువు వేయకుండునట్లును నావులం బాలు పిదుకకుండునట్లును శాసించెను. పంజరమ్ములలోనున్న చిలుకలు మొదలుగ వినోదముకొఱకుఁ బెంచుకొనుచున్న పులుగులు విముక్తములై స్వేచ్ఛగాఁ దిరుగఁ జొచ్చెను. అనంతర మారాజు విమలవస్త్రశోభితమైనదంతపుఁ బీఠముమీఁదఁ గూర్చుండి యలంకారము చేయించుకొనఁ జొచ్చెను. అంతట నలంకారము సేయువారు తాము స్వయముగఁ గొన్నినగలు దాల్చి చేతులఁ బరిశుద్ధజలములం గడిగికొని ధూపములచేత నాతనితలవెండ్రుకల నున్నతడి నార్చిరి. విరులదండలు ముత్యాలసరులు గలయాతనిమౌళిలోఁ బద్మరాగమణిమయమైన భూషణములను వారమర్చిరి. అగరుతోఁ గలిసినమంచిగంధ మాయనమేన నలంది గోరోచనముతోడ చిత్రములైనపత్రములను వ్రాసిరి. మేన భూషణములు దాల్చి మెడలో విరిదండ లిడికొని హంసచిహ్నములుగలదుకూలములు గట్టి నరపాలుఁడంతయు ముగిసెను. తనయలంకార మంతయు బంగారపుటద్దమున రాజు చూచుకొనెను. సూర్యోదయమున మేరుపర్వతమునఁ గనుపట్టుకల్పవృక్షప్రతిబింబమువలె నాతనిప్రతిబింబ మాయద్దమునఁ గనఁబడెను. పార్శ్వవర్తులు రాజచిహ్నములను హస్తముల ధరించి వెంటరా నారాజు దేవేంద్రసభనుబోలెడు తన సభామంటపమున కరిగెను. బహురత్నఖచితమైనపాదపీఠము గలిగి కంబు మీఁదను మేలుకట్టు కలిగి పైతృకంబైన సువర్ణసింహాసన మతఁ డధిష్ఠించెను. శ్రీవత్సలాంఛనము గలిగి కౌస్తుభమణిసమేతమైన నారాయణుని వక్షస్థలమువలె శ్రీవత్సమను పేరుగల యాతనిసభ యాతనిచే మిక్కిలి శోభిలెను. ప్రసన్నముఖమును మందహాసపూర్వకభాషణమును గల యాతనిం గని యనుజీవుల విశ్వాసమే మూర్తీభవించినదని తలంచిరి. కల్పవృక్షములవంటి పతాకములు గలిగిన యానగరమును నైరావతమువంటియేనుఁగుపై నెక్కి తిరుగుచు మహేంద్రసమానుఁడైన యానరపాలుఁ డాపురము నమరావతివలెఁ జేసెను. స్వచ్ఛకాంతుల నీనుధవళాతపత్రమతనిశిరముపై వెలసి పూర్వరాజవియోగముచేతఁ బొక్కుచున్న పౌరుల సంతాప మడంచెను. అగ్నిలో ముందు పొగయుఁ బిమ్మట మంటయుఁ బుట్టును. ముందు సూర్యుఁ డుదయించును. పిమ్మట కాంతి జనించును. అట్టి తేజంబులయందలి లక్షణములను మించి యతఁడు మొదటనే సర్వగుణములతో నుద్భవించెను. అయోధ్యాపురమందుఁ గల దేవాలయములలో నతఁడు గావించునర్చలకుఁ బొంగి దేవతలా విగ్రహములలోఁ బ్రవేశించి యతని ననుగ్రహించిరి. అభిషేకసమయమున తీర్థజలముచేఁ దడిసినవేదికమీఁద తడ యారనంతలోనే యతని ప్రతాపము సముద్రతీరము

ను వ్యాపించెను. గురువైన వసిష్ఠుని మంత్రశక్తియు ధనుర్ధరుండైన యారాజు బాణ
శక్తియుఁ గలిసి పనిచేయుచుండఁ బడయుట కసాధ్యము లయినకోరికలు భూమం
డలమునఁ గలుగునా? ధర్మకోవిదుఁడైన యారాజు వాదిప్రతివాదుల వాదములను
సంశయము తీరునంతవఱకు నప్రమత్తుఁడై విని వ్యవహారములు తీర్చుచుండును. ము
న్ను జనకునిచేత శ్రావణమాసపునదులవలె వృద్ధిఁ బొందిన ప్రజలు నేఁడు తత్కుమారుఁ
డైన యారాజుకాలమున భాద్రపదమాసపునదులవలె మునుపటికంటె వృద్ధి నొంది
రి. అతఁ డేది పలుకునో యది యబద్ధము కాదు. అతఁ డేది యిచ్చునో యది
మరల గ్రహింపఁడు. శత్రువులను మొదట జయించి తర్వాత వారల రాజ్యప్రతి
ష్ఠితులఁ జేయును. వయసు రూపము విభూతి యనునవి యొక్కొక్కటిగ నున్న
ను గర్వము గలిగించును. అవి యన్నియు నతనియందున్నను రవంతయైనను గర్వ
ము గలిగింపలేదు. అతఁడు క్రొత్తగా రాజ్యమును బ్రాపించినను వేరు దృఢముగా
నాటుకొన్న వృక్షమువలె నచలుఁడై ప్రకృతిజనరంజకుఁడై యుండెను. బాహ్యశ
త్రువులు నిత్యులు గాక దూరముననే యుండును. అంతశ్శత్రువు లెప్పుడు సమీప
మందె నిత్యులై యుండును. కావున నతఁడు ముందుగా నరిషడ్వర్గమును జయించెను.
లక్ష్మిస్వభావముచేతఁ జంచల యయ్యు నొరగల్లుమీఁది హేమరేఖవలెఁ బ్రసన్న
ముఖుఁడైన యారాజునందు స్థిరముగా నిల్చెను. శౌర్యము లేనినీతి పిరికితన మగును.
నీతిలేనిశౌర్యము క్రౌర్య మగును. కాన నతఁ డారెండును గలిగి కార్యసిద్ధి బడ
య సెంచెను. మేఘచ్ఛన్నుఁడు కాని సూర్యుడట్లు రాజు చారులనెడుదీప్తులు గలిగి
యెల్లయెడలఁ బ్రకాశించుటచే రాజ్యమం దతనికిఁ గనపడనివని యేదియు లేకపోయె
ను. రాజులు రేయింబవళులు చేయవలసినవిధికృత్యముల నతఁడు మిక్కిలి జాగరూ
కుఁడై చేయుచుండెను. అతఁడు ప్రతిదినము మంత్రులం గూడి మిక్కిలి రహస్యముగాఁ
గార్యాలోచనము సేయుచుండును. మిత్రుల కడకును శత్రులకడకుఁగూడ నతఁడు
గూఢచారుల నంపి యెల్లకార్యములు నరయుచుండుటచే నతఁడు యథాకాల నిద్రి
తుఁడయు నెల్లప్పుడు మేల్కొనియుండెను. అతఁడు శత్రుఘాతకుఁడయ్యును దుర్గ
మము లగుదుర్గము లెన్నో కలవాఁడై యుండెను. మదఁపుటేనుఁగులఁ బట్టఁ జం
పునట్టిసింగము గుహలోఁ బండుకొనుట భయముచేతఁ గాదు గదా. శుభమే ప్రధా
నముగాఁ గలుగుకార్యములన్నియు విఘ్నమెఱుంగక కడుపులోపలనె బండు వరిపై
రువలె గూఢముగా సఫలమగుచుండును. కలుషరహితుఁడైన యామహారా జెంత
యభివృద్ధి జెందినను దుష్టపథమున నెన్నఁడు బోవఁడు ప్రజలలో నుండునట్టియశాం
తి నడప సమర్థుఁ డయ్యుఁ దనవర్తనము దిద్దికొనవలసియున్నప్పుడు దానిని దిద్దుకొను

ను గాని ప్రజలపై నాగ్రహము పూనఁడు. శక్తిమంతుఁడైన యారాజు తనకు సాధ్యులైనశత్రువులమీఁదనే దండెత్తి పోవుచుండును. వాయుసహాయంబు గలయగ్నిహోత్రుఁడు వనములమీఁది కరుగును గాని జలములమీఁది కరుగునా. అతఁడు ధర్మార్థకామములను సమముగా దాల్చియుండుటచే ధర్మమువలన నర్థకామములకు నర్థమువలన ధర్మకామములకుఁ గామమువలన ధరార్థములకు భంగము కలుగదయ్యెను. మిత్రులు క్షీణదశలో నున్నయెడల నుపకారము చేయఁజాలరు. ఉన్నతదశలోనున్నయెడల నపకారము చేయుదురు. కావున మానవస్వభావ మెఱిగినయారాజు మిత్రమండలమును మధ్యమస్థితిలో నుంచెను. స్వశక్తియుఁబరశక్తియు బలాబలంబులును జక్కఁగా నెఱింగినవాఁ డగుటచే నమ్మహీకాంతుఁడు శత్రువుఁడు బలవంతుఁడైన పక్షమున వానిపై దండు విడియును. దుర్బలుఁడైనపక్షమున వాని నుపేక్ష సేయును. ధనవంతు నె యెల్లవార లాశ్రయించుచుండుటచేనతఁడు విశేషధనము సంపాదించెను. జలముతో నిండిన మేఘమునే నానకోయిల మెచ్చుచుండునుగదా. శత్రుకార్యములు తెలిసికొను నతఁడు తనపనులు చక్కఁగా జేసికొనుచుండును. మర్మము లెఱింగి పగతుర మద మడంచును. తనలోపము లెవ్వరికిఁ దెలియకుండఁ గప్పిపుచ్చును. పాముపడగమీఁద నుండుమణివలె నతనిశక్తి హరించుటకు శత్రువుల కసాధ్య మయ్యెను. ఇనుము నయస్కాంతము లాఁగునట్లతఁడు శత్రువులశక్తిత్రయమును హరించుచుండెను. అతని కాలమున సార్థవాహులు తమయిండ్లయందువలెనె పర్వతములందును నూతులందువలెనే సరోవరములందును, నుపవనములందువలెనె వనములందును సంచరించిరి. దొంగలబారిఁ బడకుండ సంపదలను గాపాడి విఘ్నములు కలుగకుండఁ దపస్సురక్షించి యతఁడు జనులనుండియాఱవయంశమగుపన్నును, తపోధనులనుండి యాఱవయంశమగు పుణ్యమును సంపాదించెను. భూదేవి గనులవలన ననేకరత్నములం గని వనములవలనఁ బెక్కేనుంగులం గని క్షేత్రములవలన ధాన్యములం గని తన్ను రక్షించినందులకు రాజునకు జీత మిచ్చెను. వీరపురుషులనే వరియించి జయలక్ష్మి ధర్మయుద్ధవిశారదుఁడైన యారాజును నభిసారికవలె వచ్చి వరించెను. చంద్రుఁడు వృద్ధిని క్షయముగూడఁ బొందుచుండును. సముద్రుఁడును నట్లే వృద్ధిక్షయములకు లోనగును. ఈరాజు వరివలె వృద్ధినే కాంచును గాని క్షయమును బొందఁడు. మేఘములు సముద్రుని జేరి జలముఁ బడసి తాము దాత లైనట్లు దరిద్రులైనయాచకు లారాజుం జేరి సంపన్నులై దాత లగుచుండిరి. తాను శ్లాఘ్యమైన కార్యము లొనర్చుచున్నను దన్నెవ్వరైనఁ బొగడినప్పు డామహారాజు సిగ్గుపడుచుండును. చంద్రకిరణములు తామరపువ్వునందుఁ బ్రవేశింపవు. సూర్యకిరణములు కలువలయందుఁ జొర

డు. ఈగుణశాలిగుణము లెల్లవారియందుఁ బ్రవేశించి యానందము గల్గించుచుండును; అశ్వమేధార్థము దిగ్విజయయాత్రకు వెడలుట శత్రువుల వధించుటకైనను నది యతనికి ధర్మసాధక మయ్యెను. శాస్త్రదృష్టవిధానమ్మున నతఁ డటులు ప్రజాపాలనంబు సేయుచు దేవతలకెల్ల నింద్రుఁడు దేవుఁడైనటులు రాజులకెల్ల నతఁడు రాజేంద్రుఁ డయ్యెను. "రాజా! నీవైదవదిక్పాలకుఁడవు, జీవభూతమవు, ఏడవకులగిరీంద్రుఁడవు సుమీ" యని జను లతనిం బొగడిరి. మహేంద్రునాజ్ఞ దేవతల్ గ్రహించునటులు సామంతరాజులు ఛత్రము లావలఁ బెట్టి యాతనిశాసనమే శిరమునం దాల్చిరి. యాగాంతమునం దతఁడు ఋత్విజులమనోరథములు దీర్చినటులు విశేషద్రవ్యము దాన మిచ్చుటచే నతనిపేరును ధనదునిపేరును నొకరీతి యయ్యెను. మహేంద్రుఁడు వర్షము గురిపించెను. యముఁడు రోగములు హరించెను. సముద్రములయందు నావికులకు వరుణుఁడు సేమ మొడఁగూర్చెను. కుబేరుఁడు శీలం జేర్చెను. ఈతెరంగున దిక్పాలకులు శరణాగతులచందంబున నారాజుం గొల్చిరి. అర్థవతి యనునిషధరాజుయొక్కపుత్రికయం దయతిథిమహారాజు నిషధపర్వతముతో సమానమైనసారముగల నిషధుఁడను కుమారునిం గనెను. మహాబలపరాక్రమసంపన్నుఁడై ధారుణీజనుల నేలఁజాలిన యాకుమారునిం జూచి మంచివృష్టి ఫలోన్ముఖమైనపంటను జూచి సంతసించునటులు సంతసించును. అతిథినృపాలుఁడు చిరకాలము సుఖము ననుభవించి రాజ్యము కుమారుని కిచ్చి స్వర్గమునకుం జనియెను. కుశునిపౌత్రుఁడైనయానిషధుఁడు జలధిగంభీరుఁడై భూమినెల్ల నేకాతపత్రముగ నేలెను. ఆనిషధునియనంతరమున నతనినందనుఁడు నలుఁడు రాజ్యము వహించి కనవునేలను మదగజంబటులు పరబలముల గసిమసంగి ప్రఖ్యాతుఁ డయ్యెను. నలుఁడు ఖేచరస్తుతయశస్కుని, గగనశ్యామశరీరుని, శ్రవణమటులు ప్రియదర్శనుని నభుఁడను నందనుని గాంచెను. ధర్మతత్పరుఁడైన నలుఁడు తనకుమారునకు నుత్తరకోసలరాజ్యమిచ్చి పునర్జన్మరహితమైనపదవిఁ బడయుటకై తపోవనంబున కరిగెను. నభునకుఁ బుండరీకుఁడు జనియించెను లక్ష్మి పుండరీకాక్షుని జేరినచందమున నాపుండరీకమహారాజుం జేరెను. అతఁడు కొంతకాలము రాజ్యమేలి జగతికి క్షేమ మొనరింపఁజాలిన క్షేమధన్వనియను కుమారునకుఁ బట్టము గట్టి తపోవనంబుల కరిగెను. ఆక్షేమధన్వునకు సురసమానుఁడైన దేవానీకుఁడు తనయుఁడై జనియించెను. అధికభక్తుఁడైనకుమారునిచేత క్షేమధన్వని పుత్రవంతుఁడైనట్లు అధికవాత్సల్యముగలతండ్రిచేత దేవానీకుఁడు పితృమంతుఁ డయ్యెను. యజ్వయు గుణనిధానమునైన తండ్రి రాజ్యము కుమారునియందుఁ బెట్టి త్రిదివమున కరిగెను. అతని కొమారుఁడు జితేంద్రియుఁడై మధురవచనుఁడై యెల్లవారిని వశము చేసికొని వైరుల

కు నైతము ప్రియుఁ డయ్యెను. ప్రియవాక్యములుగలవానికి మృగములు నైతము లోబడునన మనుష్యులమాట చెప్ప నేల? హీనులసహవాసము చేయక పడుచు వాఁడయ్యు దుర్వ్యసనంబులఁ దగుల్కొనక నిరుపమానభుజబలముచే నతఁడు వసుమతి నేలెను. తండ్రియనంతరమున నతఁడు చతురుపాయములచేత నాల్గుదిశలను సాధించి యేలఁజొచ్చెను. అతఁడు పరలోకంబున కరుగ లక్ష్మి యతనికొమారుఁడైన పారియాత్రు నాశ్రయించెను. అతనికి శిలుఁడను కొమారుఁడుదయించెను. అతఁడు రాతిపలక వంటి వక్షస్థలముగలవాఁడు. అతఁడు శత్రువులను పరాజయము బొందించియు స్తోత్రమునకు సిగ్గుపడునట్టి యుదారశీలుఁడు. పడుచువాఁడైన యాకొమారుని దండ్రియావరాజ్యమునందు ప్రతిష్ఠించి సుఖములఁబడసెను. రాజుయొక్కవృత్తము కారాగృహమున బంధింపఁ బడినవానివంటిదై సుఖముఁ బడయనీయదుగదా!

ఆమహారాజు భోగంబులయందుఁ దృప్తి బడయక సొగసుగుఱ్ఱఁడు తేజవరాండ్రకు భోగ్యుఁడై యుండఁదలచుచుండగానే భోగింపలేనిముదిమి వచ్చియతని నాశ్రయించెను. ఆశిలున కున్నాభుఁడను నందనుఁడుదయించెను. ఆయున్నాభుఁడు పేరునకుదగినట్లు గొప్పనాభిగల్గి రాజమండలమునకు నాభిస్థానమై పంకజనాభుఁడట్లు వెలిసెను. అతనికి వజ్రనాభుఁ డనుతనయుఁ డుదయించెను. ఆకుమారుఁడు సంగ్రామమున వజ్రితుల్యుఁడై భూమండలము నేలెను. అతఁడు స్వర్గమున కరుగ నతనికుమారుఁడైన శంఖణుఁడు సింహాసన మెక్కెను. వార్ధిపర్యంత మగుమహీమండలము రత్నాంగములు కానుకలుగా సమర్పించి యారాజుం గొలిచెను. అతనిపరోక్షమున హరిదశ్వతేజుఁడు నశ్వినీదేవతులవంటి సుందరుఁడు నగువ్యుషితాశ్వుఁ డనురాజు గద్దె నెక్కెను. ఆరాజు విశ్వేశ్వరు నర్చించుటంజేసి విశ్వ మంతయు భరియింపఁ జాలినవిశ్వసహుఁడను కుమారుఁడు జనియించెను. అతఁడు దండ్రితో సమానమైన తేజము గలవాఁడు. ఆనయజ్ఞునకు నాదివరాహమూర్తియంశమున హిరణ్యనాభుఁ డనునందనుఁడుదయించెను. వాయువుం గలసినహిరణ్యరేతసుని వృక్షములు సహింపఁ జాలనట్లు శత్రువులతనితేజము సహింపఁ జాలకపోయిరి. ఆకుమారునివలన నారాజు పితృదేవతలఋణము దీర్చి యాజానుబాహుఁడైన యాతనయుని రాజ్యమందుఁ బ్రతిష్ఠించి ముదిమిని వల్కలములు దాల్చి వానప్రస్థాశ్రమము స్వీకరించెను. భానువంశప్రదీపకుఁడును సోమయాజియు నైనయాహిరణ్యనాభునకుఁ జందమామవలె నేత్రానందము గలుగఁజేయునట్టి కౌశల్యుఁ డనుకుమారుఁడుదయించెను. బ్రహ్మలోకపర్యంతము వ్యాపించిన యశము గలయాకౌశల్యునకు బ్రహ్మిష్ఠుఁ డనుకుమారుఁడు గలిగెను. బ్రహ్మవిదుఁడైనయాకుమారుని రాజ్యప్రతిష్ఠితుం జేసి యారాజు బ్రహ్మముతో నైక్య మొందె

ను. ఆమహీపాలుఁడు మంచిపుత్త్రుం గని వంశాలంకారమై నేల యేలఁ బ్రజలు పీడలం దొరంగి సంతతానందబాష్పములను విడుచుచుండిరి. ఆతనికుమారునిపేరు పుత్త్రుఁడు; ఆపుత్త్రుఁడు పుత్త్రరత్నమై నిరంతర గురుసేవాపరాయణుఁడై నారాయణతుల్యుఁడైన తండ్రిని ధన్యుం జేసెను. ఇంద్రసఖుఁడైనయారాజు తనపుత్త్రుఁడైన పుత్త్రునిచేత వంశము స్థిరమగు నని తలచి మూఁడుపుష్కరములందు స్నానము చేసి స్వర్గపథము గాంచెను. ఆపుత్త్రమహారాజు పత్ని పుష్యపూర్ణిమాదినమున నిజవ్రి ఫలచేతఁ బుష్యరాగంబును దెగడుకాంతిగల పుష్యుఁడను కుమారునిం గాంచ నతనిం గని జనులెల్ల సంతుష్టులైరి. జనకుఁడా పుష్యుని రాజ్యపదమందు నిల్పి యాత్మజ్ఞానసంపన్నుఁడైన జైమినిమహాఋషి నాశ్రయించి యాతని యనుగ్రహమువలన యోగమార్గములెల్ల నభ్యసించి జన్మరహితమైనపదవిం బడసెను. అనంతరము పుష్యునిపుత్త్రుఁడును ధ్రువసమానుఁడు నగు ధ్రువసంధి జగము నేలెను. అతఁడు సత్యసంధుఁడగుటచే శత్త్రురాజులు చేసికొనినసంధి శాశ్వతమై యుండెను. మానవసింహుఁడని చెప్పఁదగిన యాయాధ్రువసంధిమహారాజు సుదర్శనుండనుతనయుం గాంచి యాకుమారుని బాల్యమందె యొకనాఁడు వేఁట కరిగి యడవిలో సింహముచేతఁ జంపఁబడెను. ఆసుదర్శనుఁడు దర్శతరువాతఁ గనంబడు చందమామవలె దర్శనీయుఁడయ్యెను. అట్లు తండ్రి మృతి నొందఁ బ్రజల గతి లేకయుండుటం జూచి యమాత్యులు బాలుఁడైన సుదర్శనునికి సాకేతనగరమునకుఁ బట్టము గట్టిరి. అప్పుడు రఘువంశము లేతచందురునితోఁ గూడిన యాకసంబు వగిది సింగపుంగొదమమాత్రము గలయడవిపోలిక, తమ్మిపూవుతోడనే వెలయుకొలనురీతి నాచిన్నిరేనితో భాసిల్లెను. అతఁడు పట్టాభిషిక్తుఁడు కాఁగా సర్వవిధములఁ దండ్రిం బోలు నని ప్రజలు తలంచి యానందించిరి. ఏనుఁగుపిల్ల యంతమైనను గాలి విసరినప్పుడు మిన్నెల్ల వ్యాపించునని తోఁపదా! అతఁడారేండ్లవయసువాఁడైనను భద్రగజముపై నెక్కి రాజవీధులు సంచరించునప్పుడు తండ్రిమీఁది గౌరవముచేతఁ బ్రజలతనిని మిక్కిలి మక్కువతోఁ జూడఁదొడంగిరి, ఆబాలకుఁడు జనకునిసింహాసనము మీఁదఁ గూర్చుండి క్రమక్రమముగా నధికతేజోవంతుఁడయ్యెను. బాలుడగుటచేత సింహాసనముమీఁదఁ గూర్చున్నప్పుడు క్రిందికిదిగఁజారియుడుగున సువర్ణపాదపీఠము నంటకయుండునట్టి యాతని యొట్టిని లేఁతపాదములకు సామంతరాజులు తమకిరీటములు దగులునట్లు నమస్కరించిరి. మిక్కిలి చిన్నదైనను విరివిగఁ గాంతులఁ జిమ్ముచున్నయెడల నీలమును మహానీల మందురు గదా! అట్లే రాజు బాలుఁడైనను బ్రసిద్ధుఁడగుటం జేసి మహారాజుశబ్ద మతనికిఁదగి యుండెను. చెక్కులమీఁదజల్పములు వ్రేలుచుండ ముద్దులు మూ

టఁగట్టునట్టి యాతని మొగమునుండి వెడలునట్టి మాటలు సముద్రతీరమువఱకైనను వెల్లుచుండెను. సువర్ణపట్టబంధముతోడను, శృంగారతిలకంబుతోడను విరాజిల్లు నాతని సుందర మొగంబును శత్రురాజపత్నుల ముఖతిలకంబులను జెరిపివేయఁజాలిన యాజ్ఞల నొసఁగుచుండును. దిరిసెన పుష్పకంటె మెత్తనైన గలు దాల్చు నప్పుడు నైనను మిక్కిలి శ్రమపడునట్టి యాతని మేను పరితాప సహాయముచేతఁగదా మహీమండల భారము దాల్పఁగలిగెను. పలకమీఁద వ్రాసిన యక్షరములు నేర్చుకొనునంతలోపుననే వృద్ధులసహవాసమున నతఁడు దండనీతినెల్ల నేర్చుకొనెను. తాడితోఁ బోల్పఁదగిన యవస్థ నొందకమునుపే, జ్యాకిణాంకములు తాల్పకమునుపే, ఖడ్గమును బట్టకమునుపే యాతని బాహువు భూమిని ధరించి రక్షింపఁ దొడఁగెను. ఏండ్లు ముదిరినకొలఁది నారాజునకవయవ స్ఫూర్తి యగుటయేగాక, ప్రకృతిజనానందకరములైన గుణములుకూడ క్రమక్రమముగ వర్ధిల్లెను. అతఁడు గురువులకాయాసము కలుగకుండఁ ద్రివర్గమూలకమైన విద్యాత్రయమును సులభముగ నేర్చెను. జన్మాంతరమందు బడసిన శాస్త్రసంస్కార ప్రభావముచేతనో యన్నట్లు ప్రకృతిజనులను, మంత్రులను, సులభముగ స్వాధీనపఱుచుకొనెను. కాయము యొక్క యుత్తరార్ధమును విశాలముగఁ జేసి జుట్టు ముడివైచి యెడమతొడ కొంచెము వంచి విల్లు చేతఁబట్టి నారి చెవియంట లాగి బాణము సంధించి విలువిద్య నేర్చి యవ్విభుఁడు ప్రశంసనీయుఁడయ్యెను, విలాసవతులు నేత్రములతోఁ ద్రావఁదగినమకరందము, రాగబంధప్రవాళముగల మన్మథవృక్షమునకుఁ బుష్పము, సకలావయంబులకును నిర్వ్యాజమైన భూషణము, మొట్టమొదటి శృంగారపదమునైన యౌవనము నతఁడు ప్రాపించెను.

దూతికలు చక్కఁగా వ్రాసితెచ్చి చూపినచిత్రరూపులం గని యత్యంతరూపవతులైనవారి నేరి రాజునకు మంచిసంతానము గలుగవలెనను కోరికతో మంత్రులు తీసికొనివచ్చిన రాచకన్నియలను దర్శనీయుఁడైన సుదర్శనభూవిభుఁడు మును పే పరిగ్రహింపఁబడినభూలక్ష్మీదేవులతోఁగూడఁ బరిగ్రహించెను. అనంతరము సుదర్శనుఁడు కొంతకాలము రాజ్యమేలి యగ్నితేజుఁడైనయగ్నివర్ణుఁ డనుతనకుమారుని దనరాజ్యపదమందు నిలిపి వార్ధకమున దు జితేంద్రియుఁడై నైమిశారణ్యము జేరెను. అచ్చట పుణ్యతీర్థముల చేత దీర్ఘికలను, పర్ణశాలల చేత సౌధములను, దర్భల చేత హంసతూలికాతల్పములను, మఱచి యతఁడు తపము చేసెను. తండ్రి శత్రువులం గెలిచి ధాత్రి నిష్కంటకము చేసి తన కప్పగించినకారణమున నగ్నివర్ణుఁడు కష్టపడకుండఁ గడుసుఖమున రాజ్యమేలఁ జొచ్చెను.

# అగ్నివర్ణమహారాజు.

అగ్నివర్ణుఁడు కొంతకాలము కులోచితధర్మప్రకారము రాజ్య మేలి యనంతరము రాజ్యభారము మంత్రులయందుఁ బెట్టి స్త్రీవిధేయుఁడై యవ్వనము గడుపఁ జొచ్చెను. భోగపరాయణుఁడై నిచ్చలు జవరాండ్రం గూడి మెలఁగు నాతని యింట నిరంతరము మృదంగధ్వానము సెలఁగెను. ఉత్సవములపై నుత్సవములు జరుగఁజొచ్చెను. నిరంతరవిషయాసక్తుఁడైనయానరపాలుఁ డింద్రియసుఖంబుల క్షణమేని విడిచి యుండ నుల్లక తన్నుఁ జూడఁగోరు ప్రజలకు దర్శన మియ్యక యంతిపురమందె యెల్లప్పు డుండఁ జొచ్చెను. మంత్రులబలవంతము చేత నతఁ డొక వేళఁ బ్రజలకు దర్శన మియ్యఁగోరినను వారికి మొగముఁ గనఁబఱుపక గవాక్షము నుండి పాదము చాచి చూపి యదే తనదర్శనముగ భావింపవలసిన దని చెప్పును. కోమలనఖకాంతుల చేత నెఱ్ఱనై లేఁతయెండ పర్విన తామరపువ్వువలె నుప్పునామహా రాజుపాదమునకె యనుజీవు లందఱు నమస్కరించుచు వచ్చిరి. విలాసవతుల జలక్రీడల చేతఁ గలఁగినకంజాతములు కలిగి తీరములయందు సురతగృహములు కలిగినదీర్ఘికల యందు నవమదనతుల్యుఁడైనయారాజు క్రీడించుచుండును. ఆజలక్రీడల చేతఁ గన్నుల కాటుకయెల్ల గరఁగిపోవ, నధరముల లాక్షారస మెల్ల చెరిగిపోవ, సోయగెపుంజవరాండ్రు రాజున కింతింత యనరాని యానందము గల్గించిరి. చక్కఁగా వికసించిన కమ్మికొలను నాఁడుయేనుఁగుతోఁ గలిసి మగయేనుఁగు చొచ్చునట్లు తియ్యని తేనె వాసనలు గొల్పుపానభూములను రాజు ప్రియురాండ్రతోఁ జొచ్చును. ప్రియురాండ్రు వేడఁ దననోటనున్న యాసవము వారి కిచ్చును. వకుళవృక్షమట్లు మరల వారి పుక్కిట నున్నయాసవము గ్రహించును. ఆనరపాలునితొడమీఁద నెల్లప్పుడు రెండు పదార్థము లుండును. మధురస్వరముగలవీణ యొకటి; హొయలు గులుకుజవ్వని యొకతె. హారము లల్లలాడ సువర్ణకంకణములు ఘల్లుఘల్లు మన వీణలు వాయించి నృత్యములు సలుపునట్టి వెలజవ్వనుల కతఁడు యభినయంబులయందు గురుసన్నిధానమందె తప్పులు దిద్ది వారికి సిగ్గు గలిగించుచుండును. నృత్యము చేయుట చేత మిగుల నలసిసొలసిన ప్రియురాండ్రచెమ్మటలు పోవునట్లు తననోటితో నూది యాయాసమపనయించి తా నర్ధపతికంటె నమరపతికంటె నధికధన్యుఁ డని తలఁచి మురియుచుండును. అతఁడు ప్రణయిజనమును నవ్వు డువ్వుడు వంచింప వా రతనిని జిగురుటాకులవంటి మునివేళ్ళతో బెదరించియుఁ గోపించి కనుబొమలు విఱిచియు, మొలనూల్లతో బంధించియు నానందము గలుగఁ జేయుచుండురు. వెలయాండ్ర నతఁడు

కూడఁ దలఁచుకొన్నప్పుడు భార్యలది యెఱిఁగి వారింప నాగరికలమీఁదితమి వీడ
లేక చేటిలోనికలము చెమటచేత జారుచుండఁ దదేకధ్యానమున వారి బొమ్మలు
వ్రాయుచుండును. వంచకుఁడైనయారాజు రాత్రిప్రణయకోపము దాల్చినప్రియు
రాండ్రను బ్రసన్నుల జేసికొనుటకై వేకువను వారికడకుఁ బోయి కేలు మోడ్చి
నమస్కరించుచుండును. ఆనమస్కారమె వారికి మరల నలుకను రెండురెట్లు జేసెను.
అతఁడు స్వప్నములలో సవతులపేరు లెత్తినప్పుడు వానియిల్లాండ్రు వానివైపు
బన్నుండక రెండవప్రక్కకుఁ దిరిగి కన్నీటి బాన్పు తడియ జేతికంకణాలు విరిచి
క్రిందఁ బారవైచుచుండురు. ఇట్టి యెద్ద భార్య లడ్డగింతు రనుభయమున దూతికలు
మార్గములు జూప లతాగృహముల కరిగి యాభోగపరాయణుఁడు దాసీజనులతోడ
నతిరహస్యమునఁ గ్రీడించుచుండును. అతఁడు మందమతిచేత భార్యలఁ దప్పుపేళ్ళతోఁ
బిలువ వారు నాథా! అనె కల్పినభాగ్యమె మాకు నబ్బునటుల మమ్ముఁగూడ పిలువు
మని ప్రార్థించుచుండురు. అంగనలకాళ్ళకుఁ దానే స్వయముగా లత్తుక కూర్చు
చుండును. చంచలచిత్తుఁ డగుటచేత నది సగము చేసి మరల నంశుకము జారుటచే
మేఖలాసహితమై కన్నులవిందు సేయు నితంబమువంక దృష్టిఁ బఱపును. ప్రియు
రాండ్రు నిలువుటద్దములయందు నిలిచి భోగచిహ్నములు చూచుకొనుచుండ నలుకఁడు
కాకుండ వచ్చి వారివెనుక నిలిచి నవ్వును. అద్దములో వారతనినవ్వుప్రతిబింబమును
జూచి సిగ్గుపడుచుండురు. దేవేంద్రుని మించినరాజవేషంబు ధరియించి యది యద్ద
మునఁ జూచుకొనునప్పుడు నైత మారాజు తన మేనిమీఁద భోగచిహ్నము లనియెడు
భూషణములు ధరించునప్పుడు పొందినంతయానందము పొందఁడు. మిత్రకార్యంబు
దీర్పవలయునని మిషవెట్టి యాకాముకుఁడు పరకాంతనిమిత్తము పోవుచుండ నది
యెఱిఁగి యాతనియిల్లాండ్రు నీతొందరనడకవలననే 'నీదురభిప్రాయము తెలిసెను'
శఠుఁడా! నిలు నిలు మని సిగబట్టియాపిరి. రహస్యముగ నతఁడు రాత్రి ప్రియు
రాండ్రను గూడఁ బోవు ననుమాట దూతికలవలన నాతనిపత్ను లెఱిఁగి ముందుగా
వా రాసాంకేతికస్థలమున కరిగి 'కాముకా! మమ్ము మోసపుచ్చఁదలంచితివా ?
నడు నడు' మని యింటికిఁ దోడ్కొని వచ్చిరి. అంగనా స్పర్శ మను జంద్ర
కాంతి వంటి రాత్రి యెల్ల మేలుకొని కుముదాకరమువలె నతఁడు పవలు
నిద్రించుచుండును. అతఁడు కాంతలకు రహస్యముగా నంగాభినయము వాగ
భినయము నేర్పి యావిద్య వారిచేత మిత్రులయెద్దఁ బ్రదర్శింపఁ జేసి యభినయా
చార్యులమించి వెలయుచుండును. ఆరాజు మెడలో మద్దిమల్లెపూలదండలు, దాల్చి
కడిమిపుష్పాదిపూర్ణ మేనఁ బూసి నెమిలియాటలమించుక్రీడాపర్వతములం దతఁడు

విహరించుచుండెను. ఇట్లనేకవిధ యనిమేకవిలాసంబులతో, హంసమాలికల చె మమేఖలలతో నలంకరింపబడిన సుందరస్త్రీలతో సౌధములందును దివ్యసౌధరంగములందు డి యున్నట్టి కాంతలతో ను యున్న దినములు గడచెను. నరనాథుడు విడనాడి తన పూర్వులవలె నధిక సౌఖ్యములను లనుభవించుచు ధర్మములను శరీరమున నం దాల్చి యితరకార్యములను మాని యువతులను గడపెను. ఇట్లు గర్వరాయణు డైనను నా రాజును శత్రువులు ఎదిరించుటకు సాహసించుటచేత జయింపలేకపోయిరి, కానిపర తరుణీసంగమములవలన దక్షశాపమున గ్రసిం చిన చంద్రునివలె రాజయక్ష్మ చేత అతడు వైద్యులయొక్క వచనములను చెవినిబె ట్టడు. మద్యపానము మానడు. వనితాసంగము వదలడు. వ్యసనములలో దగు లొని కృశించుచున్నను మిక్కిలి కష్టము గా మొగము తెల్లబా రెను. ఆభరణములవిడనాడెను. మాట సన్నగిలెను. శరీరమున గాని నడువలేకపోయెను. రాజయక్ష్మపీడయు కామపీడయు ఎక్కువగుచున్న వెను. అప్పుడు రాజయక్ష్మకు లోనైన రాజుగల యా రఘువంశము అంత్యకళమాత్ర మిగిలిన చంద్రునివలె కాంతివిహీనమై మి గిలిన ... వర్షాకాలమందలి ... రాజులు మాటిమాటికి ... బయలు ... దాచిపెట్టి ... నము మాత్రము ... గాలి దెబ్బకు నిలువని దీపమువలె ... నిలువలేకపోయెను. అతడు మృతినొందెను ... మంత్రులు మిక్కిలి రహస్యముగ నతని ఉద్యానవనమునకు ... సహాయమున దహనము చేసిరి.

ఆ తరువాత గర్భవతియైన యాతని భార్య వృద్ధజనులయొక్కయు మంత్రుల యొక్కయు సహాయమున రాజ్యలక్ష్మిని వహించెను. భర్తృమరణజనితశోకోష్ణ బాష్పబిందువుల చేత ... యా దేవిగర్భము ... కలశములను పట్టాభిషేక సమయమునందు ... జలధారలచేత చల్లబడెను. ఆ రాణి గర్భంబు ధరించి ... ప్రసవసమయము ... దినములు ... సింహాసన మెక్కుచు మంత్రులసహాయమున రాజ్యమేలెను.